వాల్యూం - I
నెం. 1

వెల : రూ. 70-00
30 డిసెంబర్, 2024
సోమవారము

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

పేజి. నెం.

1. సంతాప ప్రతిపాదన : ... 01

భారత మాజీ ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్ గారి మృతి పట్ల
ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి సభలో ప్రవేశపెట్టిన సంతాప ప్రతిపాదన

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	:	శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్
కార్యదర్శి	:	డా. వి. నరసింహా చార్యులు
సంయుక్త కార్యదర్శులు	:	శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి
		శ్రీమతి వి.ఎన్. ప్రసన్న కుమారి
ఉప కార్యదర్శులు	:	శ్రీమతి ఎస్. నాగమణి
		శ్రీ ఎమ్. రఘుమారెడ్డి
		శ్రీ ఎ. సుధాకర్
సహాయ కార్యదర్శులు	:	శ్రీ పి. శ్రీనివాస్
		శ్రీమతి ఎ. పద్మాసిని
		శ్రీమతి ఎస్.వి.వి. సత్యశ్రీ
		శ్రీ ఎన్. సుజిత్ కుమార్
		శ్రీ కె. భాస్కర శ్రీనివాస్
		శ్రీ సి.కె. వినోద్‌కుమార్
		శ్రీమతి బి. ప్రమీల
		శ్రీ ఆర్. రమణయ్య
		శ్రీ సిహెచ్. నాగరాజు
		శ్రీ పి. వెంకటేశం
		శ్రీ మహమ్మద్ హమీదుద్దీన్
		శ్రీ పి.వి. సునీల్
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ జి. రాజేశ్వరరెడ్డి

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(నాలుగవ సమావేశం – రెండవ విడత సమాగమం – మొదటి రోజు)

సోమవారం, డిసెంబర్ 30, 2024

(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

సంతాప ప్రతిపాదన

మిస్టర్ స్పీకర్:– భారత మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి మృతి పట్ల సంతాప ప్రతిపాదన. గౌరవ ముఖ్యమంత్రి గారూ...

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి (గౌరవ ముఖ్యమంత్రి – పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి, సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు మరియు ఇతర కేటాయించబడని శాఖామాత్యులు) :– అధ్యక్షా, భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి మృతి పట్ల ఈ సభ తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది. శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది.

అంతర్జాతీయ ప్రఖ్యాతి పొందిన ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు భారత దేశానికి తన విశిష్టమైన సేవలను అందించారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుగా, భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్ పర్సన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, భారత ప్రధాన మంత్రిగా ఆయన వివిధ హోదాలలో తన సేవలను ఈ దేశానికి అందించారు.

డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు మన దేశంలో ఆర్థిక సంస్కరణలకు రూపశిల్పి. 1991 మరియు 1996 మధ్య కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు భారత ఆర్థిక వ్యవస్థను సరళీకరించి, ఆర్థికస్థితిగతుల దశాదిశను మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు అమలు చేయటంలో కీలక పాత్ర పోషించారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలతో అంతర్జాతీయ స్థాయిలో భారత ఆర్థిక వ్యవస్థను సుస్థిరంగా నిలబడేలా చేయగలిగారు.

2004 నుండి 2014 మధ్య భారత ప్రధానమంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్‌గారు తన పదవీ కాలంలో ఎన్నో చారిత్రాత్మకమైన సామాజిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కూలీలకు ఉపాధి కల్పించే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNREGA), పరిపాలనలో పారదర్శకతను చాటిచెప్పే సమాచార హక్కు చట్టం, ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ప్రారంభించారు. అందరికీ ఆధార్ కార్డు లాంటి సామాజిక విప్లవాత్మక కార్యక్రమాలు ఆయన హయాంలోనే మొదలయ్యాయి.

నాలుగు కోట్ల తెలంగాణ రాష్ట్రప్రజలు డాక్టర్ మన్మోహన్ సింగ్ గారికి ఎంతో ఋణపడి ఉన్నారు. ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రఏర్పాటుకు మార్గం సుగమమైంది. 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఎన్నో ఏండ్ల పోరాటం ఫలించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. మన్మోహన్ సింగ్ గారు మన దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు చేసిన సేవలకు ఈ సభ అపారమైన కృతజ్ఞతలను తెలియజేస్తుంది.

ఆర్థిక రంగంలో దేశానికి ఆయన మార్గదర్శి. భవిష్యత్తు తరాలకు ఆదర్శప్రాయమైన నాయకుడు డాక్టర్ మన్మోహన్

సింగ్ గారు. ఆధునిక భారతదేశాన్ని ప్రపంచ స్థాయిలో మేటి దేశంగా నిలబెట్టేందుకు ఆయన చూపిన దార్శనికత, ఆయన చేసిన కృషిని అందరూ గుర్తుంచుకోవాలి. భావి తరాలు స్మరించుకోవాలి.

భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ గారికి అత్యున్నత పౌర పురస్కారం **"భారతరత్న"** ను ప్రదానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సభ తీర్మానం చేస్తోంది.

10.10 ఉ. అధ్యక్షా, డా. మన్మోహన్ సింగ్ గారి గురించి ఈ దేశంలో ప్రతి యువకుడికీ, ప్రతి రైతుకూ, ప్రతి పేదవాడికీ మనం ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఈ దేశంలో ఎల్.పి.జి, లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్, సరళీకృత ఆర్థిక విధానాలను తీసుకువచ్చి ప్రపంచంతోనే పోటీ పడే విధంగా మన భారతదేశాన్ని తీర్చిదిద్దడంలో, మన తెలంగాణ బిడ్డ పి.వి.నరసింహారావు గారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆర్థిక మంత్రిగా వారు వేసిన పునాదులు.. ఈరోజు ప్రపంచ దేశాలతో మనం పూర్తి స్థాయిలో పోటీ పడుతున్నాము అంటే ఆనాడు డా. మన్మోహన్ సింగ్ గారు తీసుకున్న నిర్ణయాలు.

అదేవిధంగా అధ్యక్షా, డా. మన్మోహన్ సింగ్ గారు ఈరోజు ప్రపంచమే గర్వించదగ్గ ఆర్థికవేత్త. ఈ ఆర్థికవేత్తని ఈదేశం కోల్పోవడం అనేది మనకు తీరని లోటు. ఈలోటు వారి కుటుంబానికే కాదు, యావత్ దేశానికీ, ప్రపంచానికే లోటు. ఒక గొప్ప తత్వవేత్త, ఆర్థికవేత్త, గొప్ప నాయకుడిని కోల్పోవడం జరిగింది అధ్యక్షా.

అధ్యక్షా, నీతి, నిజాయితీ, నిబద్ధత అని ఒకవేళ ఎవరినైనా ఉదహరించాల్సి వస్తే, రోల్‌మాడల్‌గా ఎవరినైనా మనం తీసుకోవలసి వస్తే ఈ తరంలో డా. మన్మోహన్ సింగ్ గారితో పోటీపడే వారే ఎవరూ లేరు అని ఈ సభ ద్వారా నేను తెలియజేయదలచుకున్నాను. చాలా మంది వారు మౌనంగా ఉంటారనో, మౌనముని అని, యాక్సిడెంటల్ ప్రైమినిస్టర్ అని రకరకాలుగా విమర్శకులు మీడియాలో విమర్శించినా, వారు ఎప్పుడూ కూడా వారి సహనాన్ని కోల్పోకుండా పనినే ధ్యాసగా, పనిచేయడమే తన జీవిత లక్ష్యంగా ఈ దేశ ప్రజలను ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేయడం, వాళ్ళకోసమే తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మహనీయుడు డా. మన్మోహన్ సింగ్ గారు. విమర్శకులు సైతం వారిని విమర్శించలేని పరిస్థితులు కల్పించి ఒక గొప్ప నాయకుడుగా వారు రాణించారు. ఈ తరం ఆర్థిక విషయాలలో కానీ, రాజకీయ పరమైన అంశాలలో కానీ ఎవరినైనా ఆదర్శంగా తీసుకోవాలి అనంటే మొదటి స్థానంలో ముందు వరుసలో ఉండేది డా. మన్మోహన్ సింగ్ గారు అధ్యక్షా.

వారి నిరాడంబరత, అంటే ఒక దేశ ప్రధానమంత్రిగా పది సంవత్సరాలు పనిచేసిన వ్యక్తి ఎంత నిరాడంబరంగా.. ఎందుకంటే పార్లమెంటులో వారు రాజ్యసభలో ఉన్నప్పుడు, లోక్‌సభలో మేము ఉన్నాము. ఒక ధర్నా కార్యక్రమంలో నేను, పెద్దలు ఉత్తమ్‌కుమార్ రెడ్డి గారు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు కూర్చున్నపుడు మాతోబాటు వారు ధర్నా కార్యక్రమంలో కూర్చున్నారు. వారు ఆనాడు వచ్చి మా మధ్యలో, మాతోపాటూ కూర్చుని ఈ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి, ప్రభుత్వాలు ఆధిపత్యం చెలాయించడానికి, పెత్తనం చెలాయించడానికి చట్టాలను వినియోగించడాన్ని వ్యతిరేకిస్తూ మొదటిసారి పార్లమెంటు సభ్యులైన మాతోపాటూ వారు అక్కడకు వచ్చి నిరసన కార్యక్రమంలో కూర్చుని, వారు ప్రజాస్వామ్యం పట్ల ఎంత విశ్వాసంతో, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో ఏ విధంగా పనిచేశారో వారితోపాటూ ఆరోజు ధర్నాలో పాల్గొనడం అనేది నాకైనా, పెద్దలు ఉత్తమ్‌కుమార్ రెడ్డిగారికైనా, కోమటిరెడ్డి వెంకటరెడ్డిగారికైనా జీవితకాలం గుర్తుండిపోయే సంఘటన అధ్యక్షా. అధ్యక్షా, ఎవరైనా ప్రధానమంత్రి ఆర్థిక మంత్రిగా, రిజర్వుబ్యాంకు గవర్నరుగా, అదేవిధంగా ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా .. ఇలా రకరకాల హోదాలలో పనిచేసి దేశ ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన వ్యక్తి, పార్లమెంటు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్న ఆలోచనతో అందరి సహచర

పార్లమెంటు సభ్యులతో నిరసనలో పాల్గొనడం అనేది వారి నిరాడంబరత, వారికి ప్రజాస్వామ్యం పట్ల ఉన్న విశ్వాసం, నమ్మకానికి మనం ఆ అంశాన్ని ఉదహరించుకోవచ్చు అధ్యక్షా.

అదేవిధంగా, డా. మన్మోహన్ సింగ్ గారి గురించి ఈదేశం, ముఖ్యంగా ఈ దేశంలో ఉన్న పేద రైతు కూలీలు ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారు. ఈరోజు ఉపాధి హామీ పథకం, భూమిలేని రైతు కూలీలకు ఒకపని కల్పించాలి, వంద రోజులు పని కల్పించాలి, ఆ వంద రోజుల పనిద్వారా పేదలకు ఆహార భద్రత కల్పించవచ్చు అన్న గొప్ప లక్ష్యంతోని ఉమ్మడి రాష్ట్రంలో అనంతపూర్‌లో, అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్‌లో ఈ కార్యక్రమాన్ని దేశానికే అంకితం చేయడం జరిగింది.

ఇదేవిధంగా సమాచార హక్కు చట్టం కావచ్చు, రైట్ టు ఎడ్యుకేషన్ కావచ్చు, ఫుడ్ సెక్యూరిటీ యాక్టు కావచ్చు.. ఇట్లా ప్రతీ అంశంలో పారదర్శకమైన పరిపాలనను అందించాలి అంటే పరిపాలనలో తీసుకురావాల్సిన మార్పులను అన్నింటినీ వారు ఏమాత్రం కూడా వెనకడుగు వేయకుండా, ప్రజలకు ఉపయోగపడుతుంది అని అనుకుంటే వారు ఏమాత్రం కూడా వెనుకా ముందూ ఆలోచన చేయకుండా పది సంవత్సరాలు ఒక అద్భుతమైన పరిపాలనను అందించడమే కాకుండా చట్టంలో సమూలమైన మార్పులను తీసుకురావడం జరిగింది అధ్యక్షా.

అదేవిధంగా 2013 భూ సేకరణ చట్టం. గతంలో ప్రభుత్వాలు భూమి సేకరించాలి అన్నప్పుడు, భూమిని తీసుకోవాలి అనుకున్నప్పుడు, భూ యజమానులతో సంబంధం లేకుండానే భూమిని తీసుకున్న పరిస్థితులు, నష్ట పరిహారం కూడా పూర్తి స్థాయిలో ఇవ్వకుండా అన్యాయం జరుగుతున్న సమయంలో.. 1894 నుండి దాదాపుగా 113 సంవత్సరాలు భూసేకరణ చట్టం ఒకే విధంగా కొనసాగింది. బ్రిటిషర్లు ఏర్పాటు చేసిన భూసేకరణ చట్టం స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా దాదాపుగా ఆరున్నర దశాబ్దాలు అదే చట్టాన్ని కొనసాగించినం.

10.20 ఉ. అధ్యక్షా, అలాంటి చట్ట సవరించడం ద్వారా భూమిని కోల్పోయే యజమానులకే కాదు, భూమి లేని, గ్రామాలను నమ్ముకొని, కులవృత్తులు, చేతివృత్తుల ద్వారా గ్రామాల మీదనే ఆధారపడి బతుకుతున్న నిరుపేదలకు కూడా మీరు R&R Package అమలుచేసినప్పుడు వాళ్లను కూడా మీరు దృష్టిలో పెట్టుకోవాలి, ప్రభుత్వం ద్వారా వారికి నష్ట పరిహారం ఇవ్వాలనే ఒకగొప్ప మార్పుని వారు తీసుకువచ్చారు అధ్యక్షా. ఎందుకంటే గ్రామాలు ముంపుకి గురైనప్పుడు, గ్రామంలో ఉండే భూ యజమానులకు మరియు ఆస్తులు ఉన్నవారికే నష్టపరిహారం వచ్చేది. గ్రామాలనే నమ్ముకున్న కులవృత్తులు, చేతివృత్తుల వాళ్లు, భూమి లేని వాళ్లు, సొంతంగా ఇళ్లు లేని వారికి గతంలో ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం ఇచ్చేది కాదు. కానీ డా. మన్మోహన్ సింగ్‌గారు తీసుకువచ్చిన 2013 భూసేకరణ చట్టం ద్వారా గ్రామాలలో ఉన్న ముంపుకి గురవుతున్న నిరుపేదలు ఎవరైతే ఉన్నారో, కుల వృత్తులను, చేతి వృత్తులను నమ్ముకున్న వాళ్లకు కూడా కచ్చితంగా ప్రభుత్వం సహాయం అందించాలి అని, గ్రామమే మునిగినప్పుడు, గ్రామం మీద ఆధారపడి బతుకుతున్న వాళ్లు నిరాశ్రయులైనప్పుడు, ఎక్కడికి వెళ్లాలో, ఎక్కడ బతకాలో తెలవని పరిస్థితి. ఇదొక మానవత్వం లేని ఆలోచన కాబట్టి దీనిని తప్పకుండా తొలగించి వాళ్లకు నష్టపరిహారం ఇవ్వడమే కాకుండా, వాళ్లకి కష్టం కలగకుండా చూడాలని ఆ చట్టంలో డా. మన్మోహన్ సింగ్ గారు మార్పులు తీసుకువచ్చారు. అదే విధంగా 2006 అటవీ హక్కుల చట్టం తీసుకురావడం ద్వారా ఈ పోడు భూముల పట్టాలు ఈ రోజు మనం ఇవ్వగలుగుతున్నాము అని అంటే, అటవీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీలు, గిరిజనులను ఆదుకోవడానికి అటవీ హక్కుల చట్టాన్ని సవరించడం ద్వారా వాళ్ల పట్ల కూడా మానవతా భావంతో డా. మన్మోహన్ సింగ్ గారు వ్యవహరించారు అధ్యక్షా.

ఈ రకంగా చెప్పుకుంటూ పోతే, మనకు డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగాన్ని ఇవ్వడం ద్వారా, ఎంత గొప్ప పరిపాలనను అందించడానికి వారు పునాదిని వేసినో,

ఆ స్ఫూర్తిని కొనసాగించే విధంగా,ఆ స్ఫూర్తితో పరిపాలనను అమలుచేసే విధంగా డా. మన్మోహన్ సింగ్ గారు చట్టంలో మార్పులు తీసుకొచ్చి, ఆ మార్పుల ద్వారా ప్రజలకు మేలు జరిగే విధంగా వారు నిర్ణయాలు తీసుకున్నారు అధ్యక్షా. అలాంటి నాయకుడిని, ఒక గొప్ప తత్వవేత్త, ఆర్థికవేత్త, మానవతావాదిని కోల్పోవడం అనేది మన దురదృష్టం, నిజంగా తీరని అన్యాయము ఈ దేశానికి జరిగిందని నేనీ రోజు భావిస్తున్నాను. ఈరోజు వాళ్ల కుటుంబం బాధ కంటే, ఈ దేశంలో ఉండే నిరుద్యోగ యువత, ముఖ్యంగా ఈ దేశంలో ఈరోజు ప్రపంచానికే మన మేధా సంపత్తిని ఎగుమతి చేయగలుగుతున్నాము అనంటే, సరళీకృత విధానాలు తీసుకురావడం ద్వారా మన దగ్గర చదువుకున్న ఇంజనీర్లు కావచ్చు, లేకపోతే మేధావులు కావచ్చు, ఈరోజు ప్రపంచంలో ఐ.టి. రంగాన్ని శాసించగలుగుతున్నాము అని అంటే, వారు తీసుకువచ్చిన సరళీకృత విధానాల వలన, ఈ దేశంలో చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు ప్రపంచ దేశాల్లోనే ఆర్థిక రంగంలోనే కాకుండా, సాంకేతిక రంగంలోను శాసించే స్థాయికి మనం ఈరోజు ఎదిగినామ‌ు అనంటే, ఇందులో డా.మన్మోహన్ సింగ్ గారి యొక్క పాత్ర, వారి యొక్క ఆలోచనా విధానాన్ని మనం ఈ సందర్భంగా ఈ సభలో స్మరించుకోవలసిన అవసరం ఉంది.

అదే విధంగా అధ్యక్షా, డా.మన్మోహన్ సింగ్‌గారు ఈ దేశానికి మాజీ ప్రధాని, మాజీ ఆర్థిక మంత్రి, మాజీ ఆర్‌బిఐ గవర్నర్. కాని తెలంగాణాకు మాత్రం ఆత్మబంధువు. ఎందుకంటే అరవై ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. ప్రధాన మంత్రి హోదాలో, తెలంగాణకు రాష్ట్ర హోదాను కల్పించిన గొప్ప మానవతావాది. తెలంగాణాతో ఆయన అనుబంధం విడదీయలేనిది. రాష్ట్రం ఉన్నంతవరకు మరిచిపోలేనిది. ఈ రాష్ట్రానికి పురుడుపోసిన డాక్టర్‌గా మన్మోహన్‌సింగ్‌గారిని తెలంగాణ సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుంది. తెలంగాణ ప్రజలకు శ్రీమతి సోనియా గాంధీగారు ఇచ్చిన మాటను డా.మన్మోహన్ సింగ్ గారు పార్లమెంటరీ ప్రక్రియను నెరవేర్చే బాధ్యతను తీసుకున్న Great Leader డా.మన్మోహన్ సింగ్ గారు. తెలంగాణ బిల్లును రెండు సభలో పాస్ చేయించిన సారథిగా ఈ రాష్ట్రం గుండెల్లో ఎప్పటికీ ఆయన స్థానం పదిలంగా ఉంటుంది. అటువంటి మహనీయుడికి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరపున ఈ శాసన సభ ద్వారా రాజకీయాలు, పార్టీలకు అతీతంగా కృతజ్ఞతలు తెలపడమే కాకుండా, ఘన నివాళి అర్పించాల్సిన అవసరం ఉంది. ఉద్యమాన్ని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని, తెలంగాణ రాష్ట్రఏర్పాటుకు మన్మోహన్ సింగ్ గారు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రజలు శ్రీమతి సోనియా గాంధీగారికి ఎంత రుణపడి ఉంటారో, అలాగే మన్మోహన్ సింగ్ గారికి కూడా అంతే రుణపడి ఉంటారు అధ్యక్షా.

అధ్యక్షా, వారి మరణ వార్త విని, బెల్గాం నుండి హుటాహుటిన మేము దిల్లీకి బయలుదేరాం. వారి కుటుంబాన్ని కలిసాము. వారి సతీమణిని కలిసి, నన్ను నేను పరిచయం చేసుకున్నాను. ఎందుకంటేవారికినివాళులర్పించి, వారి సతీమణిగారికి ప్రగాఢ సానుభూతి తెలపాలన్న ఆలోచనతో, వారి సతీమణిని కలిసి, నేను రేవంత్ రెడ్డిని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని అని నమస్కారం పెడితే, కూర్చో అని చెప్పి, తెలంగాణ రాష్ట్రం వారు చాలా ప్రత్యేకమైన పరిస్థితుల్లో ఆ రాష్ట్రాన్ని మీకు ఇవ్వడం జరిగింది..మన్మోహన్ సింగ్ గారికి తెలంగాణ రాష్ట్రం అంటే ప్రత్యేకమైన అభిమానం ఉంది. ఆ రాష్ట్రాన్ని మీరు కష్టపడి, అభివృద్ధి పథం వైపుకి నడిపించండి, వారి ఆశీస్సులు మీకు ఉంటాయి అని చెప్పి, వారి సతీమణి చెప్పినప్పుడు స్పష్టంగా తెలంగాణ ప్రభుత్వం మొత్తం వారి కుటుంబానికి అండగా నిలబడి ఉంటుందని నాకు అనిపించింది. తెల్లవారి AICC ఆఫీసు నుండి వారి శవయాత్రకు బయలుదేరడానికి అన్నిఏర్పాట్లు చేసినప్పుడు వారి వాహనంలో కూర్చోవడానికి నన్ను ముందుకి పిలిస్తే, నేను అక్కడికెళ్లి నిల్చున్నాను. పక్కన ఒక మహిళ నిల్చుని, మీరెవరు అని నన్ను అడిగింది. నేను సహజంగా అక్కడికి నివాళులర్పించడానికి వచ్చిన వాళ్లు ఎవరో అనుకుని, చాలా క్యాజువల్‌గా మాట్లాడాను. కాస్సేపయినంక మాట్లాడితే, వారు మన్మోహన్‌సింగ్ గారి రెండవ కుమార్తె అని తెలిసింది. అంటే

ఎంత సింపుల్‌గా, ఎంత నిరాడంబరంగా వారి రెండవ కుమార్తె అక్కడ నిల్చోవడమనేది ఆ కుటుంబం యొక్క నిరాడంబరత సూచిస్తుంది. అంటే ఒక ప్రధానమంత్రిగా పది సంవత్సరాలు, ఆర్‌బిఐ గవర్నర్‌గా,ఆర్థిక మంత్రిగా, వివిధ హోదాల్లో ఈ దేశానికి సేవలందించిన మన్మోహన్ సింగ్ గారి కుటుంబము అంత నిరాడంబరతను ప్రదర్శించి,వారి అభిమానులు, శ్రేయోభిలాషుల మధ్యలో నిల్చుని ఆ కార్యక్రమంలో పాల్గొన్నారంటే గొప్ప విలువలతో, వారి కుటుంబాన్ని ముందుకు నడిపించినట్లు మనకు అర్థమవుతుంది.

వాళ్ల కుటుంబానికే కాదు, ఈరోజు ఈ దేశ యువత అందరికీ కూడా డా.మన్మోహన్ సింగ్‌గారు ఆదర్శము. వారి ఆదర్శాలను తీసుకుని, వారి మేధోశక్తిని మన యువత అందిపుచ్చుకుని వారిచ్చిన అవకాశాలను మనం ఈరోజు ప్రపంచానికి సేవలందించి,ప్రపంచాన్నే శాసించే స్థాయికి ఈరోజు మన దేశం ఆర్థికంగా నిలబడింది అధ్యక్షా. ఆర్థికంగా, రాజకీయంగా, సాంకేతికంగా ఈరోజు అన్ని రకాలుగా ఈ దేశం బలపడింది. ఈ దేశం ప్రపంచంతో పోటీపడుతున్నది అంటే, మన్మోహన్ సింగ్‌గారి సేవలు ఎన్నో ఈ దేశానికి ఉపయోగపడ్డాయి. అలాంటి గొప్ప నాయకుడిని కోల్పోయిన సందర్భంగా ఈరోజు తెలంగాణ శాసనసభ తమరి నాయకత్వంలో ఒకరోజు సమావేశాలను ఏర్పాటుచేసి, రాజకీయాలకు అతీతంగా, ఎన్ని విషయాలలోనో మనకు భిన్న అభిప్రాయాలు ఉన్నా, ఈ దేశంలో ఉండే 140 కోట్ల ప్రజలకు అన్ని రాజకీయ పార్టీలు, అన్ని సంఘాలు RSS నుండి RSU వరకు, కమ్యూనిస్టుల నుండి మిగతా రాజకీయ పార్టీల వరకు ఎవరిని తీసుకున్నా, ఈరోజు మన్మోహన్ సింగ్ గారి పట్ల ఏకాభిప్రాయమే వ్యక్తం చేయాల్సిన సందర్భం. ఏ పదవులైనా, ఏ హోదాలైనా వాటికే గౌరవం,వన్నె తీసుకొచ్చారు డా. మన్మోహన్ సింగ్ గారు. అందుకే మీ అందరి తరపున, సభలో అందరి సభ్యుల సంపూర్ణ సహకారంతో డా.మన్మోహన్ సింగ్ గారికి "భారతరత్న" ఇవ్వాలని తమరి ముందు, ఈ సభలో, సభ్యులందరి ఆమోదం కోరుతూ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాను.

తెలంగాణ రాష్ట్రఏర్పాటులో భాగంగా, రాజ్యసభలో ఒక దశలో రాజ్యాంగ సవరణ కొరకు వచ్చిన చర్చలో, తెలంగాణ రాష్ట్రం వెనక్కుపోతుందేమోనన్నంత గందరగోళ పరిస్థితులు ఏర్పడినాయి అధ్యక్షా. ఆ సమయంలో వారి అనుభవాన్ని కంప్లీట్‌గా ఉపయోగించారు. ముఖ్యంగా మనం ఇక్కడ గుర్తుచేసుకోవాల్సింది డా.మన్మోహన్ సింగ్ గారికి అత్యంత సన్నిహితుడుగా, అత్యంత నమ్మకమైన సహచరుడిగా జైపాల్‌రెడ్డిగారు కొనసాగారు. జైపాల్‌రెడ్డిగారు ఆరోజు మన్మోహన్ సింగ్ గారితో మాట్లాడి, సమన్వయ పరిచి, రాజ్యసభలో ఆ సవరణలకు అవసరమైన స్టేట్‌మెంట్‌ను వారు ప్రధాన మంత్రి హోదాలో, రాజ్యసభలో వారు ఇవ్వడం జరిగింది. రాజ్యాంగ సవరణ కొరకు తిరిగి లోక్‌సభకు పంపాల్సిన క్లిష్టమైన పరిస్థితులలో, వారు వ్యూహాత్మకంగా, చతురతతో రాజ్యసభలో ప్రకటన చేయడంతో ఈరోజు మన సర్వ స్వతంత్ర తెలంగాణ రాష్ట్రంగా మనం ఏర్పడడమే కాకుండా, పది సంవత్సరాలు పూర్తి చేసుకుని, తెలంగాణ రాష్ట్రంలో మనం పరిపాలన కొనసాగిస్తున్నాము. వారితో ఈ తెలంగాణకు ఉన్న ఈ బంధము మనం ఎప్పటికీ మరిచిపోలేనిది. కాబట్టి ఈరోజు తమరి అనుమతితో, Financial District లో ఒక మంచి ప్లేస్‌ను ఎంపిక చేసి, డా. మన్మోహన్ సింగ్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ద్వారా శాశ్వతంగా మనము వారి వర్ధంతులు, జయంతులు, వారి జ్ఞాపకాలు శాశ్వతంగా, తెలంగాణ ప్రజల గుండెల్లో పదిలమై ఉండే విధంగా, ఇంకే విధంగా ఎవరైనా సలహాలు, సూచనలు ఇచ్చినా కూడా ఒక మంచి ప్రాంతంలో మాజీ ప్రధాన మంత్రి డా.మన్మోహన్ సింగ్ గారి విగ్రహాన్ని ప్రజలందరూ గుర్తుపెట్టుకునే విధంగా, ప్రజలందరూ వారిని స్ఫూర్తిగా తీసుకునే విధంగా ఎక్కువగా ప్రజలెక్కువగా మమేకమవుతుంటారో, కలుస్తుంటారో ఆప్రాంతంలో డా. మన్మోహన్ సింగ్‌గారి విగ్రహం ఉంటే, మనందరికి స్ఫూర్తి నింపినవారవుతారు. కాబట్టి ఈ సభలో ఒకనిర్ణయం తీసుకుని ఏ ప్రాంతంలో, ఎక్కడ పెడితే బాగుంటదో మనం తరువాతయినా చర్చించుకుందాం, కాకపోతే తెలంగాణ

గడ్డమీద డా.మన్మోహన్ సింగ్ గారి విగ్రహం పెట్టుకోవడం అనేది సముచితమైన నిర్ణయం అని నేను భావిస్తున్నాను. దానికి కూడా ఈ సభద్వారా ఆమోదం తెలపవలసిందిగా సభ్యులందరినీ కోరుకుంటూ, మీ దగ్గర సెలవు తీసుకుంటున్నాను అధ్యక్షా, ధన్యవాదాలు.

10.30 ఉ. **MR.SPEAKER**:- Now, discussion on Condolence Motion.

శ్రీ వుల్లు భట్టి విక్రమార్క (గౌరవ ఉప ముఖ్యమంత్రి – ఆర్థిక మరియు ప్రణాళిక, ఇంధన శాఖామాత్యులు):– అధ్యక్షా, మాజీ ప్రధానమంత్రి డా. మన్మోహన్‌సింగ్ గారి మృతి పట్ల సభలోని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఈ సభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని, వారి గుర్తింపుగా విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టాలని, భారతరత్న అవార్డును కూడా ఇవ్వాలని సభానాయకులు గౌరవ ముఖ్యమంత్రిగారు తెలిపిన అంశానికి సంపూర్ణ మద్ధతును తెలియజేస్తూ, వారి మృతి పట్ల తీవ్రమైన విచారాన్ని వ్యక్త పరుస్తున్నాను. అదే విధంగా శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

కొంతమంది ఈ భూమి మీదకి ఎలా వస్తారో, అలాగే మాయమవుతారు. మరికొందరు తాము నడిచిన నేలంతా మానవతాపరిమళాలను వెదజల్లుతారు. ఇంకొందరు తమ అసాధారణ ప్రతిభతో తాము పుట్టిన దేశానికి వన్నె తెస్తారు. అటువంటి అరుదైన అసామాన్యమైన మహోన్నతుడు డా. మన్మోహన్‌సింగ్ గారు. వారు ఈ దేశంలో చేపట్టిన అనేక పదవుల్లో ప్రతి పదవికీ వన్నె తెస్తూ, తీసుకున్న ప్రతి బాధ్యతను ఈ దేశ అభివృద్ధి కోసం కఠినమైన నిర్ణయాలు తీసుకున్న విషయం కూడా మనందరం గమనంలోకి తీసుకోవలసిన అవసరం ఉంది. వారు సరళీకృత ఆర్థిక విధానాలతో ఈ దేశ సంక్షోభ కాలానికి ఆర్థిక సమతుల్యాన్ని పరిపుష్టి చేసి ఈ దేశం ఒక బలమైన ఆర్థిక శక్తిగా ప్రపంచదేశాలలో నిలబెట్టారని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. Globalization గానీ Liberalization గానీ, గ్లోబల్ ట్రేడ్‌కు ఈ దేశ ద్వారాలు తెరచి ప్రపంచంలో భారతదేశాన్ని గొప్పగా నిలబెట్టినటువంటి ఆనాటి గొప్ప ఆర్థిక శాఖా మాత్యులుగా, దేశ ప్రధానిగా వారు తీసుకున్న నిర్ణయాలన్ని ఉపయోగపడుతున్నాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

కేవలం ఈ దేశ ఆర్థిక విధానాలతో మాత్రమే సంబంధం కాకుండా, ఈ దేశంలో ఉన్న అనేక అసమానతల్ని, ఈ దేశంలో ఉన్న సామాజిక పరిస్థితుల్ని కూడా పూర్తిగా అవగాహన చేసుకొని చట్టాల ద్వారా అపారమైన సేవలు చేసి, ఈదేశంలోని ప్రజల్ని ధైర్యంగా నిలబెట్టిన వ్యక్తి డా. మన్మోహన్‌సింగ్ గారు. దేశ సామాజిక రంగానికి వారు చేసిన సేవల్లో ఆనాడు యూపిఏ ఛైర్‌పర్సన్‌గా శ్రీమతి సోనియాగాంధీ గారి ఆధ్వర్యంలో దేశ ప్రధానిగా డా. మన్మోహన్‌సింగ్ గారు చేపట్టిన కార్యక్రమాలు అనేక కుటుంబాల్ని దారిద్ర్యం నుండి బయటపడేయడమే కాకుండా, పేద ప్రజల అభ్యున్నతి కోసం సామాజిక రంగంలో బీదా, బిక్కి ప్రజల సమున్నతి కోసం, వారి హక్కుల కోసం అనేక చట్టాలను రూపకల్పన చేసిన విషయాన్ని కూడా మనందరం గుర్తు చేసుకోవలసిన సందర్భం ఇది.

ఇప్పుడే సభా నాయకులు చెప్పినట్లు, ఈ దేశ పరిపాలనలో ఒక రకమైన సమాచారాన్ని తీసుకోవాలంటే ఏ సామాన్యుడికి కూడా అందుబాటులో లేనటువంటి పరిస్థితుల్లో, ఎవరూ ఊహించని రీతిలో 2005వ సంవత్సరంలో వారు సమాచార హక్కును తీసుకొని వచ్చి ఒక సామాన్య పౌరుడికి భారతదేశంలో జరుగుతున్న పాలనా పరమైన విశేషమైన హక్కును పొందేలా చేశారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదప్రజలందరికీ కనీసం ఒక ఉపాధి అవకాశం దొరకాలనే ఆలోచనతో తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమం ఈ దేశ గతినే మార్చిందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా రెసిషన్ వచ్చినప్పుడు ఉపాధి హామీ పథకం ద్వారా కొన్ని వేల కోట్ల రూపాయలు సర్కులేషన్‌లోకి రావడం వల్ల, భారతదేశం అటువంటి ఎకనమిక్ రెసిషన్ భారీన పడకుండా కాపాడుకోగలిగామంటే ఆ చట్టం ఉపయోగపడిందనడంలో ఎటువంటి సందేహం లేదు.

అదే విధంగా తరతరాలుగా అటవీ ప్రాంతాల్లో నివాసం ఉంటూ, ఎటువంటి హక్కులు , ఆత్మ గౌరవం లేకుండ

బ్రతుకుతున్న వారందరికీ భూమిపై హక్కును కల్పించి, ఆత్మగౌరవంతో బ్రతకడానికి తీసుకొచ్చిన అటవీ హక్కుల చట్టం, 2008లో తీసుకొచ్చిన అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా చట్టం, ఈ దేశంలో ఉన్నటువంటి వికలాంగుల సంక్షేమం కోసం ఆరోగ్య భద్రత, గర్భిణీ స్త్రీల రక్షణ కొరకు, వృద్ధుల పెన్షన్‌కి పెద్ద ఎత్తున ఈ చట్టం ఉపయోగపడిందని మనందరం గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది.

అదే విధంగా ప్రతి ఒక్కరికీ ఆహారం దొరకాలని ఒక హక్కుగా ఈ దేశంలో ఆహార భద్రత చట్టం తీసుకొచ్చిన వారు గొప్ప ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్‌గారని తెలియజేస్తున్నాను. ఈదేశంలో పెద్ద ఎత్తున స్ట్రీట్ వెండర్స్ గురించి ఆలోచన చేసి గ్రామీణ ప్రాంతాలలో క్రయ, విక్రయాలు జరిపే వ్యాపార లక్షణాల కోసం వారి జీవన ప్రమాణాలను పెంచడం కోసం తీసుకొచ్చిన ఈ చట్టం కూడా ఈదేశ ఆర్థిక విధానాన్ని, గతిని మార్చడానికి కూడా క్రింది స్థాయిలో పేదరికంలో ఉన్న ప్రజలకు ఉపయోగపడిందని చెప్పుకోవడం ఈదేశంలో గమనిస్తున్నాము.

2013 భూసేకరణ చట్టానికి సంబంధించి మనకి భూమిపైనున్న ఒక ఎమోషనల్ బాండేజీకి సంబంధించి బాధపడతున్న తరుణంలో దేశ ఆర్థికాభివృద్ధి జరగాలి, రావలసిన పరిశ్రమలు రావాలి, ఇరిగేషన్ ప్రాజెక్టులు రావాలి, అనాధిగా భూమిపై హక్కులు పొందిన వాళ్లు నష్టపోకుండా ఉండడం కోసం కావలసిన రీతిలో పెద్ద ఎత్తున అనేక మార్పులు తీసుకొచ్చి వారు కూడా బాధ పడకుండా ఉండే విధంగా తీసుకొచ్చిన ఈ చట్టం నిజంగా ఒక రెవల్యూషనరీ చట్టమని, ఆనాడు ప్రగతిశీల భావాలు కలిగిన వారందరూ దీనిని శ్లాఘించిన విషయం కూడా మనందరికీ తెలుసు.

అదే విధంగా తరతరాలుగా వస్తున్న అత్యంత వెనుకబడి అమానవీయమైన స్కావెంజర్ విధానంలో ఉన్న ప్రజల యొక్క మనోగతాన్ని కూడా అర్థం చేసుకొని, వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలని, అమానవీయమైనస్కావెంజర్ విధానాన్ని పూర్తిగా రద్దుచేస్తూ, 2013లో స్కావెంజర్ చట్టాన్ని తీసుకొనివచ్చి ఆ చట్టంలో వారందరికీ పునరావాసం కల్పించాలనే విధానం తీసుకొచ్చిన చట్టం నిజంగా ఈ దేశ గౌరవాన్నే ప్రపంచదేశాల్లో పెద్ద ఎత్తున పెంచింది. ఇటువంటి అనేకరకాలైన చట్టాలతోపాటు ఈ దేశంలో ఉన్న ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఒక ప్రధానమంత్రిగా, ఒక సామాన్యుడిగా ఈ దేశంలో వారందించిన పాలన ఈ దేశాన్ని పాలించేవారందరికీ ఒకస్ఫూర్తి నిస్తుందని, వారి మార్గం కూడా అందరూ అనుసరించదగినదని రాజకీయాల్లో ఉండే వారందరూ గమనించాలి.

ఈదేశంలో ఉండే ప్రజలందరికీ వారు చేసిన సేవలు, వారు చూపించిన దార్శనికత ఎంత గొప్ప విషయమో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర విషయంలో వారు తీసుకున్న నిర్ణయం తెలంగాణ ప్రజలకు అత్యంత ఇష్టమైన నిర్ణయమని చెప్పవచ్చు. దశాబ్దాలుగా తెలంగాణ కోసం కొట్లాడుతున్న ఈ ప్రజల యొక్క ఆలోచనలను నిజం చేయడం కోసం, ఆ సభలో సంపూర్ణమైన మెజారిటీ లేకపోయినప్పటికీ, ఆనాటి యూపీఏ చైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీగారు, వారు కలిసి మాట్లాడుకొని, మిగతా విపక్షాలవారిని ఒప్పించి ఆ చట్టాన్ని రెండు సభల్లో కూడా పాస్ చేపించి తెలంగాణ ప్రజల కలను నిజం చేసిన ఒకగొప్ప ప్రధాని మన్మోహన్ సింగ్‌గారు. వారు చేసిన సేవలను యావత్తు తెలంగాణ ప్రజలందరూ తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం గుర్తు చేసుకుంటుందని ఈ సందర్భంగా మీ అందరికీ మనవి చేస్తున్నాను అధ్యక్షా.

10.40 ఉ. అలాగే దేశంలో రైతుల పక్షాన పెద్దఎత్తున ఆలోచన చేసి, ఈ దేశంలో, రాష్ట్రంలో రైతుల పెట్టుబడి కోసం వారు తీసుకున్న రుణాలు భారమై అవి కట్టలేక డెట్ ట్రాప్‌లో పడుతున్న పరిస్థితిని అర్థం చేసుకొని దేశ వ్యాప్తంగా మొట్టమొదటిసారి రైతులు తీసుకున్న రుణాన్ని మాఫీ చేసిన మొట్టమొదటి ప్రధానమంత్రి డా.మన్మోహన్ సింగ్ గారేనని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

(ఈ సందర్భంగా సభలోని సభ్యులు బల్లలు చరిచారు.)

ఈ రోజు ఈ రాష్ట్రంలో రూ. 2 లక్షలు రుణమాఫీ చేసుకున్న సందర్భంలో నేరుగా రూ. 21 వేల కోట్లు తెలంగాణ

రాష్ట్రం రైతుల ఖాతాలో వేయడం జరిగిందంటే దానికి మార్గదర్శి కూడా ఆనాటి డా. మన్మోహన్ సింగ్ గారేనని ఈ సందర్భంగా మనమందరం గుర్తు చేసుకుంటూ, మరొక్కసారి వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తున్నాను. సభా నాయకుడు ప్రవేశపెట్టిన తీర్మానానికి, ముఖ్యంగా భారతరత్న ఇవ్వాలని చెప్పిన అంశాన్ని ఏకగ్రీవంగా సభలో ఉన్న సభ్యులందరూ కూడా ఆమోదం తెలపాలని, అలాగే ప్రముఖమైన ప్రాంతంలో వారి విగ్రహం పెట్టాలని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పిన అంశానికి అందరం సానుకూలంగా స్పందించి ఆమోదం తెలపాలని, మీ అందరిని కోరుతూ, మరొక్కసారి వారి ఆత్మకు శాంతి కలగాలని, అటువంటి నాయకులు భారతదేశంలో పుట్టినందుకు మనమందరం గర్విస్తూ, ఈ దేశానికి వారు ప్రధానమంత్రిగా చేసి ఈ దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా ప్రపంచ దేశాల్లో నిలబెట్టే విధంగా చేసిన విధానాలన్నీ ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్ళాలని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ కె.తారక రామారావు (సిరిసిల్ల):- అధ్యక్షా, ధన్యవాదాలు. గౌరవనీయులు పెద్దలు దివంగత మాజీ ప్రధానమంత్రి మాన్యులు డా.మన్మోహన్ సింగ్ గారికి నివాళులు అర్పించే సందర్భంగా ముందుగా ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి పూర్తిగా మా పార్టీ తరఫున మద్దతు తెలుపుతున్నాను. డా.మన్మోహన్ సింగ్ గారికి భారత రత్న ఇవ్వాలని పెట్టిన ప్రతిపాదన దానికి కూడా సంపూర్ణంగా మా మద్దతు ప్రకటిస్తూ, తప్పకుండా ఈ భారత రత్న అనే పురస్కారానికి వారు ఖచ్చితంగా అర్హులనే మాటను మా పార్టీ సమర్థిస్తూ, వారి ప్రతిపాదనకు పూర్తి స్థాయిలో ఏకీభావం తెలియజేస్తున్నాను.

డా.మన్మోహన్ సింగ్ గారి గొప్పతనాన్ని వారి యొక్క సామర్థ్యాన్ని, తెలివితేటలను మొట్టమొదటగా గుర్తించింది మన తెలంగాణ బిడ్డ పి.వి.నర్సింహా రావు అనేది నిర్వివాదాంశం. ఆనాడు పి.వి.నర్సింహారావు గారు భారతదేశానికి ప్రధానమంత్రిగా ఎన్నికైన తరువాత సాధారణంగా lateral entry అని వింటుంటాము. అంటే, రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులను కూడా మనం రాజకీయాల్లో ముఖ్యంగా ప్రభుత్వాల్లో ముఖ్యమైన పాత్రల్లో తీసుకురావడాన్ని లేటరల్ ఎంట్రీ అంటారు. కాని, లేటరల్ ఎంట్రీ అనే విధానాన్ని ఆనాడు పి.వి.నర్సింహారావు గారు తీసుకొచ్చి రాజకీయాలతో సంబంధం లేని ఒక ఆర్థికవేత్త ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన ఒక మంచి తెలివైన ఆర్థికవేత్త మనకు అందుబాటులో ఉన్నారని గుర్తించి, గౌరవించి వారిని ఆర్థికమంత్రిగా ఆనాడు నియమించారు. ఆర్థికమంత్రిగా నియమించిన తరువాత డా.మన్మోహన్ సింగ్ గారు 1991లో అనుకుంటాను అధ్యక్షా.. సబ్జెక్ట్ టు కరెక్షన్.. బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పుడు ఒక గొప్ప మాట అన్నారు. ఆయన అన్న మాట let the whole world hear loud and clear, India is wide and awake.. అంటే, ప్రపంచం మొత్తం వినాల్సిన సమయం వచ్చింది, నా దేశం మేల్కొని ఉంది అనే మాట ఆనాడు ఒక ఆర్థికవేత్తగా ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టే సందర్భంలో డా. మన్మోహన్ సింగ్ గారు మాట్లాడిన మాటలు అధ్యక్షా. ఆ మాటలు, ఆయన సిద్ధాంతం ఆనాటి పి.వి. నర్సింహా రావు గారి నాయకత్వం ఈనాడు ఈ దేశంలో సమూలమైన సంస్కరణలు తెచ్చింది. ఈ దేశంలో ఎన్నో రకాలైన విప్లవాత్మకమైన మార్పులు కూడా వచ్చాయి. కేవలం 15 రోజులు మాత్రమే ఫారెక్స్ నిలువలు ఉన్న ఆనాటి పరిస్థితి నుండి మొత్తం ప్రపంచం అంతా ఆశ్చర్యపోయే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణశీలి డా.మన్మోహన్ సింగ్ గారేనని ఈ సందర్భంగా తెలుపుతున్నాను. అనవసరపు డాంబికాలు, అనవసరపు ఆర్భాటాలు, హడావుడి లేకుండా, simple living, high thinking అనే మాటకు పర్యాయపదంగా డా. మన్మోహన్ సింగ్ గారేనని చెప్పుకోవచ్చు.

Loyalty is a very rare trait. విశ్వాసం అనేది రాజకీయాల్లో చాలా అరుదైన పదం. అటువంటిది తనకు అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించిన ఒక మహానుభావుడు డా. మన్మోహన్ సింగ్ గారేనని తెలుపుతున్నాను. ఎందుకంటే, ఒక ఆర్థికమంత్రిగా తరువాత

ప్రధానమంత్రిగా పదేళ్ళపాటు పని చేసి పూర్తిస్థాయిలో ఆ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత కూడా అంతే స్థాయిలో నమ్మకంగా ముఖ్యమంత్రి గారు చెప్పినట్లు అవసరమైతే ప్రజాస్వామిక నిరసన కార్యక్రమాలు కూడా ఆ పార్టీ తరఫున సభ్యుడిగా పాల్గొన్న ఒక అభ్యుదయ వాది, నిరాడంబర మనిషి డా. మన్మోహన్ సింగ్ గారేనని తెలుపుతున్నాను.

వారు ప్రధానమంత్రిగా ఉన్న కాలంలోనే మా నాయకుడు మా పార్టీ అధ్యక్షులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు దాదాపు సంవత్సరన్నర కాలంపాటు వారి కేబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. మంత్రిగా పనిచేసే క్రమంలో ఆనాడు 2004లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో గెలిచిన తరువాత కేబినెట్‌లో భాగస్వామ్య పక్షాలను కూడా ఆహ్వానించి కేసీఆర్ గారిని కేబినెట్ మంత్రిగా తీసుకున్న తరువాత వెంటనే ఒక చిక్కు సమస్య వచ్చింది. కేసీఆర్ గారికి పిప్పింగ్ పోర్ట్‌ఫోలియో ఇవ్వడం జరిగింది. ఇస్తే వెంటనే డీఎంకే వాళ్ళు, అప్పుడు వాళ్ళు యుపీఏలో ప్రధాన భాగస్వామ్యపక్షం, వాళ్ళు వెంటనే అభ్యంతరం లేవనెత్తారు. మీరు మాకు కమిట్‌మెంట్ ఇచ్చారు. మాకు ప్రామిస్ చేశారు, మీరు వెంటనే వారికి ఎట్లా ఇస్తారని అభ్యంతరం పెడితే, కేసీఆర్ గారు ఒక్క క్షణం కూడా సంకోచించకుండా వెంటనే డా.మన్మోహన్ సింగ్ గారి వద్దకు వెళ్ళి.. డాక్టర్ గారూ, నేను వచ్చింది పదవుల కోసమో, పోర్ట్‌ఫోలియో కోసమో కాదు. నేను వచ్చింది నా తెలంగాణ కోసమని చెప్పి తిరిగి వారికి ఆ పిప్పింగ్ పోర్ట్‌ఫోలియోను ఇస్తే ఆ రోజు డా.మన్మోహన్‌సింగ్ గారు అన్న మాట అధ్యక్షా.. "చంద్రశేఖర్ రావు గారూ, మీరు ఏ నిబద్ధతతో, ఏ సిద్ధాంతం కోసం ఏ రాష్ట్రం కోసమైతే వచ్చారో అది ఫలించాలని మనసారా నేను కోరుకుంటున్నాను. ఈనాడు మీరు తీసుకున్న నిర్ణయం వల్ల గొప్ప గుర్తింపు, గౌరవం వస్తుంది. మీరొక కర్మయోగిగా గుర్తించబడతారు" అని వారు చెప్పడం జరిగింది. పెద్దలు చెబుతారు అధ్యక్షా, nothing can stop an idea, whose time has come. అంటే ఒక గొప్ప ఆలోచనకు ఒక అరుదైన సందర్భానికి సమయం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తి దానిని ఆపలేదు. ఆ విధంగా డా.మన్మోహన్ సింగ్ గారు నమ్మారు కాబట్టి ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, తెలంగాణ ఉద్యమానికి ఉన్న బలం, తెలంగాణ ప్రజల యొక్క పోరాట స్ఫూర్తి ఇవన్నీ కూడా అర్థమయ్యాయి కాబట్టి 2014లో అనివార్య పరిస్థితిలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగినప్పుడు డా.మన్మోహన్ సింగ్ గారి నాయకత్వంలో జరిగిందనే విషయాన్ని మేము మరిచిపోము. అధ్యక్షా ఒక్క మాట గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది. డా.మన్మోహన్ సింగ్ గారి నిబద్ధత గుర్తు చేసుకునే సందర్భంలో సరిగ్గా ప్రధానమంత్రిగా ఎన్నికైన 6 నెలలకు పెద్దలు, మా పార్టీ అధ్యక్షులు, కేసీఆర్ గారు ఆనాటి కేబినెట్ సహచరుడిగా వారికొక ముఖ్యమైన డెలిగేషన్ తీసుకొని వస్తున్నాను సార్ దయచేసి మాకు సమయమివ్వండి అని అడిగారు. నేను చెబుతున్న విషయం మీరు పేపర్‌లో కూడా చూసుకోవచ్చు. డిసెంబర్ 18, 2004వ సంవత్సరం అంటే, సరిగ్గా 20 సంవత్సరాల క్రితం జరిగిన విషయం. వారు సమయమిచ్చారు. మాకు 5 నిమిషాలు కాదు. నేను ఒక ముఖ్యమైన బృందాన్ని తీసుకొస్తున్నాను. ఆర్. క్రిష్ణయ్య, వకుళాభరణం కృష్ణమోహన్ రావు గారు కొంతమంది మా దగ్గర బలహీన వర్గాల కోసం పనిచేసే నాయకులున్నారు వారందరినీ తీసుకొని వస్తున్నాను. దయచేసి ఒక అరగంట, 45 నిమిషాలపాటు సమయమివ్వండి అని అడిగారు. అంటే, డా.మన్మోహన్ సింగ్ గారి గొప్పతనం ఏమిటంటే, సమస్య తీవ్రత తెలుసుకున్న తరువాత ఓబీసీలకు అన్ని రాష్ట్రాల్లో మంత్రిత్వ శాఖలున్నాయి, కేంద్రంలో కూడా ఓబీసీ వెల్ఫేర్ మినిస్ట్రీ పెట్టాలని డా.మన్మోహన్ సింగ్ గారి దగ్గరికి కేసీఆర్ గారు డిసెంబర్ 18, 2004వ సంవత్సరంలో ఒక బృందాన్ని తీసుకొని వెళితే, 45 నిమిషాలు సమయమిచ్చిన ప్రధానమంత్రి గారు గంటన్నర సేపు వారితో గడిపారు. మొత్తం విషయం అర్థం చేసుకొని, అధ్యయనం చేయడానికి గంటన్నర సేపు వారితో గడిపి తప్పకుండా నేను చూస్తాను అని చెప్పిన మాటను గుర్తుచేస్తున్నాను.

ఎన్నో అడ్డంకులు, అభ్యంతరాలు ఉన్నది వాస్తవం. డా.మన్మోహన్ సింగ్ గారు ప్రజాస్వామిక ఉద్యమాలకు అండగా

నిలబడ్డారు. ఎన్నడూ కూడా వారు ఎన్ని ఒత్తిడులకు లోనైనా కూడా సంస్కరణల బాటనుండి వెనక్కి తగ్గలేదు. We can call him a silent architect of modern India. ఆయనకు పేర్లు పెట్టారు. మన్మోహన్ కాదు, ఈయన మౌనమోహన్ సింగ్ అని రకరకాలుగా అన్నారు. కానీ, ఆయనపాటికి ఆయన పనిచేసుకుంటూ పోయారు. ఏమేమి సంస్కరణలు తేవాలో తీసుకుంటూ వచ్చారు. వారు చాలా విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చారు. ఇప్పుడే డిప్యూటీ సీఎం గారు, సీఎం గారు కూడా చెప్పారు. ఎంతమంది ఎన్ని రకాలుగా ఆయనను అవమానించే ప్రయత్నం చేసినా నిజంగా చెప్పాలంటే, అవమానం చేస్తే ఆకాశం స్థాయి తగ్గదు. ఎన్ని నిందలు వేసినా మహోన్నతులు తొణకరు, బెణకరు. అటువంటి స్థితప్రజ్ఞులను మనం డా.మన్మోహన్ సింగ్ గారిలో చూశాము. డా.మన్మోహన్ సింగ్ గారి గురించి మాట్లాడుకునేటప్పుడు తప్పకుండా మన తెలుగు బిడ్డ, పి.వి. నర్సింహా రావు గారి గురించి కూడా మనం గుర్తు చేసుకోవాలి. మేము మా పార్టీ అధ్యక్షులు పెద్దలు కేసీఆర్ గారి ఆదేశం మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నేను, నాతోపాటు మా గౌరవ రాజ్యసభ సభ్యులందరం వారి ఇంటికి వెళ్ళి నివాళులు అర్పించి, తెల్లారి అంత్యక్రియాల్లో మేము కూడా పాల్గొని అంత్యక్రియలు ముగిసిన తరువాత వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి మా తరఫున సానుభూతి తెలిపి వచ్చాము. కానీ, అక్కడికి పోయినప్పుడు ఒక్క మాటలో బాధ అనిపించింది.

10.50 ఉ. ఢిల్లీలో మన్మోహన్ సింగ్ గారికి జరిగిన గౌరవప్రదమైన వీడ్కోలు మన తెలంగాణ బిడ్డ పి.వి నరసింహారావు గారికి దక్కలేదనే బాధ మాత్రం కొంత అనిపించింది అధ్యక్షా. దయచేసి నేను ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. ఇది తెలంగాణ శాసన సభ..., ఇప్పడు మీరు భారతరత్న అన్నారు దానికి సంతోషం. అదే మాదిరిగా విగ్రహం పెడదామన్నారు, తప్పకుండా ప్రభుత్వం ఎక్కడ నిర్ణయిస్తే అక్కడ మేమందరం కూడా వస్తాం. తప్పకుండా అటువంటి కార్యక్రమాల్లో కలిసి పాల్గొంటాం. కానీ, పి.వి.నరసింహా రావు గారికి కూడా ఢిల్లీలో ఒక మెమోరియల్ ఏర్పాటు చేయాలని శాసనసభ తీర్మానిస్తే మన తెలంగాణ బిడ్డ, మన వాడు పి.వి నరసింహారావు గారికి కూడా కేంద్ర ప్రభుత్వం సముచితమైన గౌరవం ఇవ్వాలనే ప్రతిపాదన మన శాసన సభ నుండి పోతే బాగుంటుంది. ఎందుకంటే, ఢిల్లీలో అందరి ప్రధాన మంత్రులకు మెమోరియల్ ఉంది అధ్యక్షా. కానీ ఒక్క పి.వి.నరసింహారావు గారికి లేదు. అది ఒక రకంగా మనకు అవమానం, తీరని లోటు. కాబట్టి ఈ తీర్మానంతో పాటు దాన్ని కూడా జత పరిచి పంపించినట్లైతే తప్పకుండా వారిని కూడా..., మన్మోహన్ సింగ్ గారిని పి.వి నరసింహారావు గారే రాజకీయాల్లోకి తీసుకువచ్చారు. అటువంటి పి.వి నరసింహారావు గారికి కూడా ఒక మెమోరియల్ ఏర్పాటు చేయాలని శాసన సభ ఏకగ్రీవంగా తీర్మానం చేస్తే మన గౌరవం కూడా పెరుగుతుంది, మన సభ గౌరవం కూడా పెరుగుతుందనే మాటను తెలియజేస్తూ, ముఖ్యమంత్రి గారు పెట్టిన సంతాప తీర్మానానికి సంపూర్ణమైన మద్దతును తెలియజేస్తూ, ఆ కుటుంబానికి మా ప్రగాఢమైన సానుభూతిని కూడా తెలియజేస్తున్నాము.

శ్రీ డి. శ్రీధర్ బాబు (గౌరవ సాంకేతిక సమాచార, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రములు & వాణిజ్యం మరియు శాసనసభ వ్యవహారాల శాఖామాత్యులు) :- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, ఈ రోజు మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ గారి మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తపరుస్తున్నాను. ఇంతకు ముందు పెద్దలందరూ చెప్పినట్లు డా.మన్మోహన్ సింగ్ గారు మన దేశ రాజకీయాల్లోనే ఒక మహోన్నత శిఖరాలకు ఎదిగారు. ఆనాడు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జవహర్‌లాల్ నెహ్రూ గారు కానీ, ఇందిరా గాంధీ గారు కానీ, రాజీవ్ గాంధీ గారు కానీ, పి.వి నరసింహారావు గారు ఏర్పాటు చేసిన పునాదులపై ఒక సమున్నత ఆర్థిక సౌధాన్ని నిర్మించారు. భారత ఆర్థికాభివృద్ధికి ఆ నలుగురు తమ తమ విలక్షణ మార్గంలో వారిదైన తీరులో దోహదపడ్డారు. డా.మన్మోహన్ సింగ్ గారు ఆ పునాదులపై అనేక పాలసీ విధానాలు, సరళీకృతమైన విధానాలను మరింత పటిష్టపరిచారు. ఆనాడు ఆ నలుగురి నేతల ప్రగతిశీల దృక్పథానికి పరాకాష్టగా నూతన శకానికి

అనుగుణంగా రూపుదిద్దికునే కార్యచరణ మొదలు పెట్టారు. మిశ్రమ ఆర్థిక విధానం ద్వారానే దేశ పారిశ్రామిక పునాది సాధ్యమవుతుందని ఆ రోజు జవహర్‌లాల్ నెహ్రూ గారి గురించి ఆలోచన చేసి పునాదులు వేస్తే దాని తదుపరి బ్యాంకుల జాతీయకరణ, సాగునీటి రంగం ముఖ్యంగా హరిత విప్లవానికి ప్రాధాన్యత ఇస్తూ ఇందిరా గాంధీ గారు ఆ పునాదిని ఇంకా కూడా బలంగా ముందుకు తీసుకువెళ్ళారు.

భారతదేశ చరిత్రలోనే ముందంజలో ఉండాలనీ 1980వ దశకంలో కంప్యూటర్లను, కమ్యూనికేషన్ వ్యవస్థను రాజీవ్‌గాంధీ గారు వేసిన ఈ కార్యాచరణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తూ, 1991వ సంవత్సరంలో ఆనాడు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో పి.వి నరసింహారావుగారు ఆనాడున్న ఆర్థిక ఇబ్బందులకు సంబంధించి ఇంతకు ముందు పెద్దలందరూ చెప్పినట్లు ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించి 1991వ సంవత్సరంలో.., ఇంతకు ముందు మా సోదరులు కేటీఆర్ గారు చెప్పినట్లు మన తెలుగు బిడ్డ పి.వి నరసింహారావు గారి నాయకత్వంలో, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ గారిని ఆర్థిక మంత్రిగా తీసుకురావడం వల్ల ఈ రోజు మనం అనుభవిస్తున్న ఫలితాలు ప్రత్యక్షంగా కనబడుతున్నాయి. మరి స్వర్గీయ పి.వి నరసింహారావు గారి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించి అప్పుడున్న క్లిష్టమైన పరిస్థితులను అధిగమించడంలో పి.వి నరసింహారావు గారు ప్రధానమంత్రిగా, వీరు ఆర్థిక మంత్రిగా, ప్రణబ్ ముఖర్జీ గారు కామర్స్ మంత్రిగా ఇతర మంత్రివర్గ సోదరులందరూ కలుసుకొని ఆనాడు సరళీకృతమైన ఆర్థిక విధానాలను తీసుకురావడం మన దేశ ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడ్డాయి. ఈ తరుణంలో రాబోయే కాలంలో సాంకేతిక పరంగా మన భారతదేశాన్ని ముందుంచాలని రాజీవ్ గాంధీ గారు ఆలోచన చేశారు. వారి ఆలోచన మేరకు ముందుకు నడిపి పి.వి నరసింహారావు గారు కానీ, దాని తదుపరి మన్మోహన్ సింగ్ గారు కానీ చేపట్టిన అనేక కార్యక్రమాలు మనందరికీ కూడా ప్రతీకగా నిలిచాయి.

ఇంతకు ముందు పెద్దలు చెప్పినట్లు, జాతీయ ఉపాధి హామి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలో ఉంటున్న పేద వారికి ఉపాధి కల్పించడం, దాని తదుపరి అనేక సంస్కరణల్లో భాగంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన పెద్దలు మన్మోహన్ సింగ్ గారి ఆలోచన విధానానికి మనందరం కూడా ఈ రోజు చర్చించుకుంటున్నామంటే వారొక ఆలోచనతో ముందుకు తీసుకువెళ్ళే ప్రయత్నం చేశారు. ఒకసారి మేము గుర్తు చేసుకోవాలి. ఆనాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వారిని ఒక ఆర్థికవేత్తగా గుర్తించి 1980వ సంవత్సరంలో Member, Space Commission, Government of India లో, దాని తదుపరి ఫైనాన్స్ కమిషన్‌లో 1982లో ఫైనాన్స్ మెంబర్ సెక్రటరీగా, అదే విధంగా 1985వ సంవత్సరంలో గవర్నర్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దాని తదుపరి ప్లానింగ్ కమిషన్‌లో డెప్యూటీ ఛైర్మన్‌గా, అదే విధంగా వారు ఈరోజు ఎదుగుతున్న తరుణంలో వారికున్న పరిజ్ఞానం, వారికున్న ఆలోచన ఆ రోజు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం గుర్తించింది. ఆనాడున్న ఇందిరా గాంధీ గారు కానీ, రాజీవ్ గాంధీ గారు కానీ తదుపరి పి.వి నరసింహారావు గారు ఇంత గొప్ప ఆర్థికవేత్తను ప్రభుత్వంలో తీసుకురావాలని ఆలోచన చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. ఆ ప్రభుత్వ హయాంలోనే ఇంత గొప్ప ఆలోచన పరున్ని తీసుకురావడం జరిగిందని మీ ద్వారా గౌరవ సభ్యులకు కూడా తెలియజేస్తున్నాను. ఈ రోజు మనం చెప్తున్నాం అనేక సందర్భాల్లో చూశాం. వారు చెప్పిన కొన్ని అంశాలను కూడా సభ దృష్టికి తీసుకువస్తాము. వారేమన్నారు అధ్యక్షా. ఇంతకు ముందు సోదరులు హిస్టరీ గురించి చెప్పారు. దాని తదుపరి ఒక గొప్ప మాటన్నారు.

History will be kinder to me and rightly so, I would like to mention here, despite one of the most qualified and accomplished leaders India has seen as said by my colleague, “he faced relentless criticism, very often unwarranted, particularly from the section of the Media and from the Opposition”. The irony is stark, Dr. Manmohan Singh in his tenure as a Prime

Minister, held 114 press meets during his previous tenure, but still he is branded as a silent Prime Minister. Few people, the Opposition sometimes, called him "Accidental Prime Minister". Being the architect of the India's economic resurgence and the leader who brought a transformation in the quality of life of the poor people, especially, for the middle class, this person has to be remembered all the time, that being the real reason today, on the Floor of this House, our Leader of the House has moved the Motion to pay the condolences. This reflects everybody over here, ...

11.00 ఉ. ఇప్పుడు మనం చూస్తున్నాం I would like to literally say that on Foreign Direct Investments ఆనాడు 1991లో మొదలు పెట్టిన ఈ అంశం.. గత పది, పదిహేను సంవత్సరాల నుండి మొదలు పెట్టిన Startup Eco-system కు వారే నాందీ పలికారు. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్స్ విషయంలో FDI అంటే కేవలం డబ్బులు తీసుకొనిరావడమే కాదు cutting edge technologies తీసుకొని రావాలని, global expertise రావాలనీ, నేడు టెలికాం, హెల్త్‌కేర్, ఈ-కామర్స్‌కు సంబంధించిన అంశంలో డబ్బుల పనినే కాదు, వారికున్న expertise ను తీసుకొనిరావడానికి, వారితోపాటు ఇక్కడ ఉపాధి కల్పన జరగాలని వారు ఒక ప్రధానమైన ఆలోచన చేశారు. వారు తీసుకొచ్చిన అనేక రీపార్మ్స్ అలాగే ఐ.టి.సెక్టార్‌లో వచ్చిన రీపార్మ్స్‌కు సంబంధించి అనేక ఐ.టి. కంపెనీలకు ఫారెన్ ఇన్వెస్ట్‌మెంట్స్ రావాలనీ ఆరోజు సబ్సిడీలు తీసుకొచ్చి, ఇన్‌సెంటీవ్స్ ఇచ్చి నేడు ఇక్కడున్న ఇన్ఫోసిస్, టిసిఎస్, విప్రో వంటివి ఆనాడు వారు మొదలుపెట్టిన ఈ కంపెనీలకు సంబంధించి అనేకమందికి ఉపాధి కల్పిస్తూ మనదేశ జిడిపిలో 55శాతం ఐ.టి., ఐ.టి.ఇ.ఎస్‌కు సంబంధించి సర్వీసులు దోహపడుతున్నాయంటే ఇది మన్మోహన్‌సింగ్‌గారి ఆలోచన, ఘనత అని తప్పకుండా చెప్పుకోవాల్సిన అవసరం ఉన్నది. స్టాక్‌మార్కెట్‌కు సంబంధించిన అంశం విషయంలో పునాదులు గట్టిగా చేసినందున, స్టాక్ మార్కెట్ ప్రపంచస్థాయిలో ఇబ్బందులు ఉన్న తరుణంలో కూడా దేశానికి సంబంధించిన స్టాక్‌మార్కెట్ ఒక పటిష్టమైన పునాదులలో ఉన్నది కనుక మన దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలలేదు.

సర్వీసు సెక్టార్‌కు సంబంధించి నేడు మనం చూస్తున్నట్లుగా ఎకనామిక్ గ్రోత్ ఇంజన్ ఉన్నదో అది మనం ఐ.టి.సెక్టార్ నుంచి మొదలు పెట్టుకొని హెల్త్‌కేర్, బ్యాంకింగ్, టూరిజంకు సంబంధించి సర్వీస్ సెక్టారనేది మన దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రధానమైన మూల స్తంభంగా నిలించింది. దాని ద్వారా నేడు లక్షలాదిమందికి ఉపాధి కల్పిస్తూ మనం ఈ దేశాన్ని, we have known and made it a hub of innovation and talent. దానిలో భాగంగానే తెలంగాణ అదేవిధంగా హైదరాబాద్‌లో కూడా ప్రధాన స్థానంగా నిలిచిందని చెబుతున్నాను. గతంలో బ్యాంకులు నిర్వీర్యం అవుతున్న సమయంలో బ్యాంకులను కూడా రివైవల్ చేస్తూ తీసుకొచ్చిన Non Performing Assets సంబంధించి ఏ విధంగా రికవర్ చేయాలని, అలాగే న్యూక్లియర్ ఎనర్జీ అగ్రిమెంట్‌కు సంబంధించి, World Trade Organisation సంబంధించిన అంశంలో కానీ, Free Trade Agreements విషయంలో ఏవిధంగా అయితే వారి ఆలోచన దృక్పథం, ఆనాడు యుపిఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీగారి నేతృత్వంలో వారిచ్చిన ఆలోచనల మేరకు అనేక కార్యక్రమాలకు నాంది పలికి ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం కూడా జరిగింది.

Right to Information Act అనేది ఒక విప్లవం. సామాన్యుడికి ఒక వెపన్ లాంటిది. Empowerment of a citizen. దానికి సంబంధించి ఈనాటికి ప్రతి సామాన్య ప్రజానీకానికి ఒక ప్రధానమైన హక్కును కల్పించే కార్యక్రమం చేస్తూ, Right to Education కి సంబంధించి కానీ, నరేగాకు సంబంధించి ముఖ్యమంత్రిగారు, ఉపముఖ్యమంత్రి గారు చెప్పిన ఆ అంశమును కూడా విజ్ఞప్తి చేస్తూ... నేడు మనందరికి ఒక ఆధార్‌కార్డు ఉంటుంది. ఆధార్‌కార్డుకు సంబంధించి Unique Identification Authority ఆనాడు వారి ప్రభుత్వంలో వారి నాయకత్వంలో మొదలుపెట్టి నేడు ఆధార్‌కార్డ్ విషయంలో వారు ముందుకు నిలిచి ప్రతి ఒక్కరికి

భారతదేశ పౌరుడిగా ఒక గుర్తింపు ఉండాలని తీసుకొచ్చిన ఆలోచనతో ముందుకు వెళుతున్నాము.

వారు చేసిన ప్రతి ఆలోచన ప్రతి అడుగు రాబోయే కాలంలో ఆదర్శంగా నిలిచే ఒక కార్యాచరణ భాగంలో ముందుకు తీసుకెళుతున్నాము. వారి హయాంలో ఆరు ఐఐటిలు, ఏడు ఐఐఎమ్స్ అందులో భాగంగానే మన రాష్ట్రంలోని త్రిబుల్ ఐ.టిలు కూడా అనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డా.మన్మోహన్‌సింగ్‌గారి హయాంలో మొదలుపెట్టడం జరిగింది. వారి ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో గౌరవ ముఖ్యమంత్రిగారు నేడు విద్యారంగానికి సంబంధించి, ఐ.టి రంగానికి సంబంధించి ఒక ఆలోచన చేయాలి. వారి ప్రస్తావనను కూడా కేవలం మాటల వరకే పరిమితం చేయకుండా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని కోరుతున్నాను.

నేడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై క్రీయాశీలక పాత్ర వహించిన ఆనాటి గౌరవ పార్లమెంటు సభ్యులు చాలా మంది ఇక్కడ ఉన్నారు. వారితోపాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కొరకు వారి నాయకత్వంలో మన రాష్ట్రం ఏర్పాటు చేశాము. అందుకోసం రాష్ట్ర ప్రజలందరూ వారికి ఎప్పుడూ వారి గురించి ఆలోచన చేస్తూ ముందుకు నడవాలి. రాష్ట్రప్రజలకు సంబంధించి వారు ఎందుకు తెలంగాణ రాష్ట్రం కావాలని కోరుకున్నారో.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని కోరుకున్న క్రమంలో వారి ఆలోచన మేరకు మన తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ఇప్పుడే ముఖ్యమంత్రిగారు కూడా చెప్పడం జరిగింది. ఈ విషయాలన్నీ తెలియజేస్తూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. కీర్తి శేషులు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి (నిర్మల్):– అధ్యక్షా, గౌరవ మాజీ ప్రధానమంత్రి డా.మన్మోహన్‌సింగ్‌గారు ఈ దేశానికి చేసిన సేవలు, దేశ ఆర్థికవేత్తగా, దేశ ప్రధానమంత్రిగా ఈ దేశానికి తీసుకొచ్చిన సంస్కరణలు దేశ ప్రజలు ఎన్నటికి మరచిపోలేరు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను. వారు మరణించిన కొన్ని గంటల్లోనే దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ గారు చేరుకొని వారికి ఢిల్లీలో స్మారక చిహ్నాన్ని నిర్మాణం చేయాలని అక్కడ అనౌన్స్ చేసిన విషయాన్ని నేను గుర్తు చేస్తున్నాను. అంతేకాకుండా అధికారులను పంపించి వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి డాక్టర్ మన్మోహన్‌సింగ్‌గారికి స్మారక చిహ్నాన్ని నిర్మాణం చేయడానికి ఢిల్లీలో స్థలాన్ని కూడా కేటాయించడం జరిగింది.

నేడు గౌరవ ముఖ్యమంత్రిగారు, గౌరవ సభ్యులు ఒక విషయాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. తెలుగు బిడ్డ అయిన పి.వి. నరసింహారావుగారిని ఇప్పుడే చాలా మంది సభ్యులు గుర్తు చేస్తూ చెప్పారు. పి.వి. నరసింహారావుగారు వీరిని గుర్తించి ఒక ఆర్థికవేత్తను ఆర్థిక మంత్రిగా ఇంట్రడ్యూజ్ చేసిన వ్యక్తిగా పి.వి. నరసింహారావుగారిని గుర్తు చేస్తున్నారు. తెలుగు బిడ్డ అయిన పి.వి. నరసింహారావుగారు ఈ దేశ ప్రధానమంత్రిగా పనిచేయడం జరిగిందో వారికి దక్కనటువంటి గౌరవం..... అందరు ప్రధానమంత్రులకు ఏ రకంగా అయితే గౌరవ ప్రదంగా అంత్యక్రియలు జరిగాయో అదేవిధంగా మన్మోహన్‌సింగ్‌గారికి జరిపించడం నేను గుర్తు చేస్తున్నాను. గతంలో పి.వి. నరసింహారావుగారు ప్రధానమంత్రిగా ఉండి చనిపోయిన తర్వాత వారికి పది సంవత్సరాల పాటు ఢిల్లీలో స్థలం కేటాయించకపోగా కనీసం భారతరత్న ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుంటే నరేంద్రమోడీగారు ప్రధానమంత్రి అయిన తర్వాత పి.వి.నరసింహారావుగారికి భారతరత్న ఇచ్చిన సంగతి నేను గుర్తు చేస్తున్నాను.

11.10 ఉ. భారతరత్న ఇచ్చిన సందర్భంగా సోనియాగాంధీ గారు, వారి కుటుంబ సభ్యులు కూడా హాజరు కాలేదంటే శ్రీ పి.వి. నరసింహారావు గారి మీద వారు ఎంతగా కక్ష పెట్టుకున్నారో దీనినిబట్టి చాలా స్పష్టంగా అర్థం అవుతుంది. పి.వి. నరసింహా రావు తెలుగు బిడ్డ. పది సంవత్సరాలు

అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ వారికి భారతరత్న ఇవ్వకుంటే, భారతీయ జనతా పార్టీకి చెందిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు వారికి భారతరత్న ఇచ్చిన సంగతి మాత్రమే నేను గుర్తు చేస్తున్నాను.

ఆరోజు ప్రధానమంత్రిగా ఉన్నటువంటి శ్రీ మన్మోహన్ సింగ్ గారు ఒక ఆర్డినెన్స్ తీసుకువస్తే, [1] *** కూడా నేను గుర్తు చేయాల్సిన అవసరం ఉంది.

(అధికార పార్టీ సభ్యుల నుండి అభ్యంతరం)

మన్మోహన్ సింగ్ గారు చనిపోయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వారి పట్ల గౌరవ సూచకంగా ఏడు రోజుల పాటు సంతాప దినాలను అనౌన్స్ చేస్తే..... ఇప్పుడే నేను సభకు వస్తున్న సందర్భంలో ఒక సమాచారం వచ్చింది. అదేమిటంటే, [2] ***

(అధికార పార్టీ సభ్యుల తీవ్ర అభ్యంతరం)

SRI D. SRIDHAR BABU :- Sir, this is not the apt time. I don't want to interrupt. ఇది సంతాప తీర్మానం. We have to pay homage to our departed leader and departed soul. దయచేసి మిత్రులను కోరుతున్నాను. Don't bring politics into this. We are paying a homage. ఈ సభ గొప్ప ఆర్థిక వేత్తకు నివాళులు అర్పిస్తున్న సందర్భంలో రాజకీయాలకు అతీతంగా మాట్లాడాల్సిన ధర్మం వారిపై ఉంది. రాజకీయాలు మాట్లాడాలంటే మళ్లీ సభ్యులందరు మాట్లాడుతారు. ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడుతుంది. ఇది కాదు. రేపు వివిధ ప్లాట్‌ఫామ్స్ ఉంటాయి. ఆ ప్లాట్‌ఫామ్స్ పరంగా ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేద్దాం. హోమేజ్ కాని అంశాలని, నివాళులకు సంబంధం లేని అంశాలని తప్పకుండా రికార్డుల నుంచి తొలగించాలని గౌరవ సభాపతి గారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్:– గౌరవ మహేశ్వర రెడ్డి గారు మాట్లాడిన మాటలన్ని రికార్డుల నుండి తొలగించబడతాయి. దయచేసి సబ్జెక్ట్ డీవియేషన్ కాకుండా కండోలెన్స్‌కు సంబంధించిన విషయాలే మాట్లాడండి.

SRI ALLETI MAHESWAR REDDY:- Sir, I do not understand what is the deviation here? దేనికి డీవియేషన్ వచ్చిందో, ఏ అంశంమీద డీవియేషన్ వచ్చిందో నేను అడుగుతున్నాను. డా. మన్మోహన్ సింగ్ గారిని గుర్తు చేసుకుంటున్న సందర్భంగా వారికి జరిగిన అవమానాలను కూడా గుర్తు చేస్తున్నాను. వారు ఇచ్చినటువంటి ఆర్డినెన్స్‌ను చించివేసినటువంటి సందర్భాన్ని గుర్తు చేశాను. దేశవ్యాప్తంగా వారం రోజుల పాటు సంతాప దినాలుగా కేంద్ర ప్రభుత్వం అనౌన్స్ చేసిన తరువాత, ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడు అయినటువంటి [3] *** వాస్తవమా, కాదా? అడిగాను అధ్యక్షా, దానిలో తప్పేముంది అధ్యక్షా?

శ్రీ పొన్నం ప్రభాకర్:– అధ్యక్షా, డా. మన్మోహన్ సింగ్ గారికి సంతాప తీర్మానం ఏర్పాటు చేస్తూ ప్రత్యేక సమావేశం నిర్వహించుకోవడం జరిగింది. తప్పుడు పదాలపై అవగాహన లేదా, లేకపోతే ఎందుకు మాట్లాడుతున్నారు, ఏం మాట్లాడుతున్నారు? కాంట్రవర్సి చేయడం ద్వారా వారికి రేపు పొద్దున ఏమైనా పైనుంచి..... నిజమైన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కూడా ఈవిధంగా మాట్లాడరు. మధ్యలో పార్టీలోకి పోయిన వాళ్లు, వీళ్లు ఏదో ఓన్ చేసుకోవడానికి ప్రాధాన్యత చూపిస్తున్నారు. ఈవిధంగా మాట్లాడితే ఎట్లా అధ్యక్షా? [4] *** బయటకు పోయిన తరువాత ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టండి. ప్రత్యేకంగా డా. మన్మోహన్ సింగ్ గారి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రత్యేకంగా ఈ సభ సమావేశం అయింది. వారిలో ఏదైనా మీకు మంచి అనిపిస్తే మంచి చెప్పండి. లేకపోతే సంతాపం చెప్పి ఊరుకోండి.

ప్రక్కన సభ్యులు హరీష్‌రావు గారు సమాచారం అందించే అవసరం ఏముంది సార్ దానికి సంబంధించి? అధ్యక్షా, ఇది సభకు మర్యాద కాదు. ప్రతిపక్ష నాయకులు హరీష్‌రావు గారు వారికేదో ఉప్పందిస్తూ.... ఇది నాకైతే అర్థం అవడం

1*** Expunged as ordered by the Chair.
2*** Expunged as ordered by the Chair.
3*** Expunged as ordered by the Chair.
4*** Expunged as ordered by the Chair.

లేదు. ఇది మన్మోహన్ సింగ్ గారి సంతాపం గురించి ఏర్పాటు చేసుకున్న సమావేశం. ఆయన తెలంగాణ ఇచ్చినాయన. ఆయన గురించి మాట్లాడమంటే, ఎక్కడెక్కడికో పోతున్నాడు. ఏమి మాట్లాడుతున్నాడో అర్థం కాదు.

శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి:- అధ్యక్షా, మంత్రిగారు ఎందుకు ఇంటర్‌వీన్ అవుతున్నారో నాకు అర్థం అవుతలేదు. నేను ఏమన్నాను అధ్యక్షా? మన్మోహన్ సింగ్ గారు చనిపోయిన కొన్ని గంటల్లోనే మన్మోహన్ సింగ్ గారికి స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని చెప్పి ప్రధాన మంత్రి గారు అనౌన్స్ చేసిన సందర్భాన్ని గుర్తు చేస్తున్నాను. వారి విగ్రహంతోపాటు పి.వి. నరసింహా రావు గారి విగ్రహాన్ని ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. వీళ్ల చిత్తం, వీళ్ల శ్రద్ధ ఎట్లా అంటే, భక్తి శివుడి మీద ధ్యాస చెప్పుల మీద ఉన్నట్లుగా ఉంది. ఈరోజు వాళ్లు మాట్లాడుతున్నటువంటి అంశాలు ఏమున్నాయి అధ్యక్షా? ఈరోజు కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి మన్మోహన్ సింగ్ మీద ఉన్నటువంటి ప్రేమ ఏపాటిదో చెబుతున్నాను. మన్మోహన్ సింగ్ గారు చనిపోయిన సందర్భంగా దేశమంతా కూడా వారిని గుర్తు చేసుకొంటూ, సంతాపం ప్రకటిస్తుంటే, [5] *** దీంట్లో తప్పేముంది అధ్యక్షా? ఇందులో ఏమున్నదని వారు ఈరకంగా ఇంటర్‌వీన్ అవుతున్నారు. మన్మోహన్ సింగ్ గారు చాలా గొప్ప నాయకుడు. మన్మోహన్ సింగ్ గారిని దేశ ఆర్థికవేత్తగా గౌరవిస్తున్నాను. దేశ ప్రధానమంత్రిగా వారు తీసుకువచ్చినటువంటి ఎన్నో సంస్కరణలను మేము తప్పకుండా అప్రిషియేట్ చేస్తున్నాము. దాని విషయంలో వారికి జరిగిన అవమానాలను కూడా కొన్ని చెప్పాల్సి వచ్చిన సందర్భంలో నేను చెప్పాను తప్ప, దానికి మంత్రులు ఎందుకు బాధపడుతున్నారో అర్థం కావడం లేదు.

ఈ దేశంలో మాజీ ప్రధానమంత్రులకు దక్కిన గౌరవమే, ఏ రకంగానైతే మిగతా ప్రధానమంత్రులకు అంత్యక్రియలు జరిగాయో, అదే మాదిరిగా వీరికి కూడా అదే గౌరవంతో అంత్యక్రియలు జరిపినటువంటి సంగతి గుర్తు చేస్తున్నాను. భారతరత్న అవార్డ్ పి.వి. నరసింహా రావు గారికి గత ప్రభుత్వం ఇవ్వకుంటే, భారతీయ జనతా పార్టీ వారికి భారతరత్న అందజేసి గౌరవించిన సంగతి, అలాగే వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ అవమానించిన సంగతి కూడా గుర్తు చేస్తున్నాను. పి.వి. నరసింహా రావు గారికి కూడా ఒక విగ్రహాన్ని పెట్టేందుకు ఒక తీర్మానం చేసి ఉంటే బాగుండేదని కోరుతున్నాను.

ఈ రకంగా మాజీ ప్రధానమంత్రి గారికి గతంలో జరిగిన అవమానాలు... భారతీయ జనతా పార్టీ ఏరకంగా వారిని గౌరవించి ఈరోజు వారికోసం వారం రోజులు సంతాప దినాలుగా ప్రకటన చేస్తూ, ఢిల్లీలో వారికి స్మారక నిర్మాణం చేపట్టాలనే అంశాన్ని అనౌన్స్ చేసిన సంగతి గుర్తు చేస్తూ, అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను.

శ్రీ కూనంనేని సాంబశివరావు (కొత్తగూడెం):- అధ్యక్షా, ఈరోజు జరుగుతున్నటువంటి కార్యక్రమం ఒక పవిత్రమైనటువంటి కార్యక్రమం. ఈ దేశానికి ఎంతో సేవ చేసి, దేశానికి గతి, గమనాన్ని నేర్పినటువంటి, ఈవాళ్ల ప్రపంచంలోనే Five advanced fully developed countries లో మన భారతదేశం ఒకటిగా చేరటంలో ప్రధాన భూమిక పోషించినటువంటి పెద్దలు, గౌరవనీయులు, స్థితప్రజ్ఞులు శ్రీ మన్మోహన్ సింగ్ గారికి నివాళి అర్పించేటువంటి కార్యక్రమం.

ఇక్కడ ఇటువంటి పవిత్రమైనటువంటి ఈ సందర్భాన్ని వ్యక్తిగత అంశాలతోనో, లేకపోతే ఇతర వివాదస్పద రాజకీయ అంశాలతోనో ముడిపెట్టడం అనేడిది ఇది సంప్రదాయం కాదు. శ్రీ వాజ్‌పేయ్ గారి లాంటి వాళ్లైనా, లేకుంటే ఇంకా పెద్ద స్థాయిలో ఉన్నటువంటి వాళ్లైనా సరే. జాతీయ స్థాయిలో ఉన్న వాళ్లైనా సరే. నాకు తెలిసి ఇటువంటి సంతాప సభల్లో మరొక అంశాన్ని జోడించి మాట్లాడినటువంటి ఘటన నేను ఎక్కడా చూడలేదు. ఇది మొదటిసారిగా నేను చూస్తా ఉన్నాను.

5*** Expunged as ordered by the Chair.

ఇక్కడ కొన్ని విషయాలు మీదృష్టికి తీసుకురావాలి. మిత్రులు కేటిఆర్ గారు మాట్లాడారు. కేటిఆర్ గారు ఎంత డిగ్నిఫైడ్‌గా, సభా సంప్రదాయాలకు అనుగుణంగా, నివాళి అర్పణలో భాగంగా చాలా చక్కగా, హుందాగా చెప్పారు. ఈ సభను ఎంతమేరకు ఉపయోగించుకోవాలి.. ఈ సభలో మన గౌరవాన్ని చాటాలి. వేరు, వేరు అంశాల జోలికి మనం వెళితే ఇది మన్మోహన్ సింగ్‌గారికి నివాళి అర్పించే కార్యక్రమం కాదు. రాజకీయాలకు మరల దీనిని కూడా వేదిక చేసుకునేటువంటి ఒక కార్యక్రమం అవుతుంది. ఇది మన్మోహన్ సింగ్ గారికి గౌరవం అందించదు. ఆయనకు శోభ చేకూరదు. ఆయన ఆత్మకు అంటున్నారు కదా. మేమైతే ఆత్మలను నమ్మం. కానీ, ఇటువంటి భాషల వల్ల, ఇటువంటి వివాదాల వల్ల ఆయన ఆత్మ క్షోభిస్తుంది. ఇది నేను మీదృష్టికి తీసుకువస్తున్నాను.

ఈనాడే కాదు, మరేనాడైనా సరే ఇటువంటి నివాళి అర్పణ కార్యక్రమంలో ఒక సంప్రదాయాల్ని, అలాగే పరమపదించినటువంటి ఒక మహోన్నత వ్యక్తి గురించి ఆయనలోని గొప్పతనాన్ని మనం చెప్పాలి తప్పితే, ఒకవేళ పొరపాటున ఆయనలోని లోపాలు ఏవైనా ఉన్నా సరే అటువంటి వాటిని కూడా ప్రస్తావన చేయకూడదు. అనేక వేదికలు బయట ఉంటాయి. ఆ వేదికల మీద మనం మాట్లాడుకోవచ్చు. ముఖ్యంగా ఈనాటి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డా. మన్మోహన్ సింగ్ గారి గురించి చెప్పాలంటే, ఆయన నిజాయితీకి, నిబద్ధతకు నిలువుటద్దం.

11.20 ఉ. ప్రక్కనే, 2వ యు.పి.ఏ. సమయంలో ఆయన కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దానిలో అలైడ్ పార్టీల వలన కొన్ని ఇబ్బందులొచ్చినా, ఆయన ఒక ధవళ వస్త్రంలాగా, ఆయన ప్రక్కన ఎన్ని మచ్చలొచ్చినా సరే, తన ఒంటిపైన ఒక్కమచ్చ కూడా లేనటువంటి వ్యక్తి వారు. అటువంటి పెద్ద సమస్యల కాలంలో కూడా మన్మోహన్‌సింగ్ గారివైపు వేలెత్తి చూపేటువంటి.., ఒకళ్ళిద్దరు చూపించినా, భారతదేశ ప్రజానీకం మొత్తం కూడా మన్మోహన్‌సింగ్‌గారి నిజాయితీని, ఆయనకున్న నిబద్ధతను శంకించలేదు అనంటేనే మన్మోహన్‌సింగ్‌గారి వ్యక్తిత్వమేమిటో మనకి అర్థమవుతోంది.

అదేవిధంగా, యు.పి.ఏ.-1 లో కమ్యూనిస్టుల పాత్రను కూడా కొద్దిగా మీ దృష్టికి తీసుకురావాలి. యు.పి.ఏ.-1 లో అనేక మహత్తరమైనటువంటి చట్టాలను రూపొందించారు. అందులో భాగంగా, కోట్లాదివుందికి ఇవాళ ఉపాధి కల్పిస్తున్నటువంటి "ఉపాధి హామీ చట్టాన్ని" పేర్కొనడం జరిగింది. అలాగే ఆర్టీఐ- "సమాచార హక్కు చట్టాన్ని" ఆనాడు ఆమోదించడం జరిగింది. అదేవిధంగా భూ నిర్వాసితులకు సంబంధించిన ఒక గొప్ప చట్టాన్ని కూడా తీసుకురావడం జరిగింది. అదే సమయంలో అటవీ హక్కులకు సంబంధించి పోడు భూములు సాగుచేసుకుంటున్నటువంటి వారికి సంబంధించిన ఒక చట్టాన్ని కూడా తీసుకురావడం జరిగింది. ఇలా అనేక అంశాలు కమ్యూనిస్టుల స్నేహితం వలన ఆరోజుల్లో కమ్యూనిస్టుల ప్రభావం వలన ఈ భారతదేశ గమనాన్నే మార్చేటువంటి, మార్గాన్నే మార్చేటువంటి అనేక చట్టాల విషయంలో కమ్యూనిస్టులు సలహాలిచ్చారు, వాటిని స్వీకరించారు, వాటికి సరైన రీతిలో పేరు పెట్టారు, వాటిని సరైన రీతిలో అన్వయించారు.

ఆ క్రమంలోనే, ఆ ఉపాధి హామీ చట్టం డ్రాఫ్టింగ్ కమిటీలో సీతారామ్ ఏచూరి గారున్నారు, గురుదాస్ దాస్‌గుప్తా గారున్నారు, సురవరం సుధాకర్ రెడ్డి గారు కూడా ఉన్నారు. అంతటి గౌరవమిచ్చారు. కమ్యూనిస్టులకు కూడా ఇచ్చారు. సరే, సెకండ్ టైమ్‌లో అణు ఒప్పందం దగ్గర బ్రేక్ అయ్యింది, మేము కలవలేకపోయాం, అది వేరే సంగతి. అందువలన అనేక గొప్ప చట్టాలు కూడా రూపొందింది మన్మోహన్‌సింగ్ గారి కాలంలోనే.

ఆనాటి ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు గారిని కూడా ఇవాళ ఒకసారి మనం గుర్తు చేసుకోవాలి. మన్మోహన్‌సింగ్ గారిని ఆర్థికశాఖామంత్రిగా ప్రమాణస్వీకారానికిపిలిస్తే, ఆయన ఇదొక జోక్ అనుకుని వారి ప్రమాణస్వీకారానికి కూడా అన్‌ప్రిపేర్డ్‌గా ఉన్నారని ఆరోజు మనం పత్రికల్లో చదివాం. అంటే, మన్మోహన్‌సింగ్ గారిలో ఉన్నటువంటి విజ్ఞతను,

వారిలో ఉన్నటువంటి విజ్ఞతను, ఆయనలో ఉన్నటువంటి అంకితభావాన్ని, ఆయనలో ఉన్నటువంటి ఈ దేశానికి సంబంధించినటువంటి ఆర్థిక విశ్లేషణ, వీటన్నింటినీ పి.వి. నరసింహారావు గారు ఎలా అర్థం చేసుకున్నారో, చాలా గొప్ప విషయం. ఒక మేథావి మరొక మేథావిని అర్థం చేసుకున్నంత గొప్పగా ఒక సామాన్యుడు ఒక మేథావి మనసులో ఉన్నటువంటి భావాల్ని అర్థం చేసుకోలేడు. ఆవిధంగా వారిని అర్థం చేసుకుని.., ఆయన ఆర్బీఐ గవర్నరుగా చేశారు, అదేవిధంగా ఫారిన్ సర్వీసులో చేశారు, పంజాబ్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా చేశారు, ఢిల్లీ ఎకనమిక్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా చేశారు. అంత గొప్ప వ్యక్తిని మరొక గొప్ప వ్యక్తి గుర్తించి, వారికి ఆవిధమైనటువంటి అవకాశమిచ్చారు.

ఒక దశలో నేనైనా మీకంటే ఎక్కువ చేయలేను, మీరు నాకంటే చాలా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని పి.వి. నరసింహారావు గారు మన్మోహన్‌సింగ్ గారికి కితాబు ఇచ్చినటువంటి విషయాన్ని మనం గమనంలోకి తీసుకున్నాం. అలాగే, మన్మోహన్‌సింగ్ గారు కేవలం పదవి కోసమే కాదు..., విశ్వసనీయతకు వారు అద్దం పట్టినటువంటి వ్యక్తి. పి.వి. నరసింహారావు గారు కష్టాల్లో ఉన్నప్పుడు, ఆయన వారింటికి వెళ్ళి పలకరించారు. పి.వి. నరసింహారావు గారు కేసుల్లో ఉన్నప్పుడు వారికి మనోధైర్యాన్నిచ్చారు. అంటే, ఏ పార్శ్వానికి ఆ పార్శ్వంగా చూడగలిగినటువంటి మహోన్నతమైన వ్యక్తిత్వం, సముచితమైన స్థితప్రజ్ఞత కలిగిన మేథావి, అలాగే సామాజిక వేత్త. అదేవిధంగా మానవ సంబంధాలలో పరస్పర అనుభూతి, అనుబంధం కలిగినటువంటి గొప్ప మానవతావాదిగా మన్మోహన్‌సింగ్ గారిని మనం గౌరవించాలి.

చాలామంది మౌనం..., అంటే ఇప్పుడు పెద్ద పెద్ద మాటలు చెప్తున్నారే, ఆయన బ్రతికున్నప్పుడు ఎన్ని అపహాస్యాలు చేశారధ్యక్షా, ఎన్ని అపహాస్యాలు చేశారు? ఒక్కొక్కళ్ళదీ ఒక్కొక్క స్టైల్. ఒకళ్ళు ఎక్కువగా డెమాగోగ్‌గా ఉంటారు. ఒకళ్ళు ఎక్కువగా మాట్లాడుతుంటారు. ఒకళ్ళు ఎక్కువెక్కువగా మాట్లాడుతుంటారు, అందులో విషయమేముండదు. ఆయన మాట్లాడరు. "మౌనమే నీ భాష ఓ మూగ మనసా" అనే ఒక పాట కూడా ఉంది. ఆయన మౌనమే ఆయన భాష. పి.వి. నరసింహారావు గారికీ, ఆయనకీ ఒక సారూప్యత ఉంటుంది. పి.వి. నరసింహారావు గారి మనం ఒకసారి గుర్తుకు తెచ్చుకుంటే అనేక సందర్భాలలో ఆయన ఎక్కువ చెప్పేవాడు కాదు. పెద్ద పెద్ద, క్రిటికల్, సంక్లిష్టమైన సమస్యలైనా సరే ఆయన మాట్లాడకుండానే పరిష్కారం చేసేవారు. ఏమనేవాడంటే, Law will take its own course. Time will resolve all the problems.. those two words he generally uttters.

ఇదీ ఆయనలో ఉండే గొప్పతనం. ఒక్కొక్కరిదీ ఒక్కో స్టైల్. వాజపేయి గారిది ఒక స్టైల్. నెహ్రూ గారిది ఒక స్టైల్. అలా ఒక్కొక్కరిదీ ఒక్కో స్టైల్. దాన్ని కూడా అపహాస్యం చేసినటువంటి వాళ్ళని కూడా మనం చూశాం. కానీ, అంతిమంగా ఏమి రుజువయ్యింది? అది కూడా ఒక స్థితప్రజ్ఞత, ఇంకొకళ్ళని లూజ్‌గా మాట్లాడకుండా తనపని తాను చేసుకుపోవడమే, తనకు ఇచ్చిన బాధ్యతని తాను నెరవేర్చడమే గొప్ప దేశభక్తిగా భావించినటువంటి దేశభక్తుడు, మన మన్మోహన్‌సింగ్ జీ. అందుకు మనం నివాళులు అర్పించాలి. ఆరీతిలో మనం నివాళులు అర్పించవలసిన అవసరముంది.

అదే సమయంలో పి.వి. నరసింహారావు గారిని నిజంగానే గత ప్రభుత్వంలో కూడా చాలా గౌరవించారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా, మన రేవంత్ రెడ్డి గారుకూడా పి.వి. నరసింహారావు గారికి సముచిత రీతిన, మన్మోహన్‌సింగ్ గారితో పాటు పి.వి. నరసింహారావు గారిని కూడా...., ఇంకే పద్ధతుల్లో శాశ్వతంగా గుర్తుండాలో..., ఆ పద్ధతి కూడా చేయాలని నేను కోరుతూ, చివర్లో ఒక చిన్న పోయమ్ చెప్పి నేను సెలవు తీసుకుంటాను.

అది, 1950లలో Ho Chi Minh గారు నెహ్రూ గారికి ఒక లెటర్ రాశారు. అందులో, వారు అప్పుడు వియత్నాం జాతీయ విముక్తి పోరాటానికి.., స్ట్రగుల్ చేస్తున్నారు. దాన్ని కొద్దిగా నేను.., slightly I changed this one and I am applying to the present scenario, అందులో ఆయనేమి

రాస్తాడంటే..., I am struggling, you are active. I am struggling, you are active, అంటే, అక్కడ మీరు యాక్టివ్‌గా ఉన్నారు, ఇక్కడ నేను స్ట్రగుల్ చేస్తున్నాను అని నెహ్రూ గారికి రాశారు. ఇక్కడ నేనేమి అప్లై చేస్తున్నానంటే, I am struggling with inner peace, you are active in the public field. ఇది మన్మోహన్ సింగ్ గారికి అప్లై చేస్తున్నాను, I am struggling with inner peace, you are active in the public field. ఇది మన్మోహన్‌సింగ్‌గారు పి.వి. నరసింహారావు గారికి చెప్పిన పదంగా నేను అన్వయిస్తున్నాను అధ్యక్షా. I am in deep thoughts, you are in perseverance, నేను దీర్ఘమైనటువంటి ఆలోచనలలో నేనున్నాను, మీరు దానిని కార్యాచరణలో పెడుతున్నారు. అది మన్మోహన్ సింగ్ గారు పి.వి. నరసింహారావు గారికి.., My Dear people of India, నా దేశ ప్రజలారా, though we are thousand miles apart, వేల మైళ్ళ దూరాన ఉన్నప్పటికీ, మన్మోహన్‌సింగ్‌గారు దేశ ప్రజలతో... వేల వేల మైళ్ళున్నప్పటికీ, we have not met together, మనం కలుసుకో లేకపోయినప్పటికీ కూడా, we communicate without words, అంటే, మాటలు లేకుండా మనం ఒకరికొకరు మౌన భాషలోనే ఈ దేశ పరిస్థితులూ, సమస్యలూ, ఇబ్బందులూ లేకపోతే పరిష్కారాలని మనం కమ్యూనికేట్ చేసుకుంటున్నాము. ఇది ఆనాడు Ho Chi Minh గారు నెహ్రూ గారికి రాసినటువంటి ఆ పోయమ్‌ని కొద్దిగా నేను ఛేంజ్ చేసి మీ దృష్టికి తీసుకువస్తున్నాను. These words are precisely applicable to Dr. Manmohan Singh Ji as well as the Former Prime Minister P.V. Narasimha Rao Ji as well as the people of India. ఆ విధంగా ఆయనకు ఘనమైన నివాళిని నేను ఇవాళ సీపీఐ పార్టీ నుంచి అర్పిస్తూ, అటువంటి గొప్ప వ్యక్తులు మన భారతదేశంలో పుట్టినందుకు మనందరం సంతోషపడుతూ, ఇంకొక విషయం మరిచిపోయాను అధ్యక్షా, He is known for his simplicity as well as P.V. Narasimha Rao Garu. పి.వి. నరసింహారావు గారు చివరికి ఇంటిని కూడా అమ్ముకోవడానికి ప్రయత్నం చేసిన విషయాన్ని నేను చదివాను, అప్పుడు ఆయనకి అవసరమైనటువంటి ఇంటి ఖర్చుల కోసం. మన్మోహన్‌సింగ్ గారు తన భోజనాన్ని తానే, రెండు చపాతీలని టిఫిన్ కేరియర్‌లో పెట్టుకుని పార్లమెంటుకి తీసుకెళ్ళేవారని నేను చదివాను.

11.30 ఉ. అటువంటి such a simple person మన భారత దేశంలో పుట్టినందుకు మనందరికీ గర్వకారణం. తెలంగాణ రాష్ట్రఏర్పాటులో క్రియాశీలకంగా, ప్రధాన మంత్రిగా ఉండి, ఆయన.. ఎటువంటి అడ్డంకులు కల్పించకుండా.. ఎందుకంటే, విఘ్నాలు కల్పించేవారు చాలా మంది ఉంటారు... ఒక మంచి జరగాలంటే, దేవుడు వరమిచ్చినా వరమివ్వనటువంటి పూజారులు ఉన్నటువంటి ఈ వ్యవస్థలో ఆయన, సోనియా గాంధీగారి సంకల్పం, ఆ సంకల్పానికి కార్యరూపం తీసుకొచ్చి ఎటువంటి విఘ్నాలు కలుగకుండా మన తెలంగాణను మనకు ప్రసాదించడంలో ప్రధాన పాత్ర వహించినటువంటి మన్మోహన్ సింగ్‌జీకి మా సి.పి.ఐ. పార్టీ తరఫున, నా తరఫున ఘనమైన నివాళులర్పిస్తున్నాను. మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను అధ్యక్షా. నమస్కారం.

శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి (గౌరవ నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి, ఆహార మరియు పౌరసరఫరాల శాఖామాత్యులు):- స్పీకర్ సార్, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి సంపూర్ణ మద్దతిస్తూ వారు సూచించిన విధంగా గౌరవ మన్మోహన్ సింగ్‌గారికి హైదరాబాదులో ఒక మంచి మెమోరియల్ విగ్రహం ఏర్పాటు చేయడం కూడా చాలా సముచితంగా ఉందని చెప్పి నేను భావిస్తున్నాను. అదే విధంగా, హౌస్ తీర్మానించి వారికి భారత రత్న అవార్డు అందించాలని చేసిన వారి సూచనలను నేను పూర్తిగా అంగీకరిస్తున్నాను. Dr. Manmohan Singh is one of the greatest illustrious sons of India. వారు పుట్టింది ప్రస్తుత పాకిస్థాన్‌లో ఒక నిరుపేద కుటుంబంలో. వారక్కడి నుంచి ప్రస్తుత పంజాబ్‌కు వచ్చి అక్కడ

చండీఘర్‌లో ఉన్నత విద్యనభ్యసించి చాలా రేర్.. Oxfordలో, Cambridgeలో ప్రపంచ ప్రఖ్యాత రెండు యూనివర్శిటీలలో వారు ఉన్నత విద్యనభ్యసించడం మనమందరం గమనించాం. అదే విధంగా ఈ దేశంలో ఉన్న ఉన్నత పదవులు చాలా చాలా వారు అలంకరించారు. వారు Finance Secretary, Government of Indiaలో ఉన్నారు, Reserve Bank of Indiaకి Governorగా ఉన్నారు, Planning Commission Deputy Chairmanగా ఉన్నారు, University Grants Commission Chairmanగా ఉన్నారు, దేశానికి గొప్ప ఆర్థిక మంత్రిగా ఉన్నారు. రాజ్య సభలో Leader of the Opposition గా ఉన్నారు. పదేండ్ల పాటు భారత దేశానికి ప్రధాన మంత్రిగా ఉండి, అద్భుతమైన సేవలందించిన విషయం కూడా మనం ఈరోజు గుర్తు చేసుకోవాలి.

ముఖ్యమంత్రిగారన్నట్లుగా Land Acquisition విషయంలో ఒక ల్యాండ్‌మార్క్ లెజిస్లేషన్ తీసుకోవడం జరిగింది. Land Acquisition విషయంలో ఎప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీకి టాప్ లీడర్‌షిప్‌లో ఒక భావన ఏమిటంటే, Land Acquisition చేసినప్పుడు ఒక మానవీయ దృక్పథంతో, ఒక humanitarian angleతో ఎవరినైతే మనం displace చేస్తున్నామో, ఏదో డెవలప్‌మెంట్స్ చేస్తామనో, industries పెడతామనో, ప్రాజెక్టులు కడుతామనో మరొక కారణంగా ఎవరినైతే displace చేస్తున్నామో అన్ని విధాలుగా వారికి compensation, relocation సరైన R & R ఉండాలని చెప్పి మన్మోహన్ సింగ్ గారు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఒక landmark Land Acquisition Act తీసుకురావడం జరిగిందనే విషయం మనం గుర్తు చేసుకోవాలి.

స్వాతంత్ర్యం తరువాత అడవుల్లో drifting agriculture చేసుకునే అడవి బిడ్డలకి ఆ పోడు భూముల మీద ఏ హక్కు ఉండకపోవడంతో చాలా ఇబ్బంది పడుతూ ఉండేవారు. మన్మోహన్ సింగ్ గారు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు అడవుల్లో ఉండే అడవి బిడ్డలకి Forest Rights Act క్రియేట్ చేసి దేశంలో లక్షలాదిమంది ఆదివాసీలకు మేలు చేసిన విషయం కూడా ఈరోజు మనం గుర్తు చేసుకుందాం.

అదే విధంగా, ఒకసారి మనం Civil Nuclear deal గురించి మాట్లాడితే Civil Nuclear deal విషయంలో U.P.Aలో internal allianceలో, externalలో severe opposition ఉండింది, but Dr. Manmohan Singh believed that it is in the interest of the country. భారత దేశం మొదటి న్యూక్లియర్ టెస్ట్ చేసిన తరువాత అంతర్జాతీయంగా ఏ దేశం కూడా మనకి nuclear field లోనే కాకుండా ఏ హైటెక్ ఫీల్డ్‌లో కూడా technology transfer కి సుముఖంగా లేకుండే. అయితే, U.S.తోని చర్చలు జరిపి ఈ Civil Nuclear deal మనం అగ్రీమెంట్ అయితే nuclear fieldలో కానీ ఇతర high technologyలో కానీ కో-ఆపరేట్ చేయవచ్చని చెప్పి.. అమెరికా నుండి సంకేతాలు వస్తే, ఆరోజు కేంద్ర ప్రభుత్వం పడిపోయే పరిస్థితి ఉన్నా డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు దేశానికి ఏది మంచిదైతే అది చేయాలనే ఉద్దేశ్యంతో Civil Nuclear deal ఏ విధంగా పుష్ చేసి పార్లమెంటులో పాస్ చేసారో మనందరం గుర్తు పెట్టుకుందాం.

నేను వారిని పలుమార్లు కలిసాను. తెలంగాణ ఉద్యమం సమయంలో కొంత consultation processలో వారితో మాట్లాడిన కొంత మంది తెలంగాణ కాంగ్రెస్ నాయకుల్లో నేను కూడా ఒకడిని. వారు ఎప్పుడూ soft spoken, very humble, very simple person. తరువాత తెలంగాణ ఏర్పడ్డది, సరే మేము ఎలక్షన్లో ఓడిపోయాం, AICC ఆదేశాల మేరకు పి.వి.నరసింహా రావుగారి Birth Centenary celebrations చేయమని చెప్పారు. అప్పుడు తెలంగాణలో నేను, శ్రీధర్‌బాబు గారు, గీతా రెడ్డిగారు ఒక సంవత్సరం పాటు పి.వి.నరసింహా రావుగారి Birth Centenary celebrations సంవత్సరం పాటు చేయడం జరిగింది. ఆ celebrationsకి నేను వారిని ఢిల్లీలో కలిసి మీరు రావాలి, మీరు Inaugral Address ఇవ్వాలని చెప్పి రిక్వెస్ట్ చేస్తే వారు immediateగా accept చేశారు. Accept చేసి ఒకటే విషయం చెప్పారు. నాకున్న హెల్త్ కారణాల వల్ల నేను ట్రావెల్ చేయలేను, ఇక్కడి నుండే Zoom యాప్‌లో నా ప్రసంగం చేస్తానని చెప్పి ఆరోజు పి.వి.నరసింహారావుగారిపై వారికున్న అపారమైన గౌరవం, అభిమానం మొత్తం కూడా వారి ప్రసంగంలో చాటుకున్నారు.

అదే విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి, ఆనాటి ఎం.పి., అదే విధంగా, ఆనాటి ఎం.పి. వెంకట్ రెడ్డిగారు, మేము పార్లమెంటులో బయట ఒక దగ్గర కూర్చొని ఉంటే, లోక్ సభ మరియు రాజ్య సభ ఎం.పి.లు, బీ.జే.పి. ప్రభుత్వం/కేంద్ర ప్రభుత్వం మీద నిరసన తెలియజేయడానికి మన్మోహన్ సింగ్ గారు పదేండ్ల ప్రధాన మంత్రి, ప్రపంచ ప్రఖ్యాత statesman, వారొచ్చి చాలా సింపుల్‌గా మా మధ్యలో ఆ నిరసనలో కూర్చున్నారు. వారు వేలమందిని కలుస్తుంటారు, నన్నెక్కడ గుర్తుపెట్టుకుంటారని చెప్పి నేను I am so and so... అని పరిచయం చేసుకునే ప్రయత్నం చేశాను. అప్పుడు ఆయన I know Uttam Reddy, PCC President అని చాలా మెల్లగా, వినపడనట్లుగా వారు మాట్లాడే విధంగా ఉండేది. ఆ విధంగా, one of the greatest sons of India has made enormous contribution to this country. His demise is loss for the country and for the State of Telangana.

లోన్ వేవర్ విషయంలో మనం ఒక నిమిషం మాట్లాడుకోవాలంటే, అంతకు ముందు కానీ ఆ తరువాత కానీ ఏ కేంద్ర ప్రభుత్వం కూడా రైతులకు ఋణ మాఫీ చేయలేదని చెప్పి నేను మనవి చేస్తున్నాను. మన్మోహన్ సింగ్‌గారు ప్రధాన మంత్రిగా మొత్తం భారత దేశంలో రైతుల ఋణం మొత్తం మాఫీ చేసిన ఘనత వారికే దక్కుతుందని చెప్పి నేను మనవి చేస్తున్నాను.

అదే విధంగా, వారు తీసుకొచ్చిన కొన్ని historic Legislations... ఈరోజు మనం ఉంటాం, రేపు ఇంకొకరు ఉంటారు, కానీ, చరిత్రలో నిలబడబోయేవి లెజిస్లేషన్స్...ఆనాడు సోనియా గాంధీగారు National Advisory Council అని ఒక Advisory Councilకి ఛైర్‌పర్సన్‌గా ఉండి, మన్మోహన్ సింగ్‌గారు ప్రధాన మంత్రిగా Advisory Council, UPA ప్రభుత్వానికి కొన్ని సూచనలిచ్చేవారు. సోనియా గాంధీగారి నాయకత్వంలోని National Advisory Council సూచనల మేరకు ప్రధాని మన్మోహన్ సింగ్‌గారి UPA ప్రభుత్వం National Rural Employment Guarantee Scheme చట్టంగా తీసుకువచ్చిన విషయం నేను మనవి చేస్తున్నాను.

11.40 ఉ. ఇది ఎంత గొప్ప విషయం అంటే, అంతకు ముందు ఎప్పుడూ కూడా భారతదేశ చరిత్రలో Employment was never a Right. ఎంప్లాయిమెంట్ దొరికితే దొరికింది లేకపోతే లేదు. కానీ గ్రామీణ భారత దేశంలో ఈ rural distress, financial distress చాలా ఉందని, ఈ మైగ్రెంట్ లేబర్ ప్రాబ్లం తీవ్రంగా ఉందని గమనించి రూరల్ ఇండియాకి మైగ్రెంట్ లేబర్‌కి, పని దొరకని లేబర్‌కి ఏదోవిధంగా ఉపాధి కల్పించాలి, రూరల్ ఎకానమీకి కొంత అమౌంటు పంపిణీ చేయాలని ఒక మంచి ఉద్ధేశ్యంతో ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ స్కీం మొదలుపెట్టడం జరిగింది. ఆనాటి నుంచి ఈనాటి వరకు చాలా మంది చాలా విమర్శలు చేశారు. కానీ Even today the mainstream of rural economy in India is the Mahatma Gandhi National Rural Employment Guarantee Scheme అదేవిధంగా ప్రభుత్వంలో ఉండేవాళ్ళు ఎవరూ కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు గానీ కేంద్ర ప్రభుత్వాలకు గానీ, వారిని ఇతరులు ప్రశ్నించడం ఎవరికీ ఇష్టం ఉండదు.

గతంలో కేంద్ర ప్రభుత్వాలను చూశామూ, తరువాత కూడా చూశాము. రాష్ట్ర ప్రభుత్వాలనూ చూశాము. ఎవరైతే ప్రభుత్వంలో అధికారంలో ఉన్నారో వారు జవాబుదారీతనంగా ఉండాలి, ట్రాన్స్‌పరెంట్‌గా ఉండాలి. ప్రతీ సిటిజన్‌కి ఇన్ఫర్మేషన్ అవైలబుల్‌గా ఉండాలని Right to Information ఒక హిస్టారిక్ లెజిస్లేషన్‌ని తీసుకువచ్చారు. అంటే నువ్వు పది రూపాయలు కడితే.. ఏ పౌరునికైనా తహసీల్దారు నుంచి ప్రధానమంత్రి వరకు ప్రజా సొమ్ముతో ఏ యాక్టివిటీ చేసినా పూర్తి వివరాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంటుంది. ఈ హిస్టారిక్ లెజిస్లేషన్ పెట్టడం మనందరం గమనించాలి.

Right to Education - నేను ముందు చెప్పినట్టుగా మన్మోహన్‌సింగ్ గారు చాలా పేదరికంలో పుట్టారు. వారి చిన్ననాటి ఎడ్యుకేషన్ కూడా చాలా కష్టంగా జరిగింది.

ఒకనాడు వారు అన్న మాటను నేను రిపీట్ చేస్తున్నాను. "I read under the dim light of a kerosene lamp. I am what I am totally because of Education, so I want the light of education should reach to all." ఇవి మన్మోహన్ సింగ్ గారి మాటలు. ఈ మాటలు అని వారు రైట్ టు ఎడ్యుకేషన్ తీసుకువచ్చారు. అంటే ఆరేళ్ళ నుంచీ పద్నాలుగేళ్ళ వరకు ప్రతీ పిల్లవాడికీ Education is a fundamental right. భారతదేశంలో అంతకు ముందు ఎక్కడా లేదు. దానికి అనుగుణంగా కేంద్రప్రభుత్వాలు గానీ రాష్ట్రప్రభుత్వాలు గానీ education infrastructure create చేసి ఇన్ని కిలోమీటర్ల లోపల.. ఆరేళ్ళ నుంచీ పద్నాలుగేళ్ల లోపు ఉన్న పిల్లలందరికీ ఎడ్యుకేషన్ సులువుగా, ఉచితంగా అందుబాటులో ఉండే విధంగా ఈ చారిత్రక చట్టం తీసుకొచ్చిన విషయం కూడా ఈరోజు మనం గుర్తు చేసుకుందాము.

అదేవిధంగా Food Security Act. దేశంలో ఎవరూ కూడా ఆకలి చావులు చావొద్దనే ఉద్దేశ్యంతో ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ అని ఒక హిస్టారిక్ లెజిస్లేషన్‌ని మన్మోహన్ సింగ్ గారి ప్రభుత్వం తీసుకువచ్చింది. దాని క్రిందనే ఇప్పటి ప్రభుత్వాలు కూడా, తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రతీ పౌరుడికీ ఆరు కిలోల బియ్యం ఉచితంగా ఇవ్వబడుతోందని నేను మనవి చేస్తున్నాను.

చివరిగా స్పీకర్ గారూ, it is a historic day for the Assembly of Telangana, the person who played a key role, instrumental role in the creation of Telangana, we are all paying tribute to him. నిస్సందేహంగా సోనియాగాంధీగారు యు.పి.ఎ ఛైర్‌పర్సన్‌గా ఉండి మన్మోహన్ సింగ్‌గారు ఆనాటి ప్రభుత్వానికి ప్రధానమంత్రిగా ఉండి ఉండకపోతే తెలంగాణ రాష్ట్రం రావడం అనుమానమే. వారిరువురూ కూడా తెలంగాణ రావడానికి ఏమేమి చేయాలో అన్నీ చర్యలు తీసుకున్నారు. ఆరోజు కాంగ్రెస్ పార్టీ నష్టపోతుందని అందరికీ తెలుసు. అదేవిధంగా ఒక ప్రాంతం వారు, విడిపోయే పెద్ద భాగం ఉన్న వారు చాలా తీవ్రంగా దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఎవరేమనుకున్నా సరే, తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలనే దృఢ సంకల్పంతో సోనియా గాంధీగారు, మన్మోహన్ సింగ్ గారు ముందుకు పోయినందుకే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఈరోజు శాసన సభలో మనం రికార్డు చేసుకోవాలి.

ఎందుకంటే ఆరోజు పరిస్థితిని గమనిస్తే కాంగ్రెసు పార్టీ అధికారంలో ఉంది. లోక్‌సభలో చాలా మంది సభ్యులు దాన్ని వ్యతిరేకిస్తున్నారు. అయినా సరే, ఎవరేమనుకున్నా సరే, ఇది న్యాయం, ఇది ధర్మం, ఇది చేయాల్సిన పని, మాట ఇచ్చామని లోక్‌సభలో ఈ తీర్మానం, ఈ చట్టం పాస్ చేశారు. అదేవిధంగా రాజ్యసభలో చట్టం పాస్ చేశారు. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంలో కూడా మన్మోహన్ సింగ్ గారి పాత్ర గొప్పదని నేను మనవిచేస్తున్నాను.

చివరిగా., ఆరోజు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రతినిధిగా నేను ఒక విషయం ఆన్ రికార్డ్ చెప్పదలచుకున్నాను. ఆరోజు తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలా? వద్దా? ఇస్తే హైద్రాబాదు నగరానికి ఏ స్టేటస్ ఇవ్వాలి? హైద్రాబాదు నగరానికి వచ్చే ఆదాయం ఎట్లా విభజించాలని పలుమార్లు చర్చలు జరిగాయి. ఆ కన్సల్టేటివ్ మీటింగ్స్‌లో నేను కూడా తెలంగాణ కాంగ్రెస్ ప్రతినిధిగా పాల్గొన్నాను. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 23 జిల్లాలు ఉంటే, హైద్రాబాదు నగరం was a financial capital and financial source of combined Andhra Pradesh also. శ్రీకృష్ణ కమిషన్ కూడా ఎప్పుడైతే option one to five అన్నారో, వేరు వేరు ఆప్షన్లు ఇచ్చారు. రాష్ట్రాన్ని విభజించినపుడు హైద్రాబాదును అట్ల చేయాలి, ఇట్ల చేయాలి అని ఆప్షన్లు ఇచ్చారు. కానీ నేను ప్రత్యక్ష సాక్షిగా మనవి చేస్తున్నాను. ఆనాడు సోనియాగాంధీగారు, మన్మోహన్ సింగ్ గారు తీసుకున్న నిర్ణయం an unencumbered Hyderabad.. అంటే ఎటువంటి ఆంక్షలు లేకుండా Hyderabad will be the capital of Telangana, all revenues of Hyderabad will come to Telangana అని నిర్ణయం తీసుకుని ఈరోజు తెలంగాణ రాష్ట్రం ధనిక

రాష్ట్రం కావడానికి for Telangana State to be the map of India, for Hyderabad to be the fastest growing city in the country, and for Telangana to be the fastest growing city, I mean, it is the contribution of Smt. Sonia Gandhi and Dr. Manmohan Singh. స్పీకరు గారు నేను వారికి ఘనంగా నివాళులు అర్పిస్తూ ముగించుకుంటాను. జైహింద్.

جناب میر ذوالفقار علی (JANAB MIR ZULFEQAR ALI): محترم اسپیکر صاحب! آج میں اپنی جماعت مجلس اتحاد المسلمین کی جانب سے، میرے صدر نقیب ملت عالیجناب الحاج بیرسٹر اسد الدین اویسی صاحب کی جانب سے اور حبیب ملت عالیجناب الحاج اکبر الدین اویسی صاحب، قائد مقننہ ایم آئی ایم تلنگانہ اسمبلی کی جانب سے ہمارے سابق وزیر اعظم ڈاکٹر منموہن سنگھ صاحب کے انتقال کے موقع پر بڑے افسوس اور غم کے ساتھ اس بحث میں حصہ لیتے ہوئے یہاں کھڑا ہوا ہوں۔

سب سے پہلے میں یہ کہوں گا کہ آج ہم یہاں جس تلنگانہ کی اسمبلی میں بیٹھے ہوئے ہیں، ڈاکٹر منموہن سنگھ صاحب، سابق وزیر اعظم نے اس تلنگانہ کو بنانے کے لئے اور تلنگانہ کی عوام کے لئے نہ صرف ایک اہم رول ادا کیا بلکہ ان کے دس سال کے سنہرے دور میں ہندوستان کو ...

11.50 ఉ. Dr. Manmohan Singh took several initiatives to transform India into an economic powerhouse and to ensure all round development of the people including Scheduled Castes, Scheduled Tribes, Other Backward Classes, Minorities and Economically Weaker Sections.

اس طرح کے کئی کام انہوں نے وزیر اعظم رہ کر اور وزیر خزانہ رہ کر بہترین انداز سے انجام دیئے۔ وہ جو بھی عہدے پر فائز رہے، جیسا کہ گورنر آر بی آئی کے عہدہ پر رہ کر بھی انہوں نے بہترین کام کئے۔ میں اگر تفصیل سے بولنا شروع کروں تو کافی وقت لگ جائے گا۔

Among his many achievements that led to revolutionary changes in the country are enactment of Right to Information Act, 2006, Right to Education Act, 2009, MGNREGA and National Food Security Act, 2013. Dr. Manmohan Singh is considered as an architect of the economic reforms or otherwise known as the liberalization, privatization, and globalization as a Union Finance Minister during 1991-96. His contribution to the country as the Governor of RBI and Deputy Chairman of Planning Commission is quite significant. I would like to confine myself to recalling his momentous contributions for the six minority communities viz. Muslims, Christians, Sikhs, Buddhists, Jains and Parsis. It was during his tenure that the Ministry of Minority Affairs was formed in January, 2006.

میں یہ کہنا چاہتا ہوں کہ اس کے لئے 2005 میں ایم آئی ایم کی قیادت میں اقلیتی ایم پیز کا ایک وفد اس وقت کے وزیر اعظم ڈاکٹر منموہن سنگھ کے پاس گیا اور ان کے سامنے مطالبہ رکھا کہ ایک وزارت اقلیتی بہبود قائم کی جانی چاہئے تا کہ ہندوستان کی ساری اقلیتوں کے لئے اچھے سے اچھے کام ہو سکیں۔ انہوں نے اس مطالبہ کو سنا اور سب سے پہلا انہوں نے ہی اس پر ایکشن لیا۔

Responding to the demand, the Union Government constituted a new Ministry of Minorities Welfare in January, 2006. I may recall that Dr.Abdul Rahman Antulay became the first Minister to lead the Ministry of Minority Affairs.

اس وقت انہوں نے اس وزارت کو قائم کیا۔ انہوں نے ہندوستان کی عوام کے لئے ایسے کئی کام کئے جس کی وجہ سے آج ہمارے ہندوستان کا نام روشن ہوا ہے۔ اگر ساری دنیا میں ہمارے ہندوستان کا نام روشن ہوا ہے تو وہ ڈاکٹر منموہن سنگھ صاحب کی وجہ سے ہوا ہے۔

Under Dr. Manmohan Singh's stewardship, several initiatives were taken and launched. National Commission for Minority Educational Institutions (NCMEI) was constituted in 2004 under an Act enacted to safeguard the elimination of rights of the minorities enshrined in Article 31 of the Constitution to provide educational advancement for the minority children. Merit-cum-Means scholarship and the Post-Matric scholarship schemes were launched in 2007 followed by the Pre-Matric scholarship scheme in 2008 and Maulana Azad National Fellowship Scheme in 2009. Multi-sectoral Development Programme (MsDP) was launched in 2008-09 after identification of the minorities concentrated districts in the country. The Sachar Committee and the Prime Minister's High Level Committee to identify the socio-economic and educational status of the Muslim community were constituted in March, 2005 and it submitted its report in

November, 2006. The Sachar Committee made the most comprehensive analysis on the backwardness of Muslims in social, economic and educational fields. Dr. Manmohan Singh ensured that the recommendations of the Sachar Committee are implemented in letter and spirit.

اس کے ساتھ ہی ساتھ انہوں نے سب کو یقین دیا اور ان کو مطمئن کیا کہ سچر کمیٹی کی رپورٹ کے جو بھی سفارشات ہیں، ان پر میں عمل آوری کروں گا۔ اور انہوں نے ایسا کیا۔

The Ranganath Commission, the National Commission for Religious and Linguistic Minorities was constituted in October, 2004 to look into the issues relating to the linguistic and religious minorities and it submitted its report in May, 2007. The Prime Minister's New 15 point Programme for the Welfare of the Minorities was launched in 2005. The schemes for the minorities introduced during Dr. Manmohan Singh reign include *Seekho aur Kamaao,* a skill development scheme in 2012 and Nai Manzil for the leadership development among women in 2012 and he passed a scheme to check the dwindling population of the Parsis in the country in 2014.

میں اپنی جماعت کی جانب سے، میرے صدر نجیب ملت الحاج بیرسٹر اسد الدین اویسی صاحب ایم پی اور حبیب ملت الحاج اکبر الدین اویسی صاحب، قائد مقننہ، تلنگانہ قانون ساز اسمبلی کی جانب سے ان کے خاندان کے غم میں اپنے دل کی گہرائیوں سے شامل ہوں اور اللہ سے دعا کرتا ہوں کہ اللہ تعالیٰ ان کے افراد خاندان کو صبر جمیل عطا کرے۔ انہوں نے جو کام کیا، وہ ہمیشہ ساری دنیا میں یاد رکھا جائے گا۔ شکریہ۔

శ్రీ సి.దామోదర్ రాజనర్సింహ (గౌరవ ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమం, శాస్త్ర మరియు సాంకేతిక శాఖామాత్యులు):- అధ్యక్షా, లీడర్ ఆఫ్ ద హౌజ్ గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, దేశ మాజీ ప్రధాన మంత్రి డా. మన్మోహన్ సింగ్ గారి యొక్క రాజకీయ ప్రస్థానము, సేవలు అన్నీ కూడా గౌరవ సభ్యులు గొప్పగా వర్ణించారు. డా. మన్మోహన్ సింగ్ గారు గొప్ప మానవతావాది. దార్శనికుడు, ఆర్థిక రూపశిల్పి. వారు లేని లోటు తీరదు.

ఆయన ఎన్నో పదవులను అలంకరించారు. ఆర్థికవేత్తగా, ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా, ఆర్‌బిఐ గవర్నర్‌గా, ఆర్థిక శాఖ మంత్రిగా, దేశ ప్రధానిగా.. ఇందులో ముఖ్యంగా మనం గుర్తించవలసింది ఒక నాయకుడు, ఇంతకుముందు గౌరవ సభ్యులు చెప్పినట్లు, lateral entry, ఒక వ్యక్తికి ఉన్న మహా శక్తిని గుర్తించి కేబినెట్‌లోకి తీసుకోవడం, వారికి ఆర్థిక శాఖను ఇవ్వడం, ఆనాటి ఆర్థిక స్థితిగతులు ఏ రకంగా ఉండెనో, మన జిడిపి పరిస్థితి ఏ రకంగా ఉండెనో,1990, 1991 ఆ నాటి కాలంలో, ఒక పాలసీని నిర్ణయించి, Liberalisation, Privatisation, Globalisation అని చెప్పి దాని వల్ల, opening of the Economy, Banking Sector గాని, Communication Sector లేదా ఇతర రంగాలలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడము, తద్వారా జిడిపి పెరగడము, ఆర్థిక స్థితిగతులు పెరగడము, దీని వలన ప్రపంచంలోనే మన దేశానికి ఒక గుర్తింపు రావడం జరిగింది. ముఖ్యంగా Economic stability ని మనం సాధించడము, వీటన్నిటికి కారణము ఆనాటి ఆర్థిక మంత్రి మరియు ప్రధాన మంత్రిగారు తీసుకున్న నిర్ణయాలు. ఆ తరువాత ప్రధానమంత్రిగా పది సంవత్సరాలు కొనసాగడము, వారి యొక్క integrity గాని లేదా commitment గాని సింప్లిసిటీగాని, దార్శనికత్వమే గాని సోనియా గాంధీగారు గుర్తించడము, వారు ప్రధాన మంత్రి పాత్రను పోషించడానికి కారణమయ్యాయి. ఆ పది సంవత్సరాలు ఆనాటి ప్రధానమంత్రిగారు తీసుకున్న నిర్ణయాలు చట్టాలేగాని, పాలసీలేగాని, అవి తాత్కాలిక ఉపశమనమే కాదు, రాబోయే తరాలకు, దేశము, సమాజము, ప్రజలు ఏ రకంగా ముందుకు సాగాలో నిర్దేశిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో విద్యకు, వైద్యానికి, ఉపాధికి సంబంధించి, దేశ భద్రతకు సంబంధించి ప్రపంచంలోనే అరుదైన చట్టాలు గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు ఉపాధి కల్పించాలి, వలసలు ఆపాలి, ఉపాధి కల్పించే విషయంలో ప్రభుత్వం గ్యారెంటీ ఉండాలనే ఒక ఆలోచనతో దానికి ఒక చట్ట రూపం తీసుకురావడమనేది ఒక గొప్ప ఆలోచన.

అదే రకంగా ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి జవాబుదారీతనం ఉండాలి. There should be an accountability to the Government. Whatever Policies, whatever decisions the Government takes.. పారదర్శకత ఉండాలి. Transparency ఉండాలి, అకౌంటబిలిటీ ఉండాలనే ఉద్దేశంతో RTI చట్టం తీసుకు రావడము, అదే రకంగా పేదవాని ఆహారము యొక్క భద్రత కూడా ప్రభుత్వానిదే అని చెప్పి, Food Security Act తీసుకురావడము, దానికి తోడు National Rural Health Mission అని మరొక పథకం తీసుకువచ్చారు. అన్నిట్లోకి ఇంకొక గొప్ప ఒప్పందం ఆనాడు యుపిఏ కూటమిలో విభేదాలున్నా, అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందమేగాని, లేదా Forest Rights Act గాని, తరువాత ప్రధానంగా సమగ్ర భూ సేకరణ చట్టం-2013. 1894 తరువాత సమగ్ర భూ సేకరణ చట్టం ఎప్పుడూ లేకుండె మనకు. కాని 2013 భూ సేకరణ చట్టాన్ని తీసుకొచ్చి, ఒక గ్రామం ముంపుకి గురైనా, ఒక సమాజం ముంపుకి గురైనట్లు అవుతుంది. భూమి ఉన్న వారికి, ఇల్లు ఉన్న వారికి నష్ట పరిహారం చెల్లిస్తాము కాని, చేతి వృత్తులేగాని, కుల వృత్తులేగాని, భూమిలేని నిరుపేదలే గాని వారు కూడా ఆ గ్రామము, ఆ సమాజంలో భాగస్వామ్యము. వాళ్లను కూడా కాపాడుకోవాలి, వాళ్లకు కూడా భద్రతను కల్పించాలి, వారికి సమాన హక్కులు కల్పించాలి, ఆర్థిక భరోసాను కల్పించాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన ఒక గొప్ప చట్టము R&R, 2013 సమగ్ర భూ సేకరణ చట్టము.

12.00 మ. అదే రకంగా ఇలాంటి ఆలోచనలతో మహత్తర చట్టాలను, పాలసీలను తీసుకొచ్చినదానిలో ప్రధానమైనది ఏపి రీ-ఆర్గనైజేషన్ యాక్ట్ గురించి చెప్పక తప్పదు. 60 సంవత్సరాల తెలంగాణ పోరాట కలను సకారం చేసి, ఆనాడు లీడర్ ఆఫ్ ద పార్లమెంట్‌గా రీ-ఆర్గనైజేషన్ యాక్ట్‌ను తీసుకొని రావడంలో ప్రధాన పాత్రను పోషించినవారు డా.మన్మోహన్ సింగ్‌గారు. ఇందులో ఒక అంశాన్ని ప్రస్తావిస్తాను అధ్యక్షా. ఆనాడు తెలంగాణ అంశం పైన యూపిఏ కోర్ కమిటీ ఒక మీటింగ్‌ను నిర్వహించినప్పుడు, ఆనాడు దేశాన్ని నడిపించే అగ్రనాయకత్వంలో దేశ ప్రధాని మన్మోహన్ సింగ్‌గారు, శ్రీమతి సోనియా గాంధీగారు, రక్షణ మంత్రిగారు, హోంమంత్రిగారు అందరూ కూర్చొని ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ మూడు ప్రాంతాల నాయకులను పిలిచి వారి వారి అభిప్రాయాలను అడిగినప్పుడు, తెలంగాణ అంశంపై నేను రిప్రజెంట్ చేసినప్పుడు నాకు వారితో జరిగిన సుమారు 35, 40 నిమిషాలు ఇంటరాక్షన్‌లో రెండు ప్రశ్నలు అడిగారు. దేని గురించి తెలంగాణ, ఈ సాక్రిఫైజెస్ ఎందుకు అవుతున్నాయని అడిగారు. అది నా అదృష్టంగా భావిస్తాను. సమాధానం ఇచ్చాను ఆరోజు అధ్యక్షా.

ఈరోజు మన్మోహన్ సింగ్ గారు రాజకీయ నాయకుల ప్రజా జీవితాల్లో హంగామా, ఆర్భాటం, ఆడంబరాలే కాదు, మానవత్వం, దార్శికత్వం, పారదర్శికతతో కూడిన సేవలను అందించవచ్చునని నిరూపించిన నాయకుడు మన్మోహన్ సింగ్‌గారు. సింప్లిసిటీ, సౌమ్యుడు, మితభాషేకానీ, ఆలోచనలో ఒక విజన్, ఒక కమిట్‌మెంట్, వారి యొక్క స్ఫూర్తి, ఆదర్శవంతుడు ఆయన. వాటిని ఈతరమే కాదు, రాబోయే తరాలు కూడా వారిని ఆదర్శవంతులుగా, స్ఫూర్తి దాతగా తీసుకొని ప్రజా జీవితంలో మనమందరం ముందుకు వెళ్లాలి. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, సెలవు తీసుకుంటున్నాను అధ్యక్షా.

శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ (సనత్‌నగర్):- అధ్యక్షా, భారత మాజీ ప్రధానమంత్రి పెద్దలు మన్మోహన్ సింగ్ గారు మరణించడం, ఈరోజు ఈ శాసన సభ గౌరవ ముఖ్యమంత్రిగారు తీర్మానాన్ని ప్రవేశపెట్టడం, ఈరోజు అనేక అంశాల గురించి పెద్దలు మాట్లాడిన సందర్భం ఇది.

జననం, మరణం అనేది సర్వసాధారణమైనప్పటికీ, చరిత్రలో కొంతమంది వ్యక్తులు మిగిలిపోతారు. దానిలో మన్మోహన్ సింగ్‌గారు ఒకరని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. 1991లో ఈ దేశ రాజకీయాల్లో ఒక తెలుగుబిడ్డ, అపార మేధావి అయినటువంటి శ్రీ పి.వి. నరసింహారావుగారు ప్రధాని అవుతున్న సందర్భంలో

దేశ ఆర్థిక పరిస్థితి, దేశ దశ, దిశ చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో వారు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న సందర్భంలో....., వారు రాజకీయాలకు సంబంధం లేనటువంటి అపర మేధావి, బాగా చదువుకున్నటువంటి వ్యక్తే కాకుండా ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్‌గా, గతంలో ఆర్‌బిఐ గవర్నర్‌గా వివిధ హోదాలలో పని చేసినటువంటి వ్యక్తి అయిన మన్మోహన్ సింగ్‌గారిని తీసుకొనివచ్చి ఫైనాన్స్ మినిస్టర్‌ని చేయడం, వారు ప్రవేశపెట్టిన మొటది బడ్జెట్‌లోనే ఈ దేశ ఆర్థిక పరిస్థితి, ఆనాటి దేశ ఆర్థిక పరిస్థితిని గమనించినట్లైతే, అప్పుడు మన దేశంలో రెండు వారాలకు సరిపోయే దిగుమతులు, మారక నిల్వలు మాత్రము ఉన్న పరిస్థితి ఉంది. ఆర్థికంగా ఏ దేశం కూడా మనకు సపోర్ట్ చేయని పరిస్థితిలో మన్మోహన్ సింగ్‌గారిని ఫైనాన్స్ మినిస్టర్‌గా తీసుకురావడం జరిగింది.

వారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనే లిబరలైజేషన్, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వంటి మూడు సూత్రాలను..., పేద,బడుగు, బలహీన వర్గాలకు సంబంధించినటువంటి అనేక అంశాలలో, ఈరోజు ఐటీ రంగంలో, గ్రామీణ ప్రాంతాలలో ఉండే రైతుల పట్ల, యువతరానికి ఉద్యోగాలు వంటి చాలా కీలకమైన అంశాల్లో వారు ఆరోజుల్లోనే ఈ దేశ ఆర్థిక పరిస్థితిలో నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. అయితే దీనిలో పి.వి. నరసింహారావుగారిది, మన్మోహన్ సింగ్‌గారిది విడదీయరాని సంబంధమని చెప్పవచ్చు.

ఈరోజు మనం మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గారి గురించి మాట్లాడినప్పటికీ వారిని వెన్నుతట్టి నడిపించిన పి.వి. నరసింహారావుగారిని కూడా మరువలేనటువంటిదని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. వారు మన మధ్యలేకపోవడం, వారు మరణించడం బాధాకరమైనప్పటికీ ఈరోజు గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి తీర్మానంలో వారికి భారత్ రత్న అవార్డును ఇవ్వాలని..., ఈరోజు ఈ దేశంలో రీఫామ్స్ తీసుకురావడం మూలాన ఈరోజు దేశస్థితి గతులు మారడమే కాకుండా ప్రపంచదేశాల ముందు కూడా మనం బలంగా నిలబడడానికి కారణమైనటువంటి వ్యక్తికి "**భారతరత్న**" అవార్డును ఇవ్వడం అనేది అత్యంత అవసరమైన సందర్భం ఇది. హైదరాబాదులోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి మా పార్టీ పక్షాన మేము సంపూర్ణంగా సపోర్ట్ చేస్తున్నాము.

అదే విధంగా కేటీఆర్‌గారు చెప్పినట్లుగా పి.వి.నరసింహారావుగారు ఈ దేశానికిఘనమైన సేవలందించిన వ్యక్తి కాబట్టి, వారి యొక్క మెమోరియల్ ఢిల్లీలో ఏర్పాటు చేయడానికి కావలసిన తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టవలసిందిగా గౌరవ ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాము.

అటువంటి గొప్ప వ్యక్తి మన మధ్యన లేకపోవడం అనేది ఈ దేశ ప్రజలే కాదు, ప్రపంచ ప్రజలు కూడా బాధపడుతున్న సందర్భం ఇది. రాజకీయ రంగంలో అనేకమైన హోదాలున్నప్పటికీ అత్యంత బలమైన హోదా ప్రధానమంత్రి పదవి. ఈ దేశంలో ఎంతో సింపుల్‌గా ఉన్న వ్యక్తి డా.మన్మోహన్ సింగ్‌గారు. వారు మాజీ ప్రధానమంత్రి అయిన తరువాత కూడా అంతే సింపుల్‌గా ఉండడం మనం చూశాము. పి.వి. నరసింహారావుగారిని చూసినప్పుడు కూడా అలాంటి అభిప్రాయమే కలుగుతుందని తెలియజేస్తూ, వారి కుటుంబానికి ఆ భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ, నాకు మాట్లాడే అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అధ్యక్షా.

12.10 మ. | శ్రీ పొన్నం ప్రభాకర్ (గౌరవ రవాణా మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మాత్యులు):– అధ్యక్షా, ఈరోజు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సభలో ప్రవేశపెట్టిన డా. మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానాన్ని, అదే విధంగా వారికి భారతరత్న ఇవ్వాలనే ప్రతిపాదనను బలపరుస్తున్నాను. తెలంగాణ ఏర్పాటులో వారి సేవల్ని దేశం మొత్తంలో ఉన్న 29 రాష్ట్రాల్లో మనం చర్చించుకోవడం గాని, వారి పట్ల సుహృద్భావమైన ప్రేమ, అప్యాయతలతో వారికి నివాళులు అర్పిస్తున్నాను. వారికి భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తూ, హైదరాబాద్‌లో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో విగ్రహం

ఏర్పాటుతో ఒక స్మారక కార్యక్రమాన్ని కూడా నిర్వహించే విధంగా, ప్రతి సంవత్సరం వర్ధంతి, జయంతి నిర్వహించే విధంగా అధికారిక కార్యక్రమం తీసుకుంటున్నందుకు ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

15వ లోక్‌సభలో నాతోపాటు ఈ సభలో ఉన్న గౌరవ సభ్యులు వివేక్ గారు, రాజగోపాల్ రెడ్డి గారికి కూడా మన్మోహన్ సింగ్ గారితో 5 సంవత్సరాలు పనిచేసే అవకాశం కలిగినందుకు మా అదృష్టంగా భావిస్తున్నాను. 2009లో మేము ఆరోజు యువకులుగా 15వ లోక్ సభలో అడుగుపెట్టినప్పటికీ వారు అప్పటికే మొదటి యుపిఏ ప్రభుత్వంలో 5 సంవత్సరాలు ప్రధానమంత్రిగా చేసి ఈ దేశంలో అనేక సంస్కరణలు, చట్టాలు తీసుకొచ్చి అప్పటికే ప్రభుత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 42 మంది ఎంపిలలో 33 మంది ఎంపిలు మద్దతివ్వడంతో, ఆ సందర్భంలో జరిగిన అనేక కార్యక్రమంలో పాలుపంచుకునే అవకాశం దొరికింది. డా. మన్మోహన్ సింగ్ గారు మాట్లాడరని అందరూ అంటూ ఉంటారు. కాని, వారు చేసిన అంశాల గురించి ప్రపంచమంతా మాట్లాడుకునే విధంగా వారి కార్యక్రమాలున్నాయి.

ఆనాడు వారు అవిభక్త భారతదేశం పంజాబ్‌లో 1932 సెప్టెంబర్ 26న జన్మించారు. వారు పంజాబ్ యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. అలాగే, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుండి డి.ఫిల్ పొందడం జరిగింది. అదే విధంగా అనేక రచనలు చేసి ఉర్దూ మాధ్యమం ద్వారా ప్రాథమిక విద్యను, ఎకనామిక్స్‌లో బీఏతోపాటు 1954లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేయడం జరిగింది. వారు కేంబ్రిడ్జ్ యూనివర్సిటి నుండి ట్రై పోస్ పట్టా పొందారు. 1958లో శ్రీమతి గురు చరణ్ కౌర్ గారిని వివాహం చేసుకొని ముగ్గురు ఆడపిల్లలకు జన్మనివ్వడం జరిగింది. వారు ప్రత్యేక వ్యక్తిగత జీవితాన్ని కూడా పక్కన పెట్టి అనేక సందర్భంలో దేశ ఆర్థిక సంస్కరణలకే ఎక్కువగా సమయాన్ని కేటాయించడం జరిగింది. 1963-65 పంజాబ్ విశ్వవిద్యాలయంలో ఆర్థికవ్యవస్థలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. వారి విద్యాభ్యాసం గురించి కావచ్చు, మనం ఈరోజు సభలో వారు ఏ విధంగా పైకి వచ్చారనే అంశాలను గురించి చర్చించుకుంటే బాగుంటుంది. దాని తదుపరి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా 1982-85 వరకు పనిచేశారు. ఆర్‌బీఐ యాక్ట్‌లో కొత్త కొత్త చాప్టర్లను ప్రవేశపెట్టారు. అదే విధంగా ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసిన అనుభవంతో బ్యాంకులకు సంబంధించి అనేక సంస్కరణలు చేపట్టారు. తరువాత మా జిల్లాకు సంబంధించి తెలంగాణ ముద్దు బిడ్డ అయిన పి.వి. నర్సింహా రావు గారి హయాంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ విధంగా అనేకమైన కార్యక్రమాలు చేపట్టిన డా.మన్మోహన్ సింగ్ గారిని ఈ సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటున్నాము.

వారి హయాంలో ముఖ్యంగా 2004 నుండి 2009తో పాటుగా 2009-14 వరకు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఆహార భద్రత చట్టం తీసుకురావడం జరిగింది. భూసేకరణ చట్టంతోపాటుగా స్ట్రీట్ వెండర్స్‌కు సంబంధించి అనేక కార్యక్రమాలు చేశారు. అదేవిధంగా ఓబీసీ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఓబీసీ పార్లమెంటరీ కమిటీ సభ్యునిగా, ఆహార భద్రతకు సంబంధించిన సభ్యునిగా అనేక రకాలుగా వారితో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. ఆ సందర్భంలో దేశం మొత్తం మోడల్ స్కూల్స్ వ్యవస్థను ఏర్పాటు చేశాము. మన రాష్ట్రంలో ఆ రోజు 1142 మండలాలుంటే, 340 మోడల్ స్కూల్స్‌ను ఒక్కొక్కటి రూ.4 కోట్లతో ప్రవేశపెట్టడం జరిగింది. నా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 31 మండలాలుంటే 29 మోడల్ స్కూల్స్ తెచ్చుకోగలిగాము. ఆ విధంగా మోడల్ స్కూల్స్ వ్యవస్థను, అంతకుముందు పి.వి.నర్సింహా రావు గారి హయాంలో నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు ఏ విధంగానైతే తీసుకొచ్చారో, డా. మన్మోహన్ సింగ్ హయాంలో కూడా మోడల్ స్కూల్స్ తీసుకొస్తే అవి జూనియర్ కళాశాలు వరకు రావడం జరిగింది. అవి ఈ రోజు ప్రతి మండల కేంద్రంలో విద్యను అందించే విధంగా ఎదిగాయి.

వారు 1991-96 వరకు ఆర్థిక మంత్రిగా ఉన్నప్పటి అనేక అంశాలను తీసుకున్నట్లైతే, పి.వి.నర్సింహా రావు గారి సంస్కరణలు ఆర్థికంగా ఏ విధంగా ఉండేవో చూసి, ప్రభుత్వానికి

సంబంధించి భారతదేశాన్ని ఏ పరిస్థితి నుండి ఏ పరిస్థితి తీసుకుచ్చారనే అంశాలను ఇప్పుడు సభలో ఉన్న వక్తలందరూ మాట్లాడారు. ఆ రోజు ఉన్న పరిస్థితుల్లో వాస్తవంగా మీరు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి రావాలని పి.వి.నర్సింహా రావు గారు పంపితే, వారు దానిని అంత సీరియస్ తీసుకోకపోతే, పి.వి.నర్సింహా రావు గారు మంచి బట్టలు వేసుకొని రావాలని మన్మోహన్ సింగ్ గారిని ఆదేశిస్తే, అప్పుడు వారు ప్రధానమంత్రి గారి ఆదేశాన్ని తీసుకొని మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇంతకు ముందు చెప్పినట్లుగా రాజకీయాలకు సంబంధం లేకున్నప్పటికీ కూడా ఒక ఆర్థికనిపుణుడిగా, మన్మోహన్ సింగ్ గారు ఆర్థికమంత్రిగా దాని తదుపరి ప్రధానమంత్రి అయిన సందర్భాన్ని జ్ఞాపకం చేసుకుంటున్నాము. ఇంతకు ముందు ముఖ్యమంత్రి గారు చెప్పినట్లు గ్లోబలైజేషన్‌ను తీసుకొచ్చిన పద్ధతి ఏదైతే ఉందో దాని ద్వారా ఈ దేశాన్ని ఇంత పెద్ద ఎత్తున విస్తరించుకోగలుగుతున్నాము. ఆర్థికంగా ముందుకు పోతున్న సందర్భంలో ఇవన్నీ మననం చేసుకుంటున్నామనే మనవి చేస్తున్నాను.

వారు అన్నింటికంటే ఎక్కువ ఉపాధి హామీ చట్టం దానితోపాటుగా, ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించి ఎవరైనా పారదర్శకంగా ఆ నిర్ణయం మీద సమాచారం తెలుసుకునేటువంటి రైట్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ తెచ్చారు. ఇది ఏ రాజకీయ నాయకుడు ప్రపంచంలో ధైర్యం చేయని విధంగా చేశారు. దాని తరువాత రాజకీయాలకు సంబంధం లేదు. రాజకీయాలను ఏ విధంగా నీరు గారుస్తున్నారనే విషయం ఇప్పుడు అవసరం లేదు కాని, పారదర్శకతకు సంబంధించి ఒక పెద్ద గొప్ప పేరు తెచ్చుకున్న వ్యక్తి ఆర్‌టీఐ యాక్ట్ తీసుకొని రావడం జరిగింది. అదే విధంగా భూ సేకరణకు సంబంధించి కావచ్చు, ఆహార భద్రత కావచ్చు లేదా రూ.72 వేల కోట్ల రుణమాఫీ కావచ్చు ఆ రోజు ఆంధ్రప్రదేశ్‌కే రూ.12 వేల కోట్లు మాఫీ సంగతి కావచ్చు ఆ విధంగా 1894లో అప్పటి చట్టాలను మార్చి 2013లో భూ సేకరణ చట్టం వంటి అనేక చారిత్రాత్మక చట్టాలను తీసుకురావడం జరిగింది.

ప్రత్యేకంగా తెలంగాణకు సంబంధించి మాట్లాడుకుంటున్నాము. హైదరాబాద్ రాజధానిగా తెలంగాణ ఇవ్వడానికి వారు సమయస్ఫూర్తి చూపెట్టారు. ఆ రోజు వారు తెలంగాణకు ఇచ్చిన మెట్రో రైలు, లేదా ఆనాడు ప్రపంచ బ్యాంక్ నిధులతో హైదరాబాద్‌లో ఓఆర్ఆర్‌ను ఇవ్వడం, హైదరాబాద్ నగరానికి మరియు తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన విషయంలో వారు గొప్ప చాలా గొప్ప నిర్ణయాలు తీసుకున్నారనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను. ఊహాత్మక దృక్పథం, రాజకీయ ధైర్యం లేకుండా మన్మోహన్ సింగ్ గారు లేకుంటే భారతదేశ అపూర్వ సహకారం సాధ్యమయ్యేది కాదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గారు అన్నారు. అదే విధంగా భారత్ తన కుమారుల్లో ఒకరిని కోల్పోయిందని ఆఫ్ఘనిస్తాన్ మాజీ అధ్యక్షుడు హమిద్ కర్జాయ్ గారన్నారు. ఈ విధంగా ప్రపంచ మొత్తంగా వారి మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని తెలిపింది. 33 సంవత్సరాలు రాజ్యసభ సభ్యునిగా, వివిధ సందర్భాలో భారతదేశానికి సంబంధించిన రాజకీయ జీవితాల్లో సేవ చేశారు. మొన్నటికి మొన్న ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు 90 సంవత్సరాల వయసులో కూడా వీల్‌ఛైర్‌లో రాజ్యసభకు వచ్చి ఓటు వేసిన వ్యక్తి డా.మన్మోహన్ సింగ్ గారు.

5 సంవత్సరాలు మేము రాజ్యసభ సభ్యులుగా ఉన్నప్పుడు వయసుతో సంబంధం లేకుండా తెలంగాణ ఉద్యమానికి సంబంధించి అది ఉభయసభను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించే సభ కావచ్చు, లేదా ఇంకొక సభ కావచ్చు తెలంగాణ కావాలని ఆనాడు పార్లమెంట్ సభ్యులందరం మాట్లాడి ఉద్యమించే అనేక సందర్భాల్లో ప్రధానమంత్రిగా వారు మమ్మల్ని పిలిచి నలుగురు సభ్యుల కోర్ కమిటీ వేసి తెలంగాణ ఏర్పాటు పట్ల వారు సానుకూలమైన వైఖరిని అవలంబించేవారు. ఈ విధంగా 5 సంవత్సరాలు మేము వారితో కలిసి ప్రజాస్వామ్య విలువలను ప్రజాస్వామ్యం ఏ విధంగా ఉండాలి అనే మాటలు నేర్చుకోవడమే కాకుండా ప్రజా సమస్యలపై ఏ విధంగా మాట్లాడాలి, ప్రజా సమస్యలకు అత్యున్నతమైన పార్లమెంట్ వేదికను ఏ విధంగా

వినియోగించుకోవాలనే మార్గదర్శకత్వం చేశారనే మాటను ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

వారు, పి.వి నరసింహారావు ఉన్నప్పుడే నేను వంగర గ్రామానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పినప్పుడు, తప్పకుండా ఈ ప్రాంతం అభివృద్ధి కావాలని వారి ఆశీర్వచనంతో జిల్లాలో కరీంనగర్‌తో పాటుగా సిరిసిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాలను తెచ్చుకోగలిగాము. అదే విధంగా, ప్రత్యేకించి నియోజకవర్గమే కాకుండా తెలంగాణ అభివృద్ధికి కూడా పార్లమెంట్‌లో నేను ఎంపిగా కన్వీనర్‌గా ఉన్నప్పుడు అందరం కూడా వారితో కలిసి తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన అనేక కార్యక్రమాలు తీసుకొచ్చాము. జైపాల్ రెడ్డి గారు గాని, ఆనాడు తెలంగాణ పాత్రికేయులుగానీ, మంత్రులు గాని, సహచర పార్లమెంట్ సభ్యులందరం కూడా డా.మన్మోహన్ సింగ్ గారితో తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించి చర్చించడం జరిగింది. ఏదేమైనా ఈ సందర్భంగా రాజకీయాలు మాట్లాడడం కొంత బాధ కలిగించింది. వారికి జవాబు చెప్పడానికి ఒక చిన్న వర్డ్‌ను మాత్రం చెప్తాను. నమస్కారం చేస్తే ప్రతి నమస్కారం చేయనటువంటి సంస్కారం లేని వాళ్ళు కూడా డా. మన్మోహన్ సింగ్ లాంటి వ్యక్తి గురించి మాట్లాడుతుంటే.. తప్పు అనిపిస్తుంది. మన్మోహన్ సింగ్ గారికి సంబంధించిన సంతాప సభ పెట్టుకొని వారిని గౌరవిస్తున్నాము. రాజ్యసభలో ఆ రోజు బిల్ పాస్ కాకుండా ఉంటే, వెంకయ్యనాయడు గారిని, అద్వానీ గారిని బ్రేక్‌ఫాస్ట్‌కు పిలిచి ఈ తెలంగాణ రాష్ట్రఏర్పాటు ఆవశ్యకత ఉన్నదని, రాజ్యాంగ సవరణలు చేస్తే తిరిగి పార్లమెంట్‌కు పంపవలసి వస్తుందని, ఇబ్బంది ఏర్పడుతుందని, చర్చల ద్వారా పార్లమెంట్‌లో ప్రకటన చేసి తెలంగాణ ఏర్పాటు కొరకు ఒక బాధ్యత నిర్వహించిన వ్యక్తిని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో వారి పాత్ర, వారి చొరవను ఈ సందర్భంగా జ్ఞాపకం చేసుకోవాలి. అటువంటి వ్యక్తికి సంబంధించి రాజకీయాలు ఎన్ని అయినా ఉండవచ్చు, దీని తదుపరి అనేక విధాలుగా రాజకీయ కోణంలో మాట్లాడుకుంటాము కావచ్చు, కానీ, ఈనాడు తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి ఆనాడు ప్రధానమంత్రిగా ఒకవేళ తాను సుముఖంగా లేనట్లైతే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడేది కాదనే అంశాన్ని అందరం కూడా మరవకూడదనే మాటను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

12.20 మ. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గారు మౌనంగా ఉంటూనే వారిచ్చిన నిర్ణయాలు ఈ రోజు ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ప్రభుత్వం అమలు చేసి దేశ నిర్మాణంలో ముందుకు పోతూ, ఆధార్ కార్డ్ వంటి ఇతరాత్రా అంశాలను అనేక రకాలుగా ఈ రోజు మనం వాటన్నింటినీ జ్ఞాపకం చేసుకుంటూ, ఈ సభ ద్వారా వారితో ఐదు సంవత్సరాలు కలిసి పని చేసిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి హృదయ పూర్వకంగా నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులందరికి కూడా సంతాపాన్ని తెలియజేస్తూ, గౌరవ ముఖ్యమంత్రి గారు సభా నాయకుడిగా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తూ, మిగతా సభ్యులందరి సూచనలు కూడా పరిగణనలోకి తీసుకొని వారికి ఘనంగా ఈ సభ నివాళులర్పిస్తుందని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (గౌరవ రోడ్లు మరియు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు):- అధ్యక్షా, ఈ రోజు గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానానికి సంపూర్ణంగా మద్దతునిస్తూ, భారతరత్నతో బాటు హైదరాబాద్‌లో వారి విగ్రహంతోబాటు వారి జీవిత చరిత్ర, ఒక మెమోరియల్ పార్క్‌ను కూడా ఏర్పాటు చేసే విధంగా అందరితో చర్చించి ఒక సూటబుల్ ప్లేస్‌లో, అది ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్ ఏరియానా, ఇంకేదైనా మంచి ప్లేస్‌లో రద్దీగా ఉండే ప్లేసులో ఏర్పాటు చేయడానికి వారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అంగీకరిస్తూ, గౌరవ సభ్యులు మరియు ముఖ్యమంత్రి గారు, డెప్యూటీ ముఖ్యమంత్రి గారు, శ్రీధర్ బాబు గారు, ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు వారి గురించి చాలా మంచి విషయాలు చెప్పారు. అన్నింటికి మించి ఆయన ప్రపంచం మెచ్చిన ఆర్థికవేత్త. సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి బాట పట్టించిన గొప్ప నాయకుడు. ఎన్నో అద్భుతమైన చట్టాల రూపకర్త. ఇవన్నీ ఒక ఎత్తైతే రాజకీయాల్లో ఉండే నాయకులు ఎంత హుందాగా వ్యవహరించాలో చెప్పిన అరుదైన నాయకుడు స్వర్గీయ మన్మోహన్ సింగ్ గారు. ఇవాళ

రాజకీయ నాయకులు హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్స్ అని మతాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారు. కానీ ఆయన సిక్కుగా తలపాగా ధరించినా ఈ దేశమంతా ఆయన మా ప్రధాని అని భావించింది తప్పితే ఆయనలో ఈ దేశం మతం చూడలేదు. అదే నిజమైన భారతీయత. ఈ రోజు ఒక మాటలో చెప్పాలంటే స్వర్గీయ మన్మోహన్‌సింగ్ గారు నిజమైన దేశభక్తికి జెండాలాంటి నాయకుడు. ప్రధాని పదవిలో ఉన్నా ఇంటి నుంచి సద్దన్నం తీసుకువచ్చి లంచ్ చేసుకుంటూ సామాన్య పౌరునిగా వ్యవహరించిన వ్యక్తి. ఈ దేశానికి ఏమి కావాలో వారికి తెలిసినంతగా మరే నాయకుడికి తెలియదంటే అతిశయోక్తి కాదు. 1991వ సంవత్సరంలో ఈ దేశం బంగారం కుదవ పెట్టి, అప్పు చేయకపోతే నడవదు అన్న స్థితి నుంచి ప్రపంచంలో ఐదవ అతి పెద్ద ఆర్థిక శక్తిగా మలిచిన ఘనత కేవలం మన్మోహన్ సింగ్ గారిదే అంటే ఆశ్చర్యపోనవసరం లేదు. 1991వ సంవత్సరంలో విదేశీ వస్తువుల కొనుగోలు శక్తిలో ప్రపంచంలో చివరి స్థానంలో ఉన్న భారత్‌ను 2014వ సంవత్సరానికి మూడవ స్థానానికి తీసుకువచ్చారు. 2014 నుండి ఇప్పటికీ మూడవ స్థానంలోనే ఉన్నాము.

ఆయనను ఒక సందర్భంలో అందరూ యాక్సిడెంటల్ ప్రధాని అంటుంటే, ఆయన యాక్సిడెంటల్ ప్రధానే కాదు యాక్సిడెంటల్ ఫైనాన్స్ మినిస్టర్ అని కూడా ఛలోక్తిగా, నిజాయితీగా ఒప్పుకున్నారు. అలాంటి నిగర్వి డా.మన్మోహన్ సింగ్ గారు 2004 నుండి 2014వ సంవత్సరం వరకు పది సంవత్సరాలు ప్రధాన మంత్రిగా చేశారు. ఈ పది సంవత్సరాల కాలంలో భారత దేశ జిడిపి వృద్ధి రేటు 8 నుండి 9 శాతముంటే ఇప్పుడు 5 శాతం వరకు వచ్చాము. డిమానిటైజేషన్ చేసినప్పుడు, రాజ్యసభలో ఆయన ప్రసంగంలో డిమానిటైజేషన్ వల్ల జిడిపి 2 నుండి 2.5 వరకు తగ్గుతుందని చెప్పారు. ఆయన చెప్పనట్టే అది తగ్గింది. నిజంగా అలాంటి నాయకుడు ఈ రోజు లేకపోవడం చాలా బాధకరం. వయో భారంతో ఉన్నా, ఈ రోజు దేశాన్నే మలుపు తిప్పిన మహానాయకుడు. ఒక వైపు మహాత్మాగాంధీ ఉపాధి హామి పథకం. ఎవరూ ఊహించలేదు. ఆ రోజు పేద వారు ఆకలితో చనిపోకూడదు, ఆకలితో ఉండకూడదని చట్టం ద్వారా ఉపాధి హామి పథకాన్ని తీసుకువచ్చారు. అలాంటి పథకాన్ని తీసుకువచ్చి, ఇటీవల నాలుగైదు సంవత్సరాల క్రితం కరోనా వచ్చినప్పుడు అదే చట్టం లేకపోతే లక్షలాది మంది చనిపోయేవారు. ఆ చట్టం రూపేనా తీసుకువచ్చిన ఉపాధి హామి పథకం కానీ, ఆహార భద్రతా చట్టం కానివ్వండి, ఒక వైపు చెప్పాలంటే ఉపాధి హామీతో బాటు పట్టణాలు కూడా అభివృద్ధి కావాలని జవహర్‌లాల్ నెహ్రు నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ కూడా తీసుకువచ్చి ఈ రోజు దేశాన్ని మలుపు తిప్పిన నాయకుడు. ఇక్కడ వాళ్ళ కూతురు రాసిన 'STRICTLY PERSONAL' బుక్కునుండి విషయం ఒకటి చెప్పుకోవాలి. వారు కేంబ్రిడ్జ్‌లో చదువుకునేటప్పుడు ఆ పేదరికంలో తినడానికి డబ్బులు లేకు చాక్లెట్ తినేవాడని ఆ బుక్‌లో రాయడం జరిగింది.

సమాచార హక్కు చట్టంతో లక్షల కోట్ల అవినీతి బయట పడడంతోపాటు, ప్రతి ఒక్కరికి ఈ రోజు ప్రశ్నించే హక్కు కల్పించారు. విద్యాహక్కు చట్టం వంటి వాటి అన్నింటి గురించి కూడా పెద్దలు చెప్పారు. నిజంగా అలాంటి గొప్ప నాయకుడు. ఈ రోజు మా గౌరవ ముఖ్యమంత్రి గారు, అలాగే ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, నేను ముగ్గురం ... అంటే ఆయనకు 90 సంవత్సరాల వయస్సు. అంటే రెండు సంవత్సరాల క్రితం పార్లమెంట్ నుంచి మేము బాయ్‌కాట్ చేసి బయట చలిలో మేము ధర్నా చేస్తుంటే మా ముగ్గురి మధ్య దాదాపు 30 నిమిషాలకు పైన కూర్చొన్నారు. ఆ ఫోటోను ట్విట్టర్‌లో చూశాం. మా గౌరవ ముఖ్యమంత్రి గారు, అలాగే ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, నేను వారితో ఉన్న ఫోటోను ట్విట్టర్‌లో చూసి పొద్దున చేసి, నిజంగా ఆ జ్ఞాపకాలు చూసుకొని ఏడుపు వచ్చింది అధ్యక్షా. ప్రధాన మంత్రిగా పని చేసి, 90 సంవత్సరాల వయస్సులో మాతో కూర్చొని, మాతో మాట్లాడుకుంటూ ఉన్న ఆ ఫోటోను చూస్తుంటే నిజంగా కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. నిజంగా అలాంటి నాయకుడు ఈ రోజు లేకపోవడం చాలా బాధాకరం.

నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను గుర్తించి మన్మోహన్ సింగ్ గారు ప్రధానమంత్రిగా ఉన్న కేబినెట్‌లో సోనియా గాంధీ గారు తెలంగాణ అంశాన్ని పెట్టింది. ఈ మహా నాయకుడి విగ్రహాన్ని హైదరాబాద్‌తో బాటు జిల్లా కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేసుకొని ఈ తెలంగాణ ఉన్నంత కాలం ఆయన పేరు చిరకాలంగా ఉండే విధంగా ఆ కార్యక్రమాన్ని కూడా తీసుకోవాలని మా గౌరవ ముఖ్యమంత్రి గారిని రిక్వెస్ట్ చేస్తున్నాను. ఎక్కడికక్కడ మేము కూడా పార్టీ పరంగా కానీ, మా పరంగా కానీ, మా జిల్లా కేంద్రంలో..., మన్మోహన్ సింగ్ గారు, సోనియా గాంధీ గారు లేకుంటే తెలంగాణ ఎప్పటికీ వచ్చేది కాదు. మన పొన్నం ప్రభాకర్ గారు ఇప్పుడే చెప్పారు. వెంకయ్యనాయుడు గారిని పిలిపించి, ఒప్పించి మీరు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సహకరించండని చెప్పారు. అలాంటి నాయకుడు చేయబట్టే ఈ రోజు తెలంగాణ వచ్చింది. పార్టీపరంగా మా నాయకురాలు సోనియా గాంధీ గారు ఒక కఠినమైన నిర్ణయం తీసుకొని ఆంధ్రప్రదేశ్‌లో మా పార్టీ మొత్తం పోయినా సరే, తెలంగాణ ఇవ్వాలని చెప్పింది. కాబట్టి అలాంటి మహానాయకునికి హైదరాబాద్‌తోబాటు, జిల్లా కేంద్రాల్లో కూడా స్మారకంగా, ఆయన నిజాయితీకి మారు పేరుగా, ఆయన చేపట్టిన కార్యక్రమాలన్నీ కూడా రాబోయే యువతకు స్ఫూర్తిగా ఉండే విధంగా ఈ కార్యక్రమాన్ని చేద్దామని మరొకసారి మా గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సంపూర్ణంగా సమర్థిస్తున్నాను. మా ముగ్గురు వ్యక్తుల మధ్యలో ఆ మహానాయకుడు కూర్చొన్న ఫోటో మా ఇంట్లో పెట్టుకొని, నిజంగా ఆ రోజు ట్విట్టర్‌లో చూస్తే, ఆ రోజు ఆయన గురించి చదువుతూ ఆ ఫోటో చూశాను. మా మధ్యలో ఇంత పెద్ద మహానీయుడు కూర్చొన్నడని ఆ చనిపోయిన రోజు ట్విట్టర్‌లో ముగ్గురం చూసుకొన్నాము. నిజంగా అలాంటి నాయకుడు చరిత్రలో ఇక ముందు వస్తాడో రాడో తెలియదు కానీ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

12.30 మ. | శ్రీ టి. హరీష్ రావు (సిద్ధిపేట):- అధ్యక్షా, సభా నాయకులు రేవంత్‌రెడ్డి గారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని బీఆర్ఎస్ పార్టీ తరపున సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తున్నాను. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి గారు కూడా ఇక్కడే ఉన్నారు. ఒక విషయం వారి దృష్టికి తీసుకువచ్చి నేను సబ్జెక్టులోకి వెళతాను.

మన్మోహన్‌సింగ్ గారు పెద్దల సభ (రాజ్యసభ)లో 33 సంవత్సరములు పనిచేశారు. ఈ రోజు మన రాష్ట్రంలోని పెద్దల సభలో వారికి నివాళులు అర్పించి ఉంటే చాలా సముచితంగా ఉండేది. ఎమ్మెల్సీలు కూడా చాలా మంది అడుగుతున్నదేమంటే... ఎందుకు మన్మోహన్‌సింగ్ గారి సంతాప తీర్మానాన్ని శాసన పరిషత్తులో ప్రవేశ పెట్టలేదనే విషయాన్ని వారు కూడా అడుగుతున్నారు. శాసనసభలో పెట్టినప్పుడు శాసన పరిషత్తులో కూడా వారికి నివాళులు అర్పించి ఉంటే బాగుండేది. ఈ విషయాన్ని మంత్రిగారు గమనంలోకి తీసుకుంటారని భావిస్తున్నాను. ఇకపోతే మన్మోహన్‌సింగ్ గారు భౌతికంగా మన మధ్య లేకపోయినా గానీ ఆయన దేశానికి చేసిన సేవలు చరిత్ర ఉన్నంత కాలం నిలిచే ఉంటాయి. సామాన్య కుటుంబంలో పుట్టి వీధి దీపాల మధ్య లాంతర్లు పెట్టుకొని చదువుకొని , స్కాలర్‌షిప్‌ల మీద ఆధారపడి చదువుకొని, అసామాన్య వ్యక్తిగా ఎదిగిన అరుదైన నాయకులు డా. మన్మోహన్‌సింగ్ గారు.

ఆర్థికశాస్త్రాన్ని బోధించే అధ్యాపకుడిగా దేశ ఆర్థిక విధానాలను నిర్దేశించే స్థాయికి వెళ్లారంటే క్రమశిక్షణ కలిగిన వ్యక్తిత్వం, దేశం కోసం కష్టపడి పనిచేయాలనే పట్టుదలే కారణం. విదేశాలలో కూడా వారికి ఎన్నో గొప్ప గొప్ప అవకాశాలు వచ్చాయి. ఎన్నో పెద్ద పెద్ద ఉద్యోగాలు విదేశాలలో వచ్చినా వాటన్నింటిని తిరస్కరించి ఈ దేశం నాకు ముఖ్యమని తన మాతృభూమి కోసం జీవితాన్ని అంకితం చేసినటువంటి మహనీయులు డా.మన్మోహన్ సింగ్ గారు. మన్మోహన్‌సింగ్ గారు ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదు. పదవులే ఆయన దగ్గరకు వచ్చాయి తప్ప ఆయన ఎప్పుడూ పదవుల కోసం ఏ రోజు కూడా

పాకులాడడం గాని ప్రయత్నం చేసిన సందర్భం గాని లేదు. యూనివర్శిటీ గ్రాంట్స్ ఛైర్మన్‌గా, ఆర్‌బిఐ గవర్నర్‌గా, ఆర్థిక శాఖ ముఖ్య సలహాదారుడిగా, ప్లానింగ్ కమిషన్ డెప్యూటీ ఛైర్మన్‌గా , అటామిక్ ఎనర్జీ స్పేస్ కమిషన్ సభ్యుడిగా, దేశ ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధాన మంత్రిగా, రాజకీయాలకు అతీతంగా ఎన్నో గొప్ప గొప్ప పదవులు అంకితభావంతో నిర్వహించిన వ్యక్తి డా. మన్మోహన్‌సింగ్‌గారు. రాజకీయాలకు సంబంధం లేనటువంటి వ్యకిని దేశ రాజకీయాలకు పరిచయం చేసిన వ్యక్తి మన తెలంగాణ ముద్దుబిడ్డ మన పి.వి నరసింహారావు గారు. దేశం క్లిష్ట పరిస్థితులలో ఉన్నప్పుడు, ఆర్థిక రంగం కుదేలై అప్పులు కూడా పుట్టని పరిస్థితులలో దేశ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన పి.వి.నరసింహారావు గారు మన్మోహన్‌సింగ్ గారిని తన మంత్రి వర్గంలో ఆర్థిక శాఖలోకి తీసుకోవడం మనందరికి తెలిసిన విషయమే.

పి.వి. నరసింహారావు గారు ఏ నమ్మకమైతే ఉంచి వారికి అవకాశం కల్పించారో ఆ విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, దేశ ఆర్థిక రంగానికి కొత్తగా తనదైన శైలిలో ఒక దశ, దిశను చూపించినటువంటి వ్యక్తి మన్మోహన్‌సింగ్ గారు. ఆర్థిక మంత్రిగా వారు చేసిన తొలి బడ్జెట్ ప్రసంగం ఈ దేశ ఆర్థిక మంత్రులు చేసిన ప్రసంగాలలో ఒకటైనటువంటి ఒక అత్యుత్తమమైన ప్రసంగంగా రికార్డులలో నిలిచిపోయింది. పారిశ్రామిక విధానాలను పరిశ్రమల మంత్రిగా ఆనాడు పి.వి.నరసింహారావు గారు మార్చి ఒకగొప్ప పేరు తెచ్చుకుంటే, ఆర్థిక విధానాలను సవరించి ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్ గారు కూడా ఒక గొప్ప పేరు సంపాదించారు. లైసెన్స్ రాజ్, పర్మిట్ రాజ్‌లకు స్వస్థి పలికి ఆర్థిక సరళీకృత విధానాలతో దేశాన్ని దివాళా పరిస్థితి నుండి గట్టెక్కించిన పి.వి.నరసింహారావు గారికి, మన్మోహన్‌సింగ్ ఒక చోదక శక్తిగా ఆ రోజుల్లో పని చేశారు. మన్మోహన్‌సింగ్ గారిని మన్మోహన్ మిక్స్ అనే స్థాయికి ఆయన ప్రభావితం చేశారు. మన్మోహన్‌సింగ్ గారు చనిపొయినప్పుడు చాలా మంది మాట్లాడుతూ వారు ఒకమచ్చలేని నాయకుడు, సుదీర్ఘ కాలం రాజకీయాలలో ఉన్నప్పటికీ ఒక చిన్న మచ్చ కూడా లేకుండా అత్యంత ఉన్నతంగా తన జీవితాన్ని చాలా సింపుల్‌గా సాదాసీదాగా జీవితాన్ని గడిపిన మహనీయులు డా.మన్మోహన్‌సింగ్ గారు. యూపిఏ-IIలో చాలా కుంభకోణాలు జరిగినట్లుగా ఎన్నో వార్తలు రావడమే కాకుండా కేసులు, అరెస్టులు జరిగాయి కానీ మన్మోహన్‌సింగ్ గారు ప్రధానమంత్రిగా ఉన్నా కూడా ఆయనకు ఒక చిన్న మచ్చ కూడా రాలేదంటే అది ఆయన గొప్పతనమని చెప్పవచ్చు.

ఒక అకాడమీషియన్‌గా, అడ్మినిస్ట్రేటర్‌గా, ఒక రాజ్యసభ సభ్యుడిగా, ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధాన మంత్రిగా, దేశంపై మన్మోహన్‌సింగ్ గారు తనదైన ముద్ర వేశారు. ఆర్‌బిఐ గవర్నర్‌గా కరెన్సీ నోట్లపై సంతకం చేసిన మన్మోహన్‌సింగ్ గారు ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధాన మంత్రిగా ఈ దేశంపై ఒక చెరగని సంతకం చేశారు. ఆయన జీవితం దేశసేవలో ధన్యమైంది. మన్మోహన్‌సింగ్ గారిని తరతరాలు ఆయనను గుర్తుంచుకునే విధంగా, స్మరించుకునే విధంగా అటు రాష్ట్ర ప్రభుత్వం గాని ఇటు కేంద్ర ప్రభుత్వం గాని ఎటువంటి నిర్ణయం తీసుకున్నా బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తూ సంపూర్ణమైన మద్దతు తెలుపుతుంది. గౌరవ ముఖ్యమంత్రి గారు వారి విగ్రహాన్ని పెడదామని ప్రతిపాదన పెట్టారు, దానికి మేము సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తున్నాము.

ఇంకా రెండు, మూడు సూచనలు కూడా చేయాలని అనుకుంటున్నాము. ఎందుకంటే పి.వి. నరసింహారావు గారు చనిపోయినప్పుడు ఆ రోజుల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కారణాలు ఏమో కానీ ఆ రోజు వారిని పట్టించుకున్న పరిస్థితి లేదు. తెలంగాణ రాష్ట్ర తొలిముఖ్యమంత్రి కేసీఆర్‌గారు మన రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మనము పి.వి.ఘాట్‌ను ఏర్పాటు చేసుకోవడం, పి.వి.గారి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం, పి.వి.గారి పేరు మీద ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేసుకోవడం, మన శాసనసభలో పి.వి.గారి నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం, నెక్లెస్ రోడ్డుకు పి.వి.గారి పేరును పెట్టడం, పి.వి.గారి జయంతి, వర్ధంతిని అధికారికంగా జరిపించుకోవడం అలాగే పి.వి.గారి వంద సంవత్సరాల

జయంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా జరుపుకోవడం ఇలా ఎన్నెన్నో కార్యక్రమాలను పి.వి.గారి ఖ్యాతిని చాటుకునే విధంగా ఆనాటి టి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు అత్యంత అద్భుతంగా జరిపి "మన పీవి – మన ఠీవి" అనే విధంగా మనం ఆరోజు ఆయనను ఎంతో గొప్పగా గౌరవించుకున్నాము. నేడు మన్మోహన్‌సింగ్ గారికి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు కొత్తగా మీరు ఏర్పాటు చేస్తున్న స్కిల్స్ యూనివర్సిటీకి డా.మన్మోహన్‌సింగ్ గారి పేరు పెట్టాలని నేను మీ ద్వారా సభా నాయకుడికి ప్రతిపాదిస్తున్నాను. భారతరత్న విషయంలో కూడా కచ్చితంగా.. మన దేశం ఆర్థికంగా ఇంత బలపడిందంటే దానికి పి.వి.నరసింహారావుగారి కృషిఎంతగానో ఉన్నది. భారతరత్నకు డా.మన్మోహన్‌సింగ్ గారు ముమ్మాటికీ అర్హులే. ఈ రోజు సభలో పెట్టిన తీర్మానాన్ని నేను సమర్థిస్తూ తప్పకుండా కేంద్రప్రభుత్వం మన్మోహన్‌సింగ్ గారికి భారతరత్న ఇవ్వాలని మేము కోరుకుంటున్నాము. గతంలో పి.వి.నరసింహారావు గారి కోసం ఇదే సభలో సభానాయకుడిగా కేసీఆర్‌గారు వారికి భారతరత్న ఇవ్వాలని ఈ సభలో తీర్మానాన్ని ప్రవేశపెడితే ఆరోజు సభలో ఉన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాము. కేంద్ర ప్రభుత్వం కూడా సబ్సీక్వెంట్‌గా ఈ మధ్య కాలంలో వారికి భారతరత్న ఇచ్చిన విషయం మనందరికి తెలిసిందే. మన్మోహన్‌సింగ్ గారికి కూడా భారతరత్న తప్పకుండా ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ కోరుతున్నది.

మన్మోహన్‌సింగ్ గారు ఒక లాయలిస్ట్ అని ఇందాక కేటీఆర్‌గారు అదే విధంగా మరొక ఇద్దరు సభ్యులు కూడా అన్నారు. మనిషి గొప్పతనం ఎప్పుడు తెలుస్తుందంటే అధికారంలో ఉన్నప్పుడే కాదు. కొన్ని చేదు అనుభవాలు జరిగినప్పుడు కూడా దాన్ని భరించుకొని ఎవరైతే గట్టిగా నిలబడుతారో అప్పుడే మనిషి ఔన్నత్యం, గొప్పతనం, లాయలిస్ట్ అనేది బయటకు వస్తుంది. మన్మోహన్‌సింగ్ గారిని మౌన ముని అని కూడా చాలా మంది సభ్యులు మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎంతోమంది చెబుతూ ఉంటారు. ఒకటి రెండు సందర్భాలు ఈ సందర్భంగా ఆయన గొప్పతనాన్ని చెప్పే క్రమంలో గుర్తు చేయాలనుకుంటున్నాను. గతంలో పి.వి.నరసింహారావు గారు ఐదేళ్లు మైనారిటీ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపారు. అందులో ఆర్థిక శాఖ మంత్రిగా మన్మోహన్‌సింగ్ గారు పని చేశారు. పి.వి.గారు, మన్మోహన్‌సింగ్ గారు చాలా అద్భుతంగా ఈ దేశంలో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలోకి తెచ్చి ఎంతో గొప్పగా వాళ్లిద్దరూ పని చేశారు. అయిదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలయ్యింది. కాంగ్రెస్ ఎందుకు ఓడిపోయిందని తెలుసుకోవడానికి అప్పుడు ఎఐసిసి ఆంథోని కమిటీని వేయగా, కాంగ్రెస్ ఓటమికి పి.వి.నరసింహారావుగారు, మన్మోహన్‌సింగ్‌గారి ఆర్థిక విధానాలు కూడా ఒక కారణమని ఆంథోని కమిటీ రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టు వచ్చినప్పుడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో దాని గురించి చర్చ పెట్టారు.

12.40 మ. ఆ రిపోర్ట్ వచ్చినప్పుడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఆ రిపోర్ట్‌పై చర్చ పెట్టినారు. ఆ రిపోర్ట్ వచ్చినప్పుడు మన్మోహన్ సింగ్ గారు కంటతడి పెట్టారు. కానీ, వారు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆయక ఒక అడుగు కూడా, ఒక అంగుళం కూడా పక్కకు జరగకుండా అదే లాయలిస్ట్‌గా ఆయన పని చేశారు. ఇది ఆరోజుల్లో పత్రికల్లో, టి.వి.ల్లో పెద్ద వార్తగా వచ్చింది. ఏఐసిసి మీటింగ్‌లో మన్మోహన్ సింగ్ గారు కంటతడి పెట్టారనే వార్త దేశంలో పెద్ద చర్చకు దారితీసింది. కానీ, ఆయన నన్ను తప్పు పట్టారని చెప్పి ఆయన విమర్శించడమో, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగానో ఒక్క మాట కూడా మాట్లాడనటువంటి వ్యక్తి. ఆయనలో ఎంత గొప్పతనం, లాయలిస్ట్ అనడానికి కూడా ఒక ఉదాహరణం అని చెప్పుకోవచ్చు.

అదేవిధంగా ఇంకొక సందర్భం కూడా ఉంది. అప్పుడు లాలూప్రసాద్ యాదవ్ గారు యుపిఏ భాగస్వామిగా ఉండే. వారికి రెండేళ్ల జైలు శిక్ష పడ్డది. సరే, యుపిఏ ప్రభుత్వం అప్పుడు నిర్ణయం తీసుకొని ఒక చట్టాన్ని తెచ్చారు. ఒక ఆర్డినెన్స్ తీసుకురావడం జరిగింది. ఆ లాలూప్రసాద్ యాదవ్ గారిని సేవ్ చేయడం కోసం. ప్రధానమంత్రి, మన్మోహన్ సింగ్

గారి అధ్యక్షతన, అప్పుడున్నటువంటి కేబినెట్ ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. ఆ ఆర్డినెన్స్ మీద అట్లెట్ల చేస్తారు? సరే విపక్షాలు, ప్రతిపక్షాలు కొన్ని అల్లర్లు చేసినాయి. దానిని అపోజ్ చేసినాయి. అప్పుడు కాంగ్రెస్ పార్టీ తరపున ఏఐసిసి కార్యాలయంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి దానిని డిఫెండ్, అంటే మా ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయం సరి అయినది, మా కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయం సరి అయినదని చెప్పే క్రమంలో రాహుల్ గాంధీ గారు సడెన్‌గా అక్కడికి చేరుకొని ఆర్డినెన్స్ కాపీలన్నీ చింపేస్తాడు. అంటే, ఒక ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ గారు, ఆయన కేబినెట్ నిర్ణయం తీసుకుంటే రాహుల్ గాంధీ గారు ఆర్డినెన్స్ కాపీలను చింపేస్తాడు. కానీ, అలాంటి సందర్భంలో కూడా, ఆయన ఎంత లాయలిస్ట్ అని నేను చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నా అంటే, కేంద్ర మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాన్ని రాహుల్ గాంధీ గారు బహిరంగంగా తప్పపట్టినా మన్మోహన్ సింగ్ గారు మౌన మునిగానే ఉన్నారు తప్ప, నోరు తెరువలేదు. ఆయన అంత గొప్ప వ్యక్తి అని చెప్పి నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అంటే, ఆయన లాయలిటీ. కాంగ్రెస్ పార్టీ పట్ల ఆయన లాయలిటీని, ఆయన చిత్తశుద్ధిని నేను చెప్పే ప్రయత్నం చేస్తున్నాను.

(అధికార పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

ఆయన ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా కూడా ఎప్పుడూ ఒక్క అడుగు కూడా పక్కకు జరగని ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయన గొప్పతనాన్ని ఈ సభ ద్వారా చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. మన్మోహన్ సింగ్‌ని పొగడటం మీకు ఇష్టం లేదా ఏమీ? ఆయనను పొగుడుతున్నానబ్బా, మన్మోహన్ సింగ్ యొక్క గొప్పతనాన్ని, వ్యక్తిత్వాన్ని చెప్పే ప్రయత్నం చేస్తున్నాం.

(అధికార పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

అధ్యక్షా, సభను కొంచెం ఆర్డర్‌లో పెట్టండి. అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రఏర్పాటులో కూడా తప్పకుండా ప్రధానమంత్రి పాత్ర ఉంది. ఎవరు అవునన్నా, కాదన్నా. మన్మోహన్ సింగ్ గారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే భారత పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ అయింది. ఇది చరిత్రలో దాస్తే దాగే సత్యం కాదు. We have to agree that. గౌరవ సభ్యులందరు కూడా చాలామంది మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రఏర్పాటులో మన్మోహన్ సింగ్ గారి పాత్ర గురించి. కాంగ్రెస్ పార్టీ పాత్ర గురించి కూడా సభ్యులందరు చెప్పారు. అందులో కొన్ని సందర్భాల్లో ప్రత్యక్షంగా నేను కూడా ఉన్నాను. కొన్ని విషయాలని నేను కూడా పంచుకోవాలని అనుకుంటున్నాను.

2004లో కాంగ్రెస్ పార్టీతో అప్పటి మా టిఆర్ఎస్ పార్టీ పొత్తుపెట్టుకోవడం. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పి స్వయంగా యుపిఏ అధ్యక్షురాలు శ్రీమతి సోనియాగాంధీ గారు కరీంనగర్‌లో ప్రకటన చేశారు. కాంగ్రెస్ పార్టీతో అలయెన్స్ జరిగింది. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అప్పుడు కెసిఆర్ గారితో నేను కూడా ఢిల్లీలో ఉన్నాను. అప్పుడు కెసిఆర్ గారిని మన్మోహన్ సింగ్ గారు పిలిచి మీరు కేంద్ర కేబినెట్‌లో చేరండి అని చెప్పి మన్మోహన్ సింగ్ గారు ఆహ్వానించారు. అప్పుడు కెసిఆర్ గారు ఒక మాటన్నారు. నేను మంత్రి పదవుల కోసం ఢిల్లీకి రాలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మాత్రమే ఢిల్లీకి వచ్చామని చెప్పినప్పుడు, ఆ యుపిఏ మీటింగ్‌లో శ్రీమతి సోనియాగాంధీ గారు, మన్మోహన్ సింగ్ గారు మేము తప్పకుండా ఏర్పాటు చేస్తాము. మీరు రాష్ట్రంలో చేరండి, కేంద్రంలో చేరండి అని చెప్పి వారు ఆరోజు ఆహ్వానించడం జరిగింది.

ఆలోచించి చెప్తానని చెప్పి, కేసిఆర్ గారు ఇంటికి వచ్చి, ప్రొఫెసర్ జయశంకర్ గారు, విద్యాసాగర్ రావు గారు మరియు అనేకమంది మేధావులతో చర్చించి మళ్లీ తిరిగి వెళ్లి ప్రతిపాదన పెట్టారు. వారు అంత పెద్ద మనుషులు మనల్ని ఆహ్వానించినప్పుడు చేరకపోవడం కరెక్ట్‌కాదేమో. కానీ, మనం వచ్చినటువంటి ఎజెండా తెలంగాణ కదా. యుపిఏ కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో తెలంగాణ అంశాన్ని చేర్చండి. తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను మేం చేస్తామని మీరు యుపిఏ కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో పెడితే మేం తప్పకుండా కేబినెట్‌లో చేరతామని చెప్పి ఆరోజు కెసిఆర్ గారు చెప్పడం. డా. మన్మోహన్ సింగ్ గారు ఆరోజు అంగీకరించినటువంటి

విషయాన్ని నేను గుర్తు చేస్తున్నాను. అట్లా కేంద్ర ప్రభుత్వంలో కేసీఆర్ గారు చేరారు. ఆరోజు మే 22, 2004న కేసీఆర్ గారు కేంద్ర కెబినెట్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. సాయంత్రానికి షిప్పింగ్ పోర్టిఫోలియో ఇస్తూ గెజిట్ వచ్చింది.

అదేరోజు రాత్రి మాకు షిప్పింగ్ పోర్ట్‌ఫోలియో ఇవ్వకపోతే మేము యుపిఏ నుండి వెళ్లిపోతాం, మాకు షిప్పింగ్ పోర్ట్‌ఫోలియో కావాల్సిందే అని డిఎంకె అంటే, స్వయంగా మళ్లీ కేసీఆర్ గారు మన్మోహన్ సింగ్ గారి వద్దకు, ప్రణబ్ ముఖర్జీ గారి వద్దకు, శ్రీమతి సోనియాగాంధీ దగ్గరకు వెళ్లి అసలు నేను మంత్రి పదవే వద్దన్నా, కానీ మీరు చేరమంటే మీ మీదున్న గౌరవంతో కెబినెట్‌లో చేరాం. ఈ పోర్ట్‌ఫోలియో వాళ్లకు ఇవ్వండి. నాకు యుపిఏ ప్రభుత్వం నిలబడటం ముఖ్యం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం ముఖ్యమని చెప్పి తనకు తానుగా వెళ్లి మన్మోహన్ సింగ్ గారికి వారు స్వయంగా చెప్పినటువంటి విషయాన్ని గుర్తు చేస్తున్నాను.

ఆరోజు మన్మోహన్ సింగ్ గారు కూడా బాగా అప్రిషియేట్ చేశారు. శాఖల కోసం పట్టుబట్టే రోజుల్లో, నీవు శాఖే నాకు అవసరం లేదని ఇంత గొప్పగా చెప్పావని చెప్పి మన్మోహన్ సింగ్ గారు ఆరోజు కేసీఆర్ గారిని బాగా అప్రిషియేట్ చేశారు. ఇక్కడ ఒక విషయాన్ని గుర్తు చేస్తున్నాను. తన శాఖని మూడు రోజుల్లోనే అంటే, మే 22, 2004లో షిప్పింగ్ పోర్ట్‌ఫోలియో వస్తే, మే 25, 2004 నాడు శాఖను తిరిగి ఇచ్చి ఆరు నెలల పాటు అంటే, 27th November, 2004 వరకు శాఖలేని మంత్రిగా డా.మన్మోహన్‌సింగ్ గారి కెబినెట్‌లో కేసీఆర్ గారు పని చేశారు. అధ్యక్షా, ఒక రకంగా ఏ శాఖ లేకపోవడం కూడా కేసీఆర్ గారు తెలంగాణ కోసం తన సమయాన్ని.....

శ్రీ పొన్నం ప్రభాకర్:– అధ్యక్షా, కేసీఆర్ గారు అంటే గౌరవం, కాదనడం లేదు. మనం ఇప్పుడు మాట్లాడుతున్నది మన్మోహన్ సింగ్ గారి గురించి. పోర్ట్‌ఫోలియో లేదా, లేకపోతే ఇంకేం జరుగుతుంది. లేకపోతే మీ యుపిఏ అగ్రిమెంట్ ఏందీ? ఏం జరిగింది కామన్ మినిమమ్ ప్రోగ్రాం. దళిత ముఖ్యమంత్రి, ఇవన్నీ చర్చించడానికి ఇది సందర్భం కాదు కదా అధ్యక్షా. మనం వాగ్దానాలు, మాటలు, జరిగినటు వంటి... కేవలం మన్మోహన్ సింగ్ గారికి సంబంధించి శ్రద్ధాంజలి, సంతాపం, సభ ద్వారా వారు తెలంగాణ ఏర్పాటుకు సహకరించిన తీరు, వారు ప్రధానమంత్రిగా దేశానికి చేసిన సేవలు మాట్లాడటానికి పరిమితమై ఒకరోజు సభ నిర్వహించుకుంటున్నాము. నిజంగా చెబుతున్నాను, ముందుగా గౌరవ ముఖ్యమంత్రి గారితో మట్లాడుకున్నట్లు, ఆనాడు వారితో 5 సంవత్సరాలు పార్లమెంట్‌లో పని చేసిన వాళ్లం కూడా మేము 5, 5 నిమిషాలు మాట్లాడాలని అనుకున్నాం. సబ్జెక్ట్ డీవియేట్ అయిపోయి, ఏదేదో మాట్లాడితే ఎలా అధ్యక్షా? అవన్నీ కూడా, అనుసరమైన సబ్జెక్ట్ కాకుండా, వారు సీనియర్ శాసనసభ్యులు, ఇంతకుముందు మహేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతుంటే, పక్కకు ఏదో చెబుతున్నాడు. ఇవన్నీ... జయశంకర్ గారికి ఏం గౌరవం దొరికింది? దేశిని మల్లయ్యకు ఏం గౌరవం దొరికింది? లేకపోతే పక్కకున్నటువంటి ఆలె నరేంద్రకు ఏం దొరికింది? కొండా లక్ష్మణ్ బాపూజీకి ఏం దొరికింది? ఇవన్నీ మేం అడుగుతున్నామా అధ్యక్షా? అవన్నీ అవసరం లేదు కదా అధ్యక్షా. దయచేసి మన్మోహన్ సింగ్ గారి చరిత్రకు పరిమితమై చర్చ కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్:– గౌరవ హరీష్ రావు గారు...

శ్రీ టి. హరీష్‌రావు:– అధ్యక్షా, నేను ఏం మాట్లాడాను? మన్మోహన్ సింగ్ గారి కోసం ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానానికి సంపూర్ణ మద్దతు తెలిపాను. విగ్రహాన్ని పెడుతున్నారు సంతోషం. యూనివర్సిటీకి కూడా పేరు పెట్టండని సూచన ఇచ్చాము. అంతే కాదు, మన్మోహన్ సింగ్ గారికి భారతరత్న ఇచ్చి తీరాల్సిందే, దానికోసం మీరు పెట్టిన తీర్మానానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నానని చెప్పాను. అదే క్రమంలో మన్మోహన్ సింగ్ గారికి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మధ్య ఉన్నటువంటి అనుబంధాన్ని గుర్తు చేసుకునే ప్రయత్నం చేస్తున్నాను.

నిజానికి, డా. మన్మోహన్ సింగ్ గారితోపాటు ఒక అధికారిక సభలో కూడా పాల్గొనే అదృష్టం కూడా నాకు

దొరికింది. ఆరోజు రాష్ట్రంలో డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి కేబినెట్‌లో నేను మంత్రిగా ఉన్నాను. అప్పటి సభలో గీతారెడ్డి గారు, దామోదర రాజనర్సింహా గారు మేమందరం కూడా మెదక్‌లో ఎస్సీ/ఎస్టీలకు పట్టాలు పంచే కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ గారితోపాటు ఆరోజు ఒక మంత్రిగా నేను వేదిక మీద పాలు పంచుకునే అదృష్టం కూడా నాకు దొరికింది. అట్లా, డెఫినెట్‌గా వారితో ఉన్నటువంటి జ్ఞాపకాలు. వారితో ఉన్నటువంటి అనుబంధం. వారితో ఈ రాష్ట్రానికి, మా పార్టీకి ఉన్నటువంటి అనుబంధాన్ని చెప్పడం ఎట్ల తప్పు అయితది అధ్యక్షా. మంచి, మంచినే గుర్తు చేసుకునే ప్రయత్నం చేసుకుంటున్నాము. వారికి ఆత్మశాంతి చేకూరాలి. వారికి ఇంకా మంచి గౌరవం దక్కాలి. చరిత్ర ఉన్నంత కాలం వారి పేరు నిలబడాలనేదే మా ఆకాంక్ష. ఆ రకంగా కేసీఆర్ గారు పోర్ట్‌ఫోలియో వదులుకోవడం జరిగింది. అయితే, ప్రణబ్‌ముఖర్జీ గారు తన ఆత్మ కథ కూడా వ్రాశారు. "The Coalition Years" పది సంవత్సరాల యుపిఏ పాలన మీద ప్రణబ్ ముఖర్జీ గారు ఒక బుక్ వ్రాశారు. తన బుక్‌లో కూడా ప్రస్తావించారు. మన్మోహన్ సింగ్ గారి కేబినెట్‌లో కేసీఆర్ గారు ఆరు నెలలపాటు శాఖ లేని మంత్రిగా ఉండడమనేడిది ఆ పుస్తకంలో ప్రణబ్‌ముఖర్జీ గారు గుర్తు చేశారు.

ఏది ఏమైనా, ఆనాటి యుపిఏ ప్రభుత్వం తెలంగాణ అంశాన్ని కామన్ మినిమం ప్రోగ్రాంలో పెట్టి నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యమైతే ప్రధానమంత్రిగా ఉన్నటువంటి మన్మోహన్‌సింగ్‌గారి దగ్గరకు కేసీఆర్ గారు వెళ్లి, ఇట్లా అయితే నేను కేబినెట్‌లో కొనసాగలేనని పట్టుబట్టారు. దయచేసి మీరు ఆలోచించండని బాగా ఒత్తిడి పెడితే ఆరోజు ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ గారు ప్రణబ్ ముఖర్జీ కమిటీని వేశారు. ప్రణబ్ ముఖర్జీ కమిటీని వేసి దేశంలో ఉన్నటువంటి అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించడానికి మీరు ప్రయత్నం చేయండని చెప్పి ప్రణబ్ ముఖర్జీ గారి మీద ఆ బాధ్యత పెట్టారు. అప్పుడు కేసీఆర్ గారు పోర్ట్‌ఫోలియో లేని మంత్రిగా ఉన్నారు. కాబట్టి, దేశంలోని ఒక్కొక్క పార్టీ వద్దకు వెళ్లి, దేశంలోని 23 రాజకీయ పార్టీలను ఒప్పించి, ఆ 23 రాజకీయ పార్టీల లేఖల్ని డా. మన్మోహన్ సింగ్‌గారి చేతిలో కేసీఆర్ గారు పెట్టారు.

12.50 మ. ప్రణబ్ ముఖర్జీ గారి కమిటీకి కూడా ఆ లేఖలు అందజేసినటువంటి విషయాన్ని కూడా నేను గుర్తుచేస్తున్నాను. ఒక సందర్భంలో రెండు సంవత్సరాలు దాటింది, ఇంకా నిర్ణయం ముందుకుపోవడం లేదని కేసీఆర్ గారు ప్రధానమంత్రి గారి దగ్గర టైమ్ తీసుకొని, అప్పటి మన టిఎన్‌జీవో నాయకులు స్వామిగౌడ్ గారు, దేవీ ప్రసాద్ గారు, విఠల్ గారు, జయశంకర్‌గారు, ఇలా అందరితో కూడా మన్మోహన్ సింగ్ గారి దగ్గరికి వెళ్ళి తెలంగాణ రాష్ట్రఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయండి, అని చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి అధ్యక్షా. అలా మన్మోహన్‌సింగ్ గారి కేబినెట్‌లో దాదాపు రెండు సంవత్సరాల నాలుగు నెలలు పనిచేసిన తరువాత, కేసీఆర్ గారు, తెలంగాణ రాష్ట్రప్రక్రియ ఆలస్యమవుతుంటే, రాజీనామా చేసి పదవిని వదులుకొని బయటకు వచ్చిన విషయం కూడా గుర్తు చేస్తున్నాను అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్:- హరీష్ రావు గారూ, సభకు సహకరించండి. నేను స్వయానా కేసీఆర్ గారికి ఫోన్ చేసి, సభకు రమ్మని నేను రిక్వెస్ట్ చేశాను.

శ్రీ టి. హరీష్ రావు:- సార్, ఆ అంశంలోకి పోతే మేము కూడా మాట్లాడాలి. ఈ సభ ఏమి గౌరవమిచ్చింది సార్? కేసీఆర్ గారు వచ్చి మాట్లాడతారండీ,

మిస్టర్ స్పీకర్:- మీరు మాట్లాడండి... మీరు మాట్లాడండీ.

శ్రీ టి. హరీష్ రావు:- సభ సభలాగా నడుస్తలేదు. పీఏసీ ఛైర్మన్ విషయంలో మీ ఇష్టమున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. కేసీఆర్ గారిని అడిగి, ఆయనకు గౌరవమిచ్చి మీరు పీఏసీ ఛైర్మన్ విషయంలో నిర్ణయం తీసుకున్నారా? లేదా, శాసనసభ్యుల అనర్హత విషయంలో మీరు నిర్ణయం తీసుకున్నారా? అట్లమాట్లాడితే, We can deviate. But I don't want to deviate.

మిస్టర్ స్పీకర్:- మీరు డీవియేట్ కాకండి. ప్లీజ్..

శ్రీ డి. శ్రీధర్ బాబు:- సర్, నేను హరీష్ రావు గారిని కోరుతున్నాను. ప్రధానంగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గారికి నివాళులు పలుకుతున్నాం. He is a senior Legislator.. నివాళులు పలుకుతున్నాం, సంతాపం తెలియజేయడం ప్రధానమైన బాధ్యత. ఈ సందర్భంలో అవసరం లేని చర్చకు దారితీస్తే, we will never be paying proper respects to the departed soul. I request the Hon'ble Member who is also a senior Member, who knows how to run the House, please try to restrict to subject related to the former Prime Minister.

మిస్టర్ స్పీకర్:- హరీష్ రావు గారూ, కంక్లూడ్ చేయండి.

SRI T. HARISH RAO:- With due respect and high regard to Dr. Manmohan Singh and you Sir, ఈరోజు బీఆర్ఎస్ పార్టీ తరఫున మన్మోహన్ సింగ్ గారికి ఘనమైనటువంటి నివాళులర్పిస్తూ, వారికి విగ్రహం ఏర్పాటే కాదు, తప్పకుండా మన రాష్ట్రంలోని స్కిల్స్ యూనివర్సిటీకి వారి పేరు పెట్టాలని, భారతరత్న కూడా వారికివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ, అదేవిధంగా పి.వి.నరసింహారావు గారి ఖ్యాతి కూడా మరింత పెంచేవిధంగా కే.టీ.ఆర్. గారు ప్రతిపాదించిన విధంగా, ఢిల్లీలో కూడా పి.వి.ఘాట్ ఏర్పాటు చేసేవిధంగా ఈ తీర్మానంలో దాన్ని కూడా జతపరిచి కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని కోరుతూ, డా.మన్మోహన్ సింగ్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులందరికీ బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రగాఢమైనటువంటి సానుభూతిని తెలియజేస్తూ, ఈ అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు.

మిస్టర్ స్పీకర్:- గౌరవ మంత్రివర్యులు, సీతక్క గారు.

శ్రీమతి డి.అనసూయ (గౌరవ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖమాత్యులు):- అధ్యక్షా, స్వర్గీయ డా.మన్మోహన్‌సింగ్ గారి మృతికి నివాళులర్పిస్తూ..., 'రాజు మరణించె నొకతార రాలిపాయె, కవియు మరణించె నొకతార గగనమెక్కె, రాజు జీవించె రాతి విగ్రహములయందు, సుకవి జీవించె ప్రజల నాలుకయందు...' ఇది మన ప్రముఖ తెలుగు కవి గుర్రం జాషువా గారు అన్నటువంటి మాటలు స్పష్టంగా, ఖచ్చితంగా మన డా.మన్మోహన్ సింగ్ గారికి సరిపోతాయి. వారు ఈరోజు మనమధ్య భౌతికంగా లేకపోయినా, వారు ప్రవేశపెట్టినటువంటి అనేకగొప్ప సంస్కరణలు, పథకాలు ప్రజల గుండెల్లో సజీవంగా, చిరకాలంగా నిలిచిపోతాయని తెలియజేస్తున్నాను.

డా. మన్మోహన్‌సింగ్ గారంటేనే సంక్షేమ స్ఫాపిన్కుడిగా ఆయన పేరు వదిలంగా ఉంటుంది. ఆయన బాల్యం చూస్తే..., 5 నెలల వయస్సులోనే తల్లిని కోల్పోయి, ఎన్నో కష్టాలు, ఇబ్బందులను ఎదుర్కొని, 5 దశాబ్దాలుగా అప్రతిహతంగా వివిధ దశల్లో, వివిధ రంగాలలో భారతదేశానికి సేవలందించి, భారతదేశం యొక్క ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన.

త్యాగాల సన్నిధి, సంక్షేమ సారధిగా ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాన్ని, ఆశయాలను సమున్నతంగా నిలపడంలో డా.మన్మోహన్‌సింగ్ గారి యొక్క పాత్ర అమోఘమైనది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గారు, లాల్ బహదూర్ శాస్త్రి గారు, ఇందిరాగాంధీ గారు, రాజీవ్‌గాంధీ గారు, పీవీ నరసింహారావు గార్ల యొక్క విప్లవాత్మకమైనటువంటి సంస్కరణల వారసత్వాన్ని పునికిపుచ్చుకొని, యు.పి.ఏ. ఛైర్‌పర్సన్ సోనియమ్మ సారధ్యంలో సంక్షేమ రాజ్యాన్ని స్థాపించినటువంటి సాహసి, మన, డా. మన్మోహన్‌సింగ్ గారు. చట్టాలు, సామాజిక న్యాయ విధానాలను అమలుపరిచారు. హక్కుల ఆధారిత అభివృద్ధి విధానాన్ని అవలంభించారు. దేశ చరిత్రలో మైలు రాళ్ళుగా నిలిచిపోయే పాలన, మార్పులను, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కూడా, మన, డా.మన్మోహన్‌సింగ్ గారిదే అధ్యక్షా. 20 ఏళ్ళ తెలంగాణ రాష్ట్ర ప్రజల యొక్క ఆకాంక్షను నెరవేర్చినటువంటి మహనీయుడు, ప్రధానమంత్రి హోదాలో అనేక ఇబ్బందులెదురైనా వాటన్నింటినీ అధిగమించి తెలంగాణ రాష్ట్రప్రజలకు సోనియమ్మ గారిచ్చినటువంటి మాటను నిలబెట్టి, మనందరికీ ఆత్మగౌరవాన్ని, హక్కులను, ప్రత్యేక రాష్ట్రాన్ని

అందించి నటువంటి మహనీయుడు, డా.మన్మోహన్‌సింగ్ గారికి తెలంగాణ ప్రజానిధి నివాళులు అర్పిస్తోంది.

కాంగ్రెస్ మూల సిద్ధాంతమైనటువంటి సంక్షేమానికి చట్టబద్ధత, సామాన్యులకు చట్టపరమైనటువంటి హక్కులను కల్పించినటువంటి ఆర్థిక రూపశిల్పి, డా.మన్మోహన్‌సింగ్‌గారు. సంక్షేమ పథకాలంటే, కేవలం ప్రభుత్వం యొక్క దయాదాక్షిణ్యాలు కాదు. అవి ప్రజల యొక్క హక్కు అని, ఆయన ఏ పథకం ప్రవేశపెట్టినా, దానికి చట్టబద్ధత కల్పించినటువంటి గొప్పదనం కూడా ఆయన ఆధ్వర్యంలో, ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే ఆ యొక్క చట్టబద్ధతని తీసుకొచ్చారు. ముఖ్యంగా వారు ప్రవేశపెట్టినటువంటి వివిధ పథకాలకు చట్టబద్ధత ఇవ్వడం మూలంగానే, ఈరోజు రాష్ట్రాలలో గానీ, కేంద్రంలో గానీ ప్రభుత్వాలు మారినా, ఆ సంక్షేమ పథకాలు సజీవంగా, అప్రతిహతంగా ఒక యజ్ఞంలా సాగుతున్నాయనంటే, వారు తీసుకొచ్చిన సంక్షేమ పథకాలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించిన మూలంగానే అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

పేదల సంక్షేమం ఒక యజ్ఞంలా ఉండాలనే, మరి వారు పేదలకోసం తీసుకొచ్చినటువంటి, అత్యంత ప్రభావితం చేసినటువంటిదే 'ఉపాధి హామీ చట్టం'. 2005లో తీసుకొచ్చినటువంటి ఈ 'ఉపాధి హామీ చట్టం' ఇవాళ కోట్ల మంది పేదలకు ఉపాధిని కల్పించినటువంటి చట్టం, అధ్యక్షా. ఈరోజు కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా, రాష్ట్రంలో ఎవ్వరొచ్చినాగానీ, ఇతర ప్రభుత్వాల 11 సంవత్సరాల కాలంలో కూడా ఆ చట్టం ఉన్నది అనంటే, ఆ చట్టం ఈరోజు వరకు ఉన్నది అనంటే, దానికి చట్టబద్ధత రావడం మూలంగానే అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ముఖ్యంగా పనిచేసే హక్కు, పని దినాలు పొందే హక్కు, దాని ద్వారా అర్ధాకలి, ఉపాధిలేనితనం, ఇవన్నీ ఉండకూడదని ఉపాధిహామీ చట్టాన్ని తీసుకురావడం జరిగింది. ముఖ్యంగా, ఈ యొక్క ఉపాధి హామీ చట్టం గురించి దేశవ్యాప్తంగా చర్చ జరిగింది కూడా కరోనా టైమ్‌లోనే. మనం ఇంత అభివృద్ధి, ఇంత సాఫ్ట్‌వేర్ అని గొప్పగా చెప్పుకున్నా, పట్టణాలలో లాక్‌డౌన్‌తో పల్లెల వైపు అనేకమంది వస్తే, అక్కడ ఉపాధిహామీ చట్టం పనులు, అక్కున చేర్చుకొని, వారిని ఆర్థికంగా, ఆకలి లేకుండా వారిని ఒక అమ్మలా కాపాడిన పని ఏదైనా ఉన్నదనంటే అది ఉపాధి హామీ పని. ఉపాధి హామీ చట్టం వచ్చిన నాటి నుండి 8 కోట్ల మంది మాత్రమే ఉపాధి హామీ చట్టంలో పని చేసేది. కానీ, కరోనా కాలంలో దాదాపుగా 11 కోట్ల మంది ఉపాధి హామీ కూలీలుగా మారి తమ యొక్క ఆకలిని తీర్చుకున్నటువంటి పని ఏదైనా ఉన్నదంటే, అది ఉపాధి హామీ చట్టం. ఇది చట్టంగా ఉండడం మూలంగానే ఇవాళ గ్రామాలలో, మన రాష్ట్రానికి గానీ, దేశ ప్రజలకు గానీ రావలసినటువంటి పనిదినాలు వస్తున్నాయి. హక్కులు,అభివృద్ధి, ఆకలి తీర్చుకోవడం... ఇవన్నీ కూడా జరుగుతున్నాయని నేను తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా కర్షకుడి కరు కదిలితేనే మనకి నాలుగు వేళ్ళు నోట్లోకి పోతాయనే విషయం మనందరికీ తెలుసు. దేశంలో మొట్టమొదటిసారి రైతన్నలకోసం 70 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసినటువంటి ఘనత ఆనాటి యు.పి.ఏ. గవర్నమెంట్, మన్మోహన్‌సింగ్ గారి ప్రభుత్వమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ముఖ్యంగా మనిషికి అన్నింటికంటే పెద్ద శత్రువు ఏదైనా ఉంది అనంటే, అది ఆకలి. ఈ ఆకలిని నివారించాలంటే ఏం చెయ్యాలి అని సోనియమ్మగారి నాయకత్వంలో పేదలకు 2013లో ఆహారభద్రత చట్టం తీసుకొచ్చి, పేదలు గౌరవంగా జీవించాలి, తిండిగింజలు వారికి దక్కాలి అని ఆహారభద్రత చట్టాన్ని కూడా సోనియమ్మ గారి నాయకత్వంలో తీసుకొస్తే, ఆ ఆహారభద్రత చట్టం ద్వారా 81 కోట్ల 31 లక్షల మందికి రేషన్ కార్డుల ద్వారా తిండిగింజలు అందజేయడం జరుగుతోంది.

అర్ధాకలి, అదేవిధంగా ఆకలి చావులు ఈ దేశంలో ఉండకూడదనే ఉద్దేశంతో ఆ యొక్క ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ ఆనాడు మన్మోహన్‌సింగ్ గారి అధ్యక్షతన వస్తే, ఈరోజు వరకు కూడా వారిచ్చినటువంటి రేషన్ కార్డులు..., మనం రాష్ట్రంలో పెంచుకున్నప్పటికీ, కేంద్రంలో పెరగలేదు అధ్యక్షా. అవే

ఉన్నాయి. రాష్ట్రాలు ఎక్కడికక్కడగా రేషన్ కార్డులు పెంచుకొని పేదలకు రేషన్ అందిస్తున్నటువంటి విషయాన్ని కూడా మీకు గుర్తుచేస్తున్నాను.

1.00 మ. ఈరోజు దళితులకు, గిరిజనులకు, ఆదివాసీలకు, బడుగు, బలహీన వర్గాలకు, మైనార్టీలకు, పేదింటి బిడ్డలకు చదువుకోవడం ఒక గగనమైనటువంటి పరిస్థితుల్లో 6 నుంచి 14 సంవత్సరాల వయసు కలిగినటువంటి ప్రతి ఒక్కరికీ నిర్బంధ విద్య పెట్టి, Right to Education చట్టాన్ని తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ కూడా చదువుకునే హక్కుందనే విధంగా ఈ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టి అందని ద్రాక్షలాగ ఉన్నటువంటి చదువును అందరికీ అక్షర వెలుగై నిలిచారు మన మన్మోహన్ సింగ్‌గారు. విద్యకు ఒక్కసారే 70 వేల కోట్ల రూపాయల బడ్జెటును ప్రవేశపెట్టి.. ఒక్కసారే 70 వేల కోట్ల రూపాయల బడ్జెటు విద్య కోసం ప్రవేశపెట్టి, దేశంలో 30 వేల స్కూళ్లను నిర్మించి, అదే విధంగా స్కూళ్ల రిపేర్‌గానీ, ఇతరత్రా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంగానీ ఇవన్నీ చేసిన ఘనత వారికే దక్కుతుంది.

గ్రామీణ పేదలకు, అడవి బిడ్డలకు, మారుమూల ప్రాంతాల బిడ్డలకు కూడా ఆరోగ్య సౌకర్యం అందుబాటులో ఉండాలని 2005లో National Rural Health Missionను ప్రారంభించినటువంటి ఘనత కూడా డాక్టర్ మన్మోహన్ సింగ్ గారిదే అధ్యక్షా. తద్వారా పేదలందరికీ కూడా ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినటువంటి మానవతామూర్తి ఆయన. కొంతమంది వారిని మౌన ముని అన్నారు. కానీ, ఆయన మౌన ముని కాదు, సంక్షేమాన్ని చట్టబద్ధం చేసినటువంటి మహర్షి, గొప్ప మానవతామూర్తి, చైతన్య దీప్తి అని కూడా ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

డా.మన్మోహన్ సింగ్‌గారి కాలంలో విప్లవాత్మక మైనటువంటి చట్టం.. ఒకనాడు ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుంది, ఎక్కడెక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నడుస్తున్నాయి, దానిలో మంచి, చెడు... వంటి సమాచారమనేది కేవలం ఎం.పి.లకో, ఎమ్మెల్యేలకో లేదా కొన్ని వర్గాలకో తెలిసేది. కానీ, ఈరోజు సమాచార హక్కు చట్టం ద్వారా సామాన్యులకు కూడా ప్రభుత్వంలో జరుగుతున్నటువంటి మంచి, చెడు ఇవన్నీ కూడా తెలుసుకునేటటువంటి హక్కును కల్పించింది సమాచార హక్కు చట్టం. పాలనలో పాలకుల యొక్క పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం కోసం ఈ చట్టాన్ని కూడా వారి హయాంలోనే తీసుకురావడం జరిగింది.

ముఖ్యంగా అభివృద్ధి పరిణామ క్రమంలో ఎవరూ నష్టపోవద్దనే లక్ష్యంతో 2013లో తీసుకొచ్చినటువంటి భూసేకరణ చట్టం కూడా చాలా గొప్ప, విప్లవాత్మకమైనటువంటి మార్పు. భూములు కోల్పోయేటటువంటి బిడ్డలు, భూమితో వారికుండేటటువంటి అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని రకాలుగా వారికి పునరావాసం కల్పించేటటువంటి గొప్ప విధివిధానాలతో తీసుకువచ్చిన చట్టమే 2013 – భూసేకరణ చట్టం అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదే విధంగా, దేశంలో అడవి బిడ్డలు ఏండ్ల కొద్దిగా అడవులల్లో నివసిస్తూ అడవులపై ఆధారపడి, జీవించినప్పటికీ అడవి మీద ఎలాంటి హక్కు లేకుంటే, దశాబ్ద కాలంగా వారికి అన్యాయం జరుగుతుందని సోనియమ్మ సారధ్యంలో, డాక్టర్ మన్మోహన్ సింగ్‌గారి నాయకత్వంలో అటవీ హక్కుల చట్టాన్ని 2006లో తీసుకువచ్చి దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆదివాసి గిరిజనులకు పోడుపై హక్కు కల్పించినటువంటి ఘనత కూడా మన మన్మోహన్ సింగ్‌గారి ప్రభుత్వానికి, వారి నాయకత్వానికే చెందుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

ఆధార్ చట్టం తెచ్చి, ప్రభుత్వ పథకాలలో, వాటి అమలులో ఎలాంటి లోపాలుండకూడదని ఇలా ఎన్నో విప్లవాత్మకమైనటువంటి మార్పులను తీసుకువచ్చినటువంటి మహనీయుడు, చట్టాలను తీసుకొచ్చినటువంటి మహనీయుడు, ప్రతి స్కీం ఒక చట్టంగా ఉండాలి అని చట్టబద్ధత కల్పించినటువంటి మహనీయుడు డాకర్ మన్మోహన్ సింగ్‌గారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు అధ్యక్షా.

తన దౌత్య శక్తితో అగ్ర రాజ్యాల సరసన దేశాన్ని నిల్పడంతోబాటు అన్ని రంగాల్లో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపిన దార్శనికుడు మన డాక్టర్ మన్మోహన్ సింగ్‌గారు.1991లో ఆర్థిక మంత్రిగా బడ్జెటును ప్రవేశపెడుతూ చేసిన వ్యాఖ్యానాలు తన ఆత్మ విశ్వాసానికి అచంచల దేశ భక్తికి నిదర్శనంగా నిలుస్తాయి అధ్యక్ష. "ప్రపంచమా.. ప్రపంచమా చెవులు రిక్కించి వినుఁ, ఆత్మన్యూన్యత నుండి, అభివృద్ధి మందగమనం నుండి భారత్ మేల్కొంది. మేము అధిగమిస్తాం, మేము విజయం సాధిస్తాం" అని నినదించారు. అన్నట్లుగానే ప్రపంచాన్ని అబ్బురపరిచేలా దేశ ప్రగతిని ముందుకు నడిపినటువంటి సాహసికుడు. ఆర్థిక మంత్రిగా దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టి ప్రపంచంతో పోటీ పడేలా భారతదేశాన్ని తీర్చిదిద్దినటువంటి ఆర్థిక రూపశిల్పి మన మన్మోహన్ సింగ్‌గారని చెప్పడం జరుగుతుంది.

దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో పది శాతం వృద్ధి రేటు సాధించడంలో మన్మోహన్ సింగ్‌గారు ముందు చూపుతో వ్యవహరించారు. ప్రధాని అంటే మంత్రుల్లో ప్రథముడు. అందుకనే సమిష్టి నిర్ణయాలు, సమిష్టి విధానాలతో ఆదర్శవంతమైనటువంటి ప్రధాన మంత్రిగా మనముందు వారి యొక్క జీవితముంది. ఈరోజు విద్వేష రాజకీయాలకు, విధ్వంస ప్రచారాల జోలికి వెళ్ళకుండా సర్వేజనా సుఖినోభవంతు అన్న సూత్రాన్ని ఆచరించారు. ఇంత చేసినా రాజకీయ దురుద్దేశ్యాలతో నాటి మీడియా, నాటి విపక్షాలు తనను అవమానాలకు గురి చేసినా ఎక్కడా లొంగలేదు. మీడియా ప్రతిపక్షాలు తనపై నిర్దయగా ప్రవర్తించినా చరిత్ర మాత్రం తన పట్ల దయచూపుతుందని మన్మోహన్ సింగ్‌గారు ప్రధానిగా చివరి ప్రెస్ మీట్‌లో చెప్పడం జరిగింది. History will be kind to me than the contemporary media అని అన్నారు.

ఆయన మరణంతో దేశం దుఃఖించడం చూస్తే, ఆయన గొప్పతనాన్ని పొగడడం చూస్తే, ఆయన పట్ల చరిత్రగానీ, దేశం గానీ దయతో కాదు, గౌరవంతో ఉందని ఈ సందర్భంగా చెప్పడం జరుగుతుంది. మన్మోహన్ సింగ్‌గారు పుస్తకాల్లో కాదు నేటికీ అమలవుతున్నటువంటి ఎన్నో సంక్షేమ పథకాలలో ఆయన జీవిస్తూనే ఉంటారు. లబ్ధిదారుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. Yes that is absolutely true Dr. Manmohan Singh Ji will be remembered not just in history books but in everyday lives of those who have benefitted from his welfare policies even today అనేది కూడా మనం గుర్తుంచుకోవాలి. కంచు మోగినట్లుగా కనకంబు మోగదు, మాటల మనిషికాదని, చేతల మనిషని తన పథకాల ద్వారా మన్మోహన్ సింగ్‌గారు నిరూపించారు.

ఒక సందర్భంలో అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామాగారు చెప్పినట్లుగా మన్మోహన్ సింగ్‌గారు మాట్లాడితే ప్రపంచమే వింటుందని కూడా చెప్పడం జరిగింది. Manmohan Singh Ji speaks, the world listens అని కూడా ఒబామాగారు చెప్పిన సందర్భాన్ని కూడా మనం గుర్తుపెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా ఉన్నాడు కాబట్టి నేటి అధికార పార్టీ సెంట్రల్‌లో ఆయన మీద ఇ.డి.లు, సి.బి.ఐ.లు రకరకాలుగా ప్రయోగించినా చివరికి ఏమీ తేలలేదు, కేసులను క్లోజ్ చేసుకున్న సందర్భాలు కూడా మనం గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది. కాబట్టి మన్మోహన్ సింగ్‌గారు మౌన ముని కాదు, ఆయనను అవమానించినా, మాటలతో, కేసులతో వేధించినా, లోక కళ్యాణం కోసం పరమ శివుడు విషాన్ని తన కంఠంలో దాచుకున్నట్లుగానే దేశం కోసం ఎన్నో అవమానాలను దిగమింగినటువంటి, ప్రజలకు సంక్షేమం పంచిన సంక్షేమ శ్రామికుడు మన మన్మోహన్ సింగ్‌గారు అధ్యక్షా.

మృదుస్వభావి, ఉన్నత విద్యావంతుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త, క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని గట్టెక్కించి, ఆర్థిక పథంలో పరుగులు పెట్టేలా చేసిన ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన మన్మోహన్ సింగ్‌గారు తెలంగాణ బిడ్డ పి.వి.నరసింహా రావుగారి మార్గనిర్దేశంలో సేవకు అంకితమయ్యాడు. దూరదృష్టిగల నాయకుడు, దార్శనికుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త,

రాజనీతిజ్ఞుడు, భారతదేశ పురోగతి ప్రపంచ స్థాయికి తీసుకెళ్ళినటువంటి ఆర్థిక సంస్కరణల ఆద్యుడు, పూర్వ ప్రధాని మన్మోహన్ సింగ్‌గారి యొక్క మరణం మనందరికీ కూడా తీరని లోటని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

1.10 మ. వారు అందించినటువంటి సంక్షేమ రాజ్యం, సంక్షేమ పథకాలు, అప్రతిహతంగా ఎలాంటి కోతలు లేకుండా, ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనసాగినప్పుడే పేదరిక నిర్మూలన జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తూ, ఈ సంతాప సభ సందర్భంగా ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. చరిత్రను సృష్టించి చరిత్రలో నిలిచిపోయినటువంటి మన్మోహన్ సింగ్ గారి పేరు భవిష్యత్ తరాలకు గుర్తుండేలా, అనేక గొప్ప గొప్ప కార్యక్రమాలను మనం చేపట్టుటకు, వారికి భారతరత్నతో పాటూ, తెలంగాణలో పుట్టకపోయినా తెలంగాణ ఇచ్చినటువంటి ప్రధాన మంత్రిగా, తెలంగాణ ఇవ్వడంలో పూర్తి బాధ్యత తీసుకుని అనేక ఆటంకాలను అధిగమించి తెలంగాణ ఇచ్చినవారిని గౌరవించి వారి యొక్క విగ్రహాన్ని తప్పకుండా హైద్రాబాదు నగరంలో ప్రతిష్టించవేయాలని కోరుకుంటూ ధన్యవాదాలు తెలుపుతున్నాను అధ్యక్షా.

శ్రీ కాటిపల్లి వెంకటరమణా రెడ్డి (కామారెడ్డి):- అధ్యక్షా, ఈరోజు డా మన్మోహన్ సింగ్ గారి సంతాప కార్యక్రమంలో ముఖ్యమంత్రిగారు చెప్పినటువంటి పురస్కారాలు, చేసిన తీర్మానాలు అన్నిటికీ మద్దతు పలుకుతున్నాను. భారతదేశ చరిత్రలో తనకంటూ ప్రత్యేక పేజీ రాయదగ్గ అధ్యాపక, ఆర్థిక, రాజకీయ నాయకుడు కీర్తిశేషులు డా. మన్మోహన్ సింగ్ గారు.

భారతదేశంలో ప్రపంచీకరణ, సరళీకరణ, ఆర్థిక సంస్కరణలు అనే పదాలు విన్నప్పుడు తక్కున గుర్తు వచ్చేది డా. మన్మోహన్ సింగ్ గారి పేరు. భారతదేశ ఆర్థిక గతినే మార్చిన 1991 సంవత్సరపు ఆర్థిక సంస్కరణలు.. కేంద్ర ఆర్థిక మంత్రిగా దేశానికి దశ, దిశను నిర్దేశించి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన నాయకుడు స్వర్గీయ మన్మోహన్ సింగ్ గారు. దేశ గతినే మార్చిన 1991 ఇండియా బడ్జెట్ ఈయన చలువే. అప్పుడే భారతదేశ రాత మారింది. ఇటువంటి వ్యక్తికి శ్రద్ధాంజలి ఘటించడానికి ప్రత్యేక అసెంబ్లీని సమావేశపరచడం మంచి సాంప్రదాయమని నేను గుర్తుచేస్తున్నాను. వారి గురించి స్మరించుకునే అవకాశం కల్పించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను అధ్యక్షా.

ఈనాటి యువత రాజకీయ నాయకులు మనం కూడా వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఉన్నది. వారి జీవిత విశేషాలను ఒకసారి చూస్తే 1932 సంవత్సరం సెప్టెంబరు 26వ తేదీన ఇప్పటి పాకిస్తాన్‌లో ఉన్న పంజాబ్‌లోని ఘా అనే గ్రామంలో జన్మించారు ఆయన. తల్లిదండ్రులు గురుముఖ్‌సింగ్ కొహ్లి, అమృత్ కౌర్. చిన్న వయసులోనే తల్లి చనిపోతే అమ్మమ్మ దగ్గర పెరిగిన ఈయన ఊర్లో స్కూలు లేకపోతే ఐదు కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ చదువుకున్నటువంటి వ్యక్తి. దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం పాకిస్తాన్ నుంచి ఉత్తరాఖాండ్ రాష్ట్రంలోని హల్వానీ నగరానికి వచ్చింది. 1948వ సంవత్సరంలో అమృత్‌సర్ అంటే ఇప్పుడు ఇండియాలో ఉన్న పంజాబ్ నగరంలో స్థిర పడ్డారు.

మన్మోహన్ సింగ్ గారు అమృత్‌సర్‌లోని హిందూ కాలేజీలో చేరారు. 1952వ సంవత్సరంలో పంజాబ్ యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో డిగ్రీని, 1954వ సంవత్సరంలో పి.జిని పూర్తి చేయడం జరిగింది. ఇంగ్లాండులోని కేంబ్రిడ్జి యూనివర్శిటీ నుంచి 1957వ సంవత్సరంలో ఆర్థిక శాస్త్రంలో ఆనర్స్ పూర్తి చేయడం జరిగింది. స్కూలు నుంచి యూనివర్సిటీ వరకు చదువులో టాపర్‌గా ఉంటూ స్కాలర్‌షిప్‌లతో మాత్రమే చదువుకున్నటువంటి మహోన్నతమైన వ్యక్తి డా.మన్మోహన్ సింగ్‌గారు.

కేంబ్రిడ్జిలో ఆనర్స్ పూర్తయిన తరువాత ఇండియాకు వచ్చి పంజాబ్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పాఠాలు చెప్పడం

జరిగింది. 1960 సంవత్సరంలో ఇంగ్లాండు వెళ్ళి ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో డి.ఫిల్ చేసి, తరువాత ఇండియాకు తిరిగి వచ్చి అదే పంజాబు యూనివర్శిటీలో రీడర్‌గా కూడా పనిచేశారు డా. మన్మోహన్ సింగ్ గారు. 1963 సంవత్సరం నుంచి 1965 సంవత్సరం వరకు అదే యూనివర్శిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసరుగా పనిచేశారు. 1966 సంవత్సరం నుంచి 1969 సంవత్సరం దాకా యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ కోసం పనిచేశారు. 1969 సంవత్సరం నుంచి 1971 సంవత్సరం వరకు ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ప్రొఫెసరుగా పనిచేశారు. 1971వ సంవత్సరంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియాలో ఎకనామిక్ అడ్వైజరుగా పనిచేశారు. 1972వ సంవత్సరంలో ఛీఫ్ ఎకనామిక్ అడ్వైజరుగా అయ్యారు. 1976వ సంవత్సరంలో ఆర్థిక శాఖ కార్యదర్శిగా నియమితులైనారు డా. మన్మోహన్ సింగ్ గారు.

1980–82 సంవత్సరం మధ్య ప్రణాళికా సంఘం సభ్యునిగా పనిచేశారు. 1982వ సంవత్సరం నుంచి 1985వ సంవత్సరం వరకు రిజర్వు బ్యాంకు ఇండియా గవర్నరుగా పనిచేశారు. 1985వ సంవత్సరం నుంచి 1987వ సంవత్సరం వరకు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా కూడా పని చేశారు డా. మన్మోహన్ సింగ్ గారు.

1987వ సంవత్సరం నుండి 1990వ సంవత్సరం వరకు జెనీవాలోని ఎకనామిక్స్ పాలసీ థింక్ ట్యాంక్ సౌత్ కమిషన్‌కు సెక్రటరీ జనరల్‌గా కూడా పనిచేసినటువంటి వ్యక్తి డా. మన్మోహన్ సింగ్ గారు. 1990వ సంవత్సరం నవంబరు నెలలో అప్పటి ప్రధాని చంద్రశేఖర్ గారికి ఆర్థిక వ్యవహారాల సలహాదారుగా కూడా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వం 1991వ సంవత్సరంలో మన్మోహన్ సింగ్ గారిని యు.జి.సి ఛైర్మన్‌గా నియమించింది. అప్పుడే ఎన్నికలు అయ్యాయి. 1991 సంవత్సరం జూన్ 21వ తేదీన అందరూ ఆశ్చర్యపోయేలా పి.వి.నరసింహారావు గారు ప్రభుత్వంలో ప్రధాన మంత్రిగా అయిన తరువాత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినటువంటి డా. మన్మోహన్ సింగ్ గారికి ఆర్థిక శాఖను అప్పగించడం జరిగింది.

మన తెలంగాణ బిడ్డ పి.వి. నరసింహారావుగారు ఆనాడు తీసుకున్న గొప్ప నిర్ణయం మన్మోహన్ గారిని మంత్రివర్గంలోకి తీసుకోవడం. ఇద్దరూ మౌనంగా తమ పని తాము చేసుకునిపోయేవారు. ఎవరేమన్నా మౌనమే సమాధానం అని ముందుకు వెళ్ళిన ఇద్దరు వ్యక్తుల వల్ల ఈరోజు భారతదేశం ఈ స్థాయిలో ఉందని చెప్పకతప్పదు.

1991వ సంవత్సరం ఆర్థికంగా ఇండియా చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో మన విదేశీ మారక నిలువలు దాదాపు వంద కోట్ల డాలర్లు మాత్రమే ఉండటం జరిగింది. ఇది కేవలం రెండు వారాల మన దిగుమతులకు సరిపోయేలా ఉన్నటువంటి నిలువలు. ఈరోజు అంటే డిశంబరు 30 నాటికి మన నిలువలు 644.39 బిలియన్ డాలర్లు. అంటే సుమారు 65 వేల కోట్ల డాలర్లు ఈనాటి విదేశీ మారక నిలువలు. అంటే అప్పుడు ఎలాంటి విపత్కర పరిస్థితులు ఉన్నాయో మనం ఒక్కసారి అర్థం చేసుకోవచ్చు. డా. మన్మోహన్ సింగ్ గారు 1991వ సంవత్సరంలో తీసుకున్న నిర్ణయాల ఫలితమే ఈనాటి మన విదేశీ మారక ద్రవ్య నిలువల స్థితి. దేశ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చిన దార్శినికుడు ఆయన.

లెఫ్టిస్టులు పట్టుబట్టి పదాలుగా వాడి ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణలను ఆయుధాలుగా చేసుకున్నా, ఈరోజు ఉన్న వర్మిట్‌రాజ్ అనే పద్ధతిని పక్కన పెట్టి ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టారు. ఆనాడు ఆ ఇద్దరూ కలిసి తీసుకున్న పి.వి. నరసింహారావు గారు డా. మన్మోహన్ సింగ్ గారు కలిసి తీసుకున్న నిర్ణయమే నేడు ప్రపంచ దేశాలకు చెందిన పెట్టుబడిదారులకు డెస్టినేషన్ ఆఫ్ ఇండియాగా కనపడుతున్నది.

డా. మన్మోహన్ సింగ్ గారు అనూహ్య పరిస్థితుల్లో 2004వ సంవత్సరం మే 22వ తేదీన భారత ప్రధానిగా బాధ్యతలు తీసుకుని పది సంవత్సరాల నాలుగు రోజులు, రెండు సార్లు ప్రధానిగా 2014వ సంవత్సరం మే 26 వరకు దేశానికి సేవలు అందించినటువంటి వ్యక్తి డా. మన్మోహన్ సింగ్ గారు. 2004వ సంవత్సరం నుండి 2014వ సంవత్సరం

మధ్య కాలంలో దేశంలో ఉన్న రైతులకు రుణమాఫీ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తెచ్చి నిరుపేదలకు ఉపాధి కల్పించారు. పాలనలో పారదర్శకత కోసం రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ తీసుకొచ్చారు. సమాచార హక్కు చట్టంతోపాటూ రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్‌ని కూడా తీసుకొచ్చినటువంటి వ్యక్తి డా. మన్మోహన్ సింగ్ గారు.

ఆయన నిఖార్సయిన రాజనీతిజ్ఞుడు. ఎందుకంటే ప్రభుత్వానికి మద్ధతును ఉపసంహరించుకుంటామని లెఫ్టిస్టులు హెచ్చరించినా కంట్రీ ఫస్ట్– పార్టీ నెక్స్ట్ అని భావించి భారత అమెరికా పౌర అణు ఒప్పందాన్ని కుదుర్చుకుని అసలైన రాజనీతిజ్ఞుడుగా నిరూపించుకున్నారు మన్మోహన్ సింగ్‌గారు. ఐఐటి హైద్రాబాదు ఈయన పుణ్యమే. 2008వ సంవత్సరంలో అది ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగింది.

1.20 మ. అధ్యక్షా, డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి పర్సనల్ లైఫ్‌ని మనం పరిశీలిస్తే అది మనకు ఆదర్శంగా ఉంటుంది. రాబోయే రాజకీయ నాయకులుగాని, యువతగాని, రాజకీయంలోకి రావాలనుకున్న వ్యక్తులుగాని మన్మోహన్ సింగ్ గారి పర్సనల్ లైఫ్‌ని గమనిస్తే, పదేళ్లు ప్రధానిగా, అంతకుముందు ఆర్థిక శాఖ మంత్రిగా, ఉన్నత అధికారిగా, యూనివర్శిటీ ప్రొఫెసర్‌గా పనిచేసినా, అతి సాధారణ జీవితం గడిపిన వ్యక్తి మన్మోహన్ సింగ్ గారు. ఫార్చూనర్‌ల జీవితానికి దూరంగా, మారుతి 800 తో తృప్తి పడిన వ్యక్తి డా. మన్మోహన్ సింగ్ గారు. నిజాయితీకి మారుపేరుగా, తన ఇంటి అద్దెను కూడా నెలనెలా అస్సాంకి పంపినటువంటి గొప్ప మనిషివారు.

బుక్స్ చదివే అలవాటు బాగా ఉండేది. ఈయన స్వతహాగా రచయిత. 1964లో తన మొదటి రచన ప్రారంభించి, 2003 2004, 2006 మరియు చివరగా 2019లో Changing India అనే పుస్తకాన్ని రచించారు. ఈయన రిజర్వ్ బ్యాంకు గవర్నర్‌గా చేసిన సమయంలో ఆఫీసు దగ్గరున్న బుక్‌స్టాల్‌కి నడిచి వెళ్లి, ఆ స్టాల్‌లో పనిచేసే వర్కర్స్‌తో కూడా చాలా ఆప్యాయంగా మాట్లాడినటువంటి వ్యక్తి డా.మన్మోహన్‌సింగ్‌గారు. ఆయన గొప్ప రాజకీయ నాయకుడే కాదు, ప్రజల నాయకుడు. ఈ దేశానికి దొరికిన ఆణిముత్యం. 1991 నుండి 2024 వరకు 33 సంవత్సరాలు రాజ్యసభ సభ్యుడిగా ఆయన రాజకీయ ప్రస్థానం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగిసింది. నెహ్రూగారు 15.8.1948 నుండి 27.5.1964 వరకు 16 సంవత్సరాల 286 రోజులు పనిచేస్తే, ఇందిరా గాంధీగారు 1966 నుండి 1977 దాకా, 1980 నుండి 1984 వరకు 15 సంవత్సరాల 350 రోజులు పని చేస్తే, మోదీగారు 26.5.2014 నుండి 29.12.2024 వరకు,అంటే పది సంవత్సరాల 200 రో జులు పని చేశారు. తరువాత ఎక్కువ కాలం పని చేసింది, పది సంవత్సరాల నాలుగు రోజులు ప్రధానిగా పని చేసింది మన్మోహన్ సింగ్ గారు, చిరస్మరణీయులు. వారి శ్రీమతి గురుచరణ్ కౌర్‌గారికి మరియు పిల్లలు ఉపేందర్ సింగ్, దమన్ సింగ్,అమృత్ సింగ్ గార్లకు నా ప్రగాఢ సానుభూతి తెలియపరుస్తూ, మన్మోహన్ సింగ్ గారి ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తూ, వారిని స్మరించుకునే అవకాశం కల్పించిన మీకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ముగిస్తున్నాను.

శ్రీమతి పి. సబితా ఇంద్రా రెడ్డి (మహేశ్వరం):– ధన్యవాదాలు అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన డా. మన్మోహన్ సింగ్ గారి సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. భరత మాత బిడ్డల్లో మన్మోహన్ సింగ్‌గారు కూడా చాలాగొప్ప వ్యక్తి. దేశం వారిని కోల్పోవడం అత్యంత బాధాకరం. ఆర్థిక విధానంలో తనకంటూ ఒక గట్టి ముద్ర వేశారు. విమర్శకుల నుండి ప్రశంసలు కూడా వారు అందుకున్నారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉండి, ప్రజా సేవలో కొనసాగిన మన్మోహన్ సింగ్ గారు అణగారిన ప్రజల సంక్షేమం కొరకు పనిచేశారు. చట్టాలు, పథకాలు చాలా తీసుకొచ్చినా, ప్రతి దాంట్లో కూడా ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి అనేది వారు ప్రధానంగా ఉండాలని భావించేవారు. సమాచార హక్కు చట్టం కానివ్వండి, ఉపాధి హామీ చట్టం కానివ్వండి, విద్యా హక్కు చట్టం కానివ్వండి. అధ్యక్షా, 2004వ సంవత్సరం జూలై 1వ తేదీన మహబూబ్ నగర్ జిల్లాలోని ధర్మాపూర్ గ్రామానికి గౌరవ ప్రధాన మంత్రిగా మన్మోహన్

సింగ్ గారు వచ్చారు. 2000వ సంవత్సరం నుండి 2004 వరకు ఈ రాష్ట్రంలో చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భంలో ఆనాటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డిగారు ఆ కుటుంబాల వారందరికీ కూడా ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని నిర్ణయించి, ఆనాటి ప్రధాన మంత్రిగారిని అక్కడికి ఆహ్వానించడం జరిగింది. ఆ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నేను వెళ్లిన సందర్భంలో ఆ వేదిక మీద ఆనాటి గౌరవ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు గాని, ఆ నాటి కేంద్రమంత్రి కేసీఆర్‌గారు కూడా ఆ మీటింగ్‌లో ఉండడం జరిగింది. ఆ కుటుంబాలను ఒకరొకరిని మాట్లాడిస్తున్న సందర్భంలో వాళ్ల దగ్గరకు వెళ్లి, వాళ్ల బాగోగులను కనుక్కుంటున్న సందర్భంలో వారి కళ్లు చెమర్చాయి అధ్యక్షా. నిజంగా ఆరోజు అనుకున్నా.. గొప్ప మానవతావాది, ఇంత పెద్ద ఎత్తుకి ఎదిగినా కూడా వారు ఆ మానవత్వం చూపించడమనేది గొప్ప విషయంగా ఆరోజు నాకు అనిపించింది.

రెండవసారి అధ్యక్షా ఉపాధి హామీ పథకాన్ని మొదలుపెట్టడానికి చేవెళ్లనియోజకవర్గం, ఆలూరులో 2004 నవంబర్ 14 న వారు అక్కడికి రావడం జరిగింది. ఆసందర్భంలో వారు ఆ గ్రామస్తులతో మాట్లాడి, ఆ పథకాన్ని ప్రారంభించినప్పుడు ఆయనలో ఒక తృప్తి అనేది కనబడింది మాకు. ఆరోజు కూడా వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు, జైపాల్‌రెడ్డి గారు అక్కడ ఆ కార్యక్రమంలో మీరు కూడా ఉన్నారు అధ్యక్షా. అలాగే మూడవసారి హైదరాబాద్ నగరానికి రింగ్‌రోడ్ ఫౌండేషన్ స్టోన్ వేయడానికి రావడం జరిగింది. ఈ విధంగా తక్కువ సమయంలో మన్మోహన్ సింగ్ గారి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం నాకు దొరికింది. ఒక రకంగా అలాంటి మహనీయుడిని స్మరించుకుంటున్న సందర్భంలో ఈ అవకాశం రావడం చాలా సంతోషంగా భావిస్తున్నాను. మొదటిసారి వచ్చిన అవకాశంలో చాలా టెన్షన్ పడ్డాను. ఇన్‌చార్జి మంత్రిగా, ఎక్కడా ఇబ్బంది రాకుండా చూసుకోవలసి వచ్చినప్పుడు ఒక టెన్షన్, ఉద్వేగం. దేశ ప్రధాని వస్తున్నారు కదా అని టెన్షన్ పడ్డాను. కాని వారిని చూసిన తరువాత, చూడగానే చేతులెత్తి దండం పెట్టాలనిపించేంత ప్రశాంతంగా కనిపించినారు అధ్యక్షా. మళ్లీ రెండు,మూడు సార్లు కలిసినప్పుడు కూడా ఒక ఆత్మీయత ఆయనలో కనిపించింది. నిజంగా ఎప్పటికీ వారిని మరిచిపోను. ఎందుకంటే ఆయనతో పాల్గొన్న కార్యక్రమాలు నా జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకాలు.

అదే విధంగా గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రతిపాదించిన భారతరత్న ఇవ్వాలన్న ప్రతిపాదనను కూడా మేము బలపరుస్తున్నాము అధ్యక్షా. విగ్రహం పెట్టాలన్న వారి ఆలోచనను కూడా మేము బలపరుస్తున్నాము. అదే విధంగా హరీష్‌రావు గారు మాట్లాడినట్లు Skills Development University కి మన్మోహన్ సింగ్ గారి పేరును పెట్టాలని గౌరవ ముఖ్యమంత్రిగారిని ఈ వేదిక ద్వారా కోరుతున్నాను. మన్మోహన్ సింగ్ గారి గురించి మాట్లాడుకున్నప్పుడల్లా, పి.వి. నరసింహారావు గారు తప్పకుండా గుర్తుకు వస్తారు. తెలంగాణ బిడ్డ పి.వి. నరసింహారావు గారు చనిపోయినప్పుడు కూడా బాధపడ్డాము అధ్యక్షా. ఈరోజు మన్మోహన్‌సింగ్ గారికి దక్కిన గౌరవం ఆ రోజు పి.వి. నరసింహారావు గారికి దక్కలేదని కొంచెం బాధనిపిస్తుంది. కేటీఆర్‌గారు ప్రస్తావించినట్లు దేశ రాజధానిలో పి.వి. నరసింహారావు గారి మెమోరియల్ ఏర్పాటు చేయాలని ఈ సభ ద్వారా తీర్మానించాలని కోరుతున్నాను. మన్మోహన్ సింగ్ గారి మృతి పట్ల సంతాపాన్ని తెలియజెస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి (మునుగోడు):- ధన్యవాదాలు అధ్యక్షా. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, ఆమోదం తెలుపుతూ, దివంగత మన్మోహన్ సింగ్ గారి ఆత్మకు శాంతి కలగాలని, వారికి నివాళులర్పిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢమైన సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను.

చాలామంది సభ్యులు మాట్లాడినను. కాలాతీతమయింది కాబట్టి ఎక్కువ లోతుకి పోకుండా, నా కంటే ముందు మాట్లాడిన గౌరవ ముఖ్యమంత్రిగారు మరియు

మంత్రివర్యులు, ప్రతిపక్ష సభ్యులు డా. మన్మోహన్ సింగ్ గారు ప్రధానిగా పదేళ్ల పాటు, పారదర్శకంగా దేశాన్ని ఏ విధంగా పరిపాలించిన్రో, దేశ అభివృద్ధి కొరకు ఎంతటిగొప్ప నిర్ణయాలు తీసుకున్నారో,ప్రజా సంక్షేమం కోసం, దేశ సమగ్రత కోసం ఏ విధమైన నిర్ణయాలు తీసుకున్నారో, వాటి వల్ల ఈ దేశ ప్రజలు ఆర్థిక సంక్షోభం నుండి బయటపడిన విషయాల గురించి సభ్యులందరూ ప్రస్తావించారు కాబట్టి మళ్లీ నేను ఆ ప్రస్తావనకు పోకుండా కేవలం ఒక్క విషయం అయితే చెప్పగలుగుతా అధ్యక్షా.

జీవితంలో అందరికీ రాదేమో అటువంటి అవకాశం. మన్మోహన్ సింగ్ గారు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు 2009 నుండి 2014 వరకు నేను పార్లమెంటు సభ్యునిగా ఉండడం, నాతో పాటు నా పార్లమెంటు సహచర సభ్యులందరం కలిసి తెలంగాణ గొంతు వినిపించి, ఐదేళ్లపాటు కేంద్రంలో మా ప్రభుత్వమే ఉన్నా సరే, ప్రధాన మంత్రి ఎదుటనే, ఆయన ముందరనే స్వయంగా సోనియా గాంధీగారు, ప్రణబ్ ముఖర్జీగారి ముందరనే రోజూ వెల్ లోకి పోయి, తెలంగాణ గొంతును వినిపించే అవకాశం మాకు దొరకడం అనేది జీవితంలో అదృష్టంగా భావిస్తున్నాను అధ్యక్షా. ఒక విధంగా చెప్పాలంటే నన్ను పార్లమెంటు సభ్యునిగా ఎన్నుకున్న మా భువనగిరి నియోజకవర్గ ప్రజలకు, ఆరోజు ప్రధాన మంత్రిగా ఉండి, తెలంగాణ బిల్లు పాస్ చేయించి, తెలంగాణ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన మన్మోహన్ సింగ్ గారు ఈరోజు మన మధ్యన లేకపోయినా సరే, చరిత్రలో ఎప్పటికీ కూడా వారి పేరు నిలిచిపోతుంది. మేమందరం కూడా దాన్ని అదృష్టంగా భావిస్తున్నాము. మేము ఆరోజు యువకులుగా, తెలంగాణ ఉద్యమం నడుస్తుంటే, పార్లమెంటులో ముఖ్యమైన బిల్లుల గురించి చర్చ నడుస్తుంటే కూడా, ఎంతోమంది చనిపోతున్న నేపథ్యంలో ఉద్యమం తీవ్రంగా ఉంటే, మేము వెల్‌లోకి పోయినా కూడా ఒక్క రోజు కూడా వారించలేదు. ప్రధాన మంత్రిగారు గాని, సోనియా గాంధీగారు గాని, ప్రణబ్ ముఖర్జీగారు గాని మిగతా సభ్యులుగాని ఒక్క రోజు కూడా వారించలేదు. ఎందుకంటే ఉద్యమం ఆ విధంగా ఉండె. ఆనాటి పరిస్థితులు ఆ విధంగా ఉండె. తెలంగాణకు సంబంధించిన పార్లమెంటు సభ్యులు 12 మందిమి తెలంగాణలో జరుగుతున్న విషయాలను ఎప్పటికప్పుడు, వాళ్ల కళ్లకు కట్టినట్లు ఐదేళ్ల పాటు మేము మా గొంతు వినిపిస్తుంటే, ఏ నాడు కూడా ఒక్క మాట చెప్పలేదు అధ్యక్షా.

1.30 మ. ఎన్నో సందర్భాలలో తెలంగాణలో ఉన్న పరిస్థితులను ప్రధానమంత్రిగారికి ఎప్పటికప్పుడు తెలియ జేయడానికి మాకు అవకాశం దొరికేది. మా ఎంపీలు వారిని కలవడానికి అపాయింటుమెంటు తీసుకొని వెళ్లి మాట్లాడితే ఆయన వా బాధ వినేవారు అధ్యక్షా. నిజంగా మహానుభావుడు వారు మన మధ్యన లేకపోయినా....., మేము దాదాపు 20 నిమిషాలు మాట్లాడినా వారు తప్పకుండా మీకు న్యాయం జరుగుతుందని ఒక్కటే మాట మాట్లాడేవారు. మాట్లాడడానికి ఎక్కువ సమయం తీసుకోను అధ్యక్షా. ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే 2014వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత, పార్లమెంటు ఎన్నికల సమయంలో నాకు దిగ్విజయ్ సింగ్‌గారు ఫోన్ చేసి మన్మోహన్ సింగ్ గారి కార్యక్రమాన్ని తెలంగాణలో ఏర్పాటు చేద్దామనుకుంటున్నారని, ఎవ్వరూ రడీగా లేరని, నీకు అత్యంత సన్నిహితులు కాబట్టి, ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నాకు చెప్పారు. నేను దానిని గొప్ప అదృష్టంగా భావించి 2009 ఎన్నికల సందర్భంగా శ్రీమతి సోనియాగాంధీగారు వచ్చినప్పుడు ఎక్కడైతే సభను నిర్వహించడం జరిగిందో, అదే స్థలంలో సెంటిమెంటల్‌గా మళ్లీ మన్మోహన్ సింగ్ గారితో దాదాపు మూడు లక్షల మంది ప్రజలతో సభను నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రజలకిచ్చిన మాట కోసం ఎంత కష్టమైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని ఆ సభలో మన్మోహన్ సింగ్‌గారు చెప్పారు. నేను ఎన్నికలల్లో ఓడిపోయినప్పుడు కూడా, ఓడిపోయానని తెలిసి కూడా వారు తన మనుషులతో నన్ను పిలిపించి మాట్లాడడం జరిగింది. 2014లో బ్రహ్మాండంగా ఏర్పాటు చేసిన భువనగిరి సభలో, సభను చూసి వారు పది సంవత్సరాల కాలంలో నేను ముఖ్య అతిథిగా ఇంత పెద్ద సభను ఉద్దేశించి

ఎక్కడా మాట్లాడలేదని అన్నారు. తెలంగాణ వచ్చిన తరువాత భువనగిరి గడ్డ మీద మొట్టమొదటిసారిగా ప్రధానమంత్రి హోదాలో ఇక్కడికి రావడం అదృష్టంగా భావిస్తూ, ఎప్పటికీ జీవితాంతం మర్చిపోలేని క్షణాలని తెలియజేస్తున్నాను. వారు పట్టించుకోవడం లేదని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కానీ అది తప్పు అధ్యక్షా. మాట్లాడడానికి మా సభ్యులకు ఎప్పుడంటే అప్పుడు అపాయింట్‌మెంట్ ఇచ్చేవారు. రెండు నిమిషాలు చెప్పగానే నాకు నీ బాధ అర్థమైంది, మీ సమయం కోసం వేచీ ఉండమని, కేంద్రంలో ఉన్న పరిస్థితులన్ని మీకు తెలుసు కాబట్టి, మాకు సహకరించమని, సమయం వచ్చినప్పుడు మీకు తప్పకుండా న్యాయం చేస్తామని పదే పదే ఎన్నిసార్లు కలిసినా అదే చెప్పేవారు. ఆ మహానుభావుని నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం రావడం అనేది నిజంగా అదృష్టమని తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రజలు ఎప్పుడు కూడా వారు చేసిన సేవలను మర్చిపోకుండా ఉండేవిధంగా పార్కు లాంటి దానిని ఏర్పాటు చేసి దానిలో వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గౌరవ ముఖ్యమంత్రిగారికి నా అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాను. అదే విధంగా స్కిల్స్ యూనివర్సిటీకి కూడా మన్మోహన్ సింగ్ గారి పేరు పెట్టాలని సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిగారు సూచించారు. నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు అధ్యక్షా.

శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి (బాల్కొండ):- నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు అధ్యక్షా. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గారి మృతి పట్ల గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానానికి సంపూర్ణ మద్దతునిస్తూ, వారి పేరు మీద విగ్రహ ఏర్పాటు విషయంలో, హరీష్ రావు గారు సూచించిన విధంగా స్కిల్స్ యూనివర్సిటీకి వారు పేరు పెట్టడం వంటి విషయాలలో మా సంపూర్ణ మద్దతును వ్యక్తపరుస్తున్నాను. వారి మరణం మన దేశానికి తీరని లోటని నేను భావిస్తున్నాను.

వారు గొప్ప ఆర్థికవేత్త. ఈ దేశానికి అనేక స్థాయిల్లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా, యూజీసీ ఛైర్మన్‌గా, ఆర్‌బిఐ గవర్నర్‌గా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా, ఆర్థిక శాఖ మంత్రిగా, చివరికి 10 సంవత్సరాల పాటు ప్రధానమంత్రిగా ఈ దేశానికి ఎనలేని సేవలు అందించినటువంటి వ్యక్తి డా. మన్మోహన్ సింగ్ గారు. ఖచ్చితంగా వారు చేసిన సేవలను ఈ దేశ ప్రజలు ఎప్పటికీ గుర్తు ఉంచుకుంటారని మనవి చేస్తున్నాను. డా. మన్మోహన్ సింగ్ గారు తెలంగాణ పట్ల ఎప్పుడూ కూడా సానుకూలంగానే ఉన్నారు. తెలంగాణ ఉద్యమం పట్ల వారికి గౌరవభావం ఉన్నది. తెలంగాణ ఉద్యమాన్ని ఆయన చాలా జాగ్రత్తగా గమనిస్తూ, తెలంగాణ ఉద్యమాన్ని గౌరవించిన వ్యక్తి అని తెలంగాణ ఉద్యమ సందర్భంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి వర్యులు కేసీఆర్ గారు చెబుతూ ఉండేవారు.

మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన తరువాత 2004లో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు పొత్తుపెట్టుకొని రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. కేంద్రంలో కూడా భాగస్వామ్య పక్షాన్ని మంత్రివర్గంలోకి ఆహ్వానించే సందర్భంలో టిఆర్ఎస్ పార్టీ నుండి కేసీఆర్‌గారిని, ఆలె నరేంద్ర గారిని మంత్రివర్గంలోకి ఆహ్వానించడం జరిగింది. ఆ సందర్భంలో కేసీఆర్‌గారు మన్మోహన్ సింగ్ గారితో మాట్లాడుతూ, సార్ మీ మంత్రివర్గంలో పని చేయడం మాకొక గొప్ప భాగ్యం కానీ, తెలంగాణ మీద క్లారిటీ ఇస్తేనే మంత్రివర్గంలో చేరడానికి అర్థం ఉంటుందని అభ్యర్థించారు. ఆరోజు రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని పెట్టడంలో చాలా ముఖ్య పాత్ర పోషించిన వ్యక్తి డా. మన్మోహన్ సింగ్‌గారు.

అదే విధంగా కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో తెలంగాణ రాష్ట్ర అంశాన్ని చేర్చినందువల్ల రాష్ట్రస్థాయిలో ఉన్న అంశాన్ని మన్మోహన్ సింగ్‌గారు దేశస్థాయికి తీసుకెళ్లారని, ఇది తెలంగాణ ఉద్యమానికి దక్కిన గౌరవమని కేసీఆర్‌గారు ఆ రోజు మాకు చెప్పారు. దురదృష్టవశాత్తు ఆనాటి సీమాంధ్రా నాయకుల వ్యతిరేకత వల్ల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మరొక పది సంవత్సరాలు డిలే అయ్యింది. ఆ విషయంలోకి నేను వెళ్లను. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బిల్లు పాస్ అయ్యే సందర్భంలో ఇంతకు ముందు రాజగోపాల్ రెడ్డిగారు చెప్పినట్లు వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. లోక్‌సభలో తరువాత

రాజ్యసభలో పాస్ అయ్యే సందర్భంలో వెంకయ్యనాయుడు గారు ఈ బిల్లులో కొన్ని సవరణలు అడుగుతామని, సవరణలు చేసేదాకా బిల్లు పాస్ చేయనియమని పట్టుపట్టిన విషయం గురించి నాకు తెలియదు. అప్పుడు నేను ఢిల్లీలో కేసీఆర్‌గారితో ఉన్నాను. ఈ విషయాన్ని ఇంతకు ముందు ముఖ్యమంత్రిగారు కూడా చెప్పారు. విషయం తెలిసిన తరువాత కేసీఆర్‌గారు కొందరు ఎంపీలు, కొందరు నాయకులతో మన్మోహన్ సింగ్‌గారి దగ్గరికి వెళ్లాము. మీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్లనే తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టబడిందని కేసీఆర్‌గారు చెప్పడం జరిగింది. రాజ్యసభలో ఈ విధంగా చేస్తారనే వార్తలు వచ్చాయి కాబట్టి, మీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బిల్లు మూవ్ అయ్యేలా చూడమని రిక్వెస్ట్ చేస్తే ఒక రోజంతా వారు రాజ్యసభలో కూర్చొని వెంకయ్యనాయుడు గారితో, అరుణ్‌జైట్లీగారితో, మీకు ఏమన్నా కావాల్సినవి ఉంటే ప్రధానిగా హామీ ఇస్తానని, సవరణలను పెద్దగా ఏం సూచించవద్దని, బిల్లు మాత్రం పాస్ చేయమని అందరితో మాట్లాడి కన్విన్స్ చేసి ఆ రోజు బిల్లు పాస్ చేయడంలో ముఖ్య పాత్ర పోషించిన విషయం మనం గుర్తు చేసుకోక తప్పదు.

కేసీఆర్‌గారి డెలిగేషన్‌లో రెండుసార్లు ఆయనని కలిసే భాగ్యం నాకు కలిగింది. నేను కేసీఆర్‌గారి పక్కనే ఉండి రిప్రజెంటేషన్ పేపర్స్ ఇచ్చి వారి పక్కనే ఉన్నందున వారిని నేను దగ్గర నుండి చూసాను. 15 నివిషాలపాటు మన మాటలను చాలా ఓపికగా, చాలా శ్రద్ధగా వినేవారు. అంటే అంత నిరాడంబరంగా, అంత శ్రద్ధగా విని, ప్రతి సమస్యను అర్థం చేసుకొని ఇది అవుతుంది, మీరు బాధ పడకండి అని ఎప్పుడూ హామీ ఇచ్చేవారు. వారి నిరాడంబరత గురించి ముఖ్యమంత్రిగారు అన్నట్లు వారు అందరితో కలిసి కూర్చొని, ఆయన దర్బాలో పాల్గొన్న విషయం గురించి కూడా చెప్పారు. ఇక్కడున్న సభ్యులందరూ కూడా వారి నిరాడంబరత, వారి ఓర్పు, మాటల్లో సౌమ్యం వంటి విషయాలను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. వారి ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, సంతాప తీర్మానాన్ని నేను బలపరుస్తూ, సెలవు తీసుకుంటున్నాను అధ్యక్షా.

1.40 మ. | శ్రీ జి. వివేక్ వెంకటస్వామి (చెన్నూరు):- అధ్యక్షా, మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. డా. మన్మోహన్ సింగ్ గారు ఫైనాన్స్ మినిస్టర్‌గా, ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మా నాన్నగారు వెంకటస్వామి గారితో చాలా సన్నిహితంగా ఉండేవారు. వారు 1991లో కేబినెట్‌లో ఫైనాన్స్ మినిస్టర్‌గా ఉండి ఎకనామిక్ రిఫామ్స్ తీసుకురావడంతో భారతదేశం రూపురేఖలు మారాయి. ఆ సమయంలో చాలా రూపాయిని డీవ్యాల్యుయేషన్, లైసెన్స్ తీసివేయడం వంటి డీరెగ్యులేషన్స్ వల్ల చాలా మంది అప్‌సెట్ అయ్యారు. ప్రాంతీయ ప్రాంతాలలో కూడా inflation పెరిగి చాలామంది అసౌకర్యానికి గురైన సమయంలో రూరల్ డెవలప్‌మెంట్ మినిస్టర్‌గా ఉన్న వెంకటస్వామి గారు డా. మన్మోహన్ సింగ్ గారితో మీరు రూరల్ డెవలప్‌మెంట్ బడ్జెట్ రూ.5 వేల కోట్లు ఉన్నదానిని రూ.25 వేల కోట్లు చేయాలని కోరడంతో, ఇది చాలా మంచి ఐడియా అని వారి రిఫామ్స్ వలన ప్రత్యేకంగా అర్బన్ ఏరియాలు లాభం పొందుతున్నాయి గాని, ప్రాంతీయ ప్రాంతాల్లో నష్టపోతున్నాయని వెంటనే వారు రూ.25 వేల కోట్లుకు బడ్జెట్‌ను పెంచి వారు తక్షణమే నిధులు కేటాయించడం జరిగింది. అంటే అప్పటి నుండి వారిద్దరికీ మంచి స్నేహం ఉండేది. అదే స్నేహం వారు ప్రధానమంత్రి అయిన తరువాత కూడా ఉంది. మా రామగుండం ఫర్టిలైజర్ ఫ్యాక్టరీ మూత పడడంతో ఆరోజుల్లో నేను వారి దగ్గరికి వెళ్ళి సార్, మాకు ఫర్టిలైజర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాకి రూ.10 వేల కోట్లు రుణమాఫీ చేస్తే ఈ ఫ్యాక్టరీ రీ-ఓపెన్ అవుతుందని, నేను ఎంపిగా ఉన్నప్పుడు వారిని రిక్వెస్ట్ చేయడం జరిగింది. వారు తక్షణమే వెంకటస్వామి గారిని గుర్తు చేసుకొని, ఫర్టిలైజర్ కార్పోరేషన్‌ను మూతవేయాలి కాని, మీ సౌత్ ఇండియాలో మీ ఒక ఫ్యాక్టరీని మేము రీ-ఓపెన్ చేస్తామని చెప్పి ఆ రోజుల్లో రూ.10 వేల కోట్లు రుణమాఫీ చేయడంతో రామగుండం ఫర్టిలైజర్ ఫ్యాక్టరీ తిరిగి రీ-ఓపెన్ కావడంతో సుమారుగా 5 వేల ఉద్యోగాలు కూడా కల్పించడం జరిగింది. అంటే, డా. మన్మోహన్ సింగ్ గారు ఒక విజన్‌తో ఉండేవారు.

చాలామంది వారు మౌనంగా ఉంటారని అంటున్నారు కాని, ప్రధానమంత్రిగా, ఫైనాన్స్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు వారు కీలకమైన నిర్ణయాలు తీసుకొని దేశానికి ఏది మంచిదో ఆలోచించి దేశాన్ని కాపాడడం జరిగింది. ప్రత్యేకంగా చాలామంది బ్యాంకింగ్‌సిస్టమ్‌లో డైరెక్ట్‌బెనిఫిషియరీస్‌కి నిధులు పోతున్నాయో లేదో తెలుసుకోవడానికి ఆధార్ కార్డు ద్వారా ఫౌండేషన్ వేయడం వంటి అనేక సంస్కరణలు ఆ రోజులలో డా.మన్మోహన్ సింగ్ గారు చేయడం జరిగింది. ప్రపంచంలో జీడీపీ గ్రోత్ రేట్ దాదాపు 3 శాతంగా ఉన్నప్పుడు డా.మన్మోహన్ సింగ్ గారి హయాంలో 8 శాతానికి వచ్చింది. అప్పటికీ కూడా మన భారతదేశంలో కేవలం జీడీపీ గ్రోత్ రేట్ 5 శాతం మాత్రమే ఉంది. 8 శాతం జీడీపీ గ్రోత్ రేట్ పెంచడమంటే అప్పుడు ఉద్యోగాలు ఎక్కువ కల్పించడం, ఇండస్ట్రీలన్నీ కూడా ప్రాస్పర్ కావడం వంటివి జరిగాయి. ఇవన్నీ బాగా జరుగుతూ దేశం ముందుకు వెళుతున్న సమయంలో 2008లో వరల్డ్‌లో ఫైనాన్షియల్ ట్రబుల్ వచ్చింది. అప్పుడు భారతదేశ ఇన్‌ఫ్లేషన్ కంట్రోల్ చేయడానికి డా.మన్మోహన్ సింగ్ గారు నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పుడే సభ్యులు చెప్పినట్లు MNREGA కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లో ఎంప్లాయిమెంట్ కల్పించడం వంటి చర్యలు తీసుకోవడం వలన ప్రపంచంలో 5 శాతం ఇన్‌ఫ్లేషన్ ఉన్నప్పుడు మన దేశంలో కేవలం 2 శాతం మాత్రమే ఉండేది. నిజంగానే డా.మన్మోహన్ సింగ్ గారు కేవలం మన భారతదేశంలో పెద్ద నాయకుడే కాదు, ఆయన ఒక 'ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్ ఆఫ్ ది వరల్డ్' అని జీ-20 మీటింగ్‌లో ఒబామా గారు చెప్పడం జరిగింది. ఇంత మంచిగా భారతదేశాన్ని కంట్రోల్ చేశారు. వారు నా గురువు లాంటి వారని ఒబామా గారు అందరి ముందు చెప్పడం జరిగింది. అంటే కేవలం ప్రధానమంత్రిగా డా.మన్మోహన్ సింగ్ గారు ఆ రోజులలో చర్యలు తీసుకున్నారని చాలామంది అనుకుంటున్నారు. యుఎస్‌ఏతో ఏదైతో న్యూక్లియర్ ట్రీటీ చేశారో, దానిలో యురేనియం రావడం మనకు టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ కావడం, దానితోపాటు మన భారతదేశానికి వ్యతిరేకంగా 28 శాంక్షన్స్ వచ్చాయి అధ్యక్షా. ఆ శాంక్షన్స్ అన్ని తీయడం వలన యుఎస్‌ఏ గవర్నమెంట్‌తో మన ఇండియా-యుఎస్‌ఏ ట్రేడ్ పెరిగింది. ఈ రోజు మన దేశము 2 ట్రిలియన్ ఎకానమీ నుండి 5 ట్రిలియన్ ఎకానమీకి పోతుందంటే ఇది కేవలం డా.మన్మోహన్ సింగ్ గారు వేసిన ఫౌండేషన్ వల్లే సాధ్యమైయింది.

1991 ఆ తరువాత 2004లో వారు చేసిన సంస్కరణలతో మన భారతదేశం ఈ రోజు ముందుకెళుతోంది. అంతేగాక, పది సంవత్సరాలలో ఫారెన్ కరెన్సీ రిజర్వ్స్ సుమారు 25 బిలియన్ డాలర్లు ఉండేవి. డా.మన్మోహన్ సింగ్ గారి హయాంలో 330 బిలియన్ డాలర్లకు చేరింది. అంతేగాక, ఫైనాన్స్ సెక్టార్‌లో డా.మన్మోహన్ సింగ్ గారు ఒక పాత్ర వేశారని అందరూ అనుకుంటారు. అప్పుడు వినోద్ గారు బీసీసీఐలో ఉన్నారు. అప్పుడు వారు ఫైనాన్స్ మినిస్టర్ చిదంబరం గారి వద్దకెళ్ళి క్రికెట్ వరల్డ్ కప్ భారతదేశానికి తీసుకురావాలంటే కన్సెషన్ ఇవ్వాలన్నారు. ఒక క్రికెట్‌కు ఇస్తే ఇతర స్పోర్ట్స్‌కు కూడా కన్సెషన్ ఇవ్వాల్సి వస్తుందని వారు వ్యతిరేకించారు. కాని, డా.మన్మోహన్ సింగ్ గారు ముందు చూపుతో, మన భారతదేశంలో అందరూ క్రికెట్ ఆడుతుంటారు, ఈ క్రికెట్‌ను ప్రోత్సహించాలని క్రికెట్ వలన ఇతర రంగాలలో మనకు బెనిఫిట్ వస్తుందని ఎకానామిస్ట్‌గా వారొక నిర్ణయం తీసుకొని కన్సెషన్ ఇచ్చినప్పటికీ కూడా ఈరోజు క్రికెట్‌లో ఐపిఎల్ ద్వారా భారతదేశం చాలా లాభం పొందుతోంది.

అలాగే ఇందిరాగాంధీ గారు 1975 లో ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఇన్‌ఫ్లేషన్ ఎక్కువగా ఉన్నప్పుడు డా.మన్మోహన్ సింగ్ గారు ఇచ్చిన సలహా నచ్చి ప్రమోషన్ ఇవ్వడం జరిగింది. మంచి నిర్ణయాలు తీసుకోవడంలో, ఎక్కువ మాట్లాడకుండా పని చేయడంలో, నిజంగా మంచి అడ్మినిస్ట్రేషన్ చేస్తూ, పొన్నం ప్రభాకర్ మరియు రాజగోపాల్ రెడ్డి గారు చెప్పినట్లు మేమందరం కూడా తెలంగాణ ఉద్యమం చేసేటప్పుడు వారు ఎప్పుడు కూడా ఎందుకు మీరు యజిటేషన్ చేస్తున్నారని ఎప్పుడు చెప్పలేదు. మేము

మాట్లాడినప్పుడు వారు విని ఖచ్చితంగా తెలంగాణ ఇచ్చేది ఉందని, కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో ఈ తెలంగాణ అంశం పెట్టామని, తెలంగాణ ఇస్తామని చెప్పి ఎప్పుడు కూడా మమ్మల్ని కామ్‌డౌన్ చేసేవారు. అంతేగాకా వారు చాలా సింప్లిసిటితో జీవించారని ఇంతకుముందు సభ్యులు మాట్లాడుతూ చెప్పారు. అంతేగాక, సార్ మంచి టీమ్ ప్లేయర్ అని, వారితో పనిచేసిన వారందరు చెబుతుంటారు. ఎవరైనా ఎటువంటి సలహాలిచ్చినా తీసుకొని దేశానికి ఏది మంచిదో అదే నిర్ణయించేవారని అందరూ గొప్పగా చెప్పుకునేవారు. ముఖ్యమంత్రి గారు భారతరత్న ఇవ్వాలని, విగ్రహాన్ని స్థాపించాలని కూడా రిజల్యూషన్ పెట్టడం జరిగింది. ఇవన్నీ ఖచ్చితంగా త్వరగా పూర్తి చేసి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా పెట్టాలని, ఇంకేదైనా పెద్ద ఇన్‌స్టిట్యూషన్స్ ఉంటే వాటికి.., ఎందుకంటే, డా.మన్మోహన్ సింగ్ గారు పెద్ద ఎకనామిస్ట్. అంబేద్కర్ గారు లండన్ స్కూల్‌లో ఎకనామిక్స్ చదివారు. వీరు ఢిల్లీ స్కూల్‌లో ఎకనామిక్స్ చదివి ఇంత వరల్డ్ లీడర్‌గా, ఎకనామిస్ట్‌గా వరల్డ్ బ్యాంక్‌లో పనిచేశారు. అయితే ఒక పెద్ద ఇన్‌స్టిట్యూషన్‌కు వారి పేరు పెట్టాలని చెప్పి ముగిస్తున్నాను.

1.50 మ. | మిస్టర్ స్పీకర్:- భారత దేశ మాజీ ప్రధానమంత్రి డా.మన్మోహన్ సింగ్ గారి మృతి పట్ల ఈ సభ తీవ్రం సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

వీరు 1932 సెప్టెంబర్ 25వ తేదీన అవిభక్త భారతదేశంలో పంజాబ్ రాష్ట్రంలోని ఘా గ్రామంలో జన్మించారు. వీరు ప్రాథమిక మరియు మాధ్యమిక విద్యను పంజాబ్ రాష్ట్రంలో పూర్తి చేశారు. వీరు పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ (ఎకానమిక్స్)లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు మరియు బ్రిటన్ లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్ ట్రై పోస్ పట్టా పొందారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. వీరు పంజాబ్ యూనివర్సిటీ మరియు ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లలో ఫ్యాకల్టీగా కుడా పని చేశారు.

వీరు అక్టోబర్, 1991 నుండి ఏప్రిల్, 2024 వరకు ఆరు పర్యాయాలు రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరు 1991 నుండి 1996 వరకు స్వర్గీయ పి.వి. నర్సింహారావు గారి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పని చేశారు. 1998 నుండి 2004 వరకు రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. వీరు 2004, మే 22 నుండి 2014, మే 26 వరకు 10 సంవత్సరాల పాటు భారతదేశ 13వ ప్రధానమంత్రిగా పని చేశారు.

వీరు పదవీ కాలంలో భారతదేశానికి ఎన్నో కీలకమైన విజయాలను సాధించారు. ముఖ్యంగా ఆర్థిక, సామాజిక, విదేశాంగవిధానాలు, ప్రాముఖ్యం సంతరించుకున్నాయి. వీరు ప్రధానిగా ఉన్న సమయంలో 'జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ చట్టం', 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం', 'సమాచార హక్కు చట్టం', 'విద్యా హక్కు చట్టం' వంటి గొప్ప చట్టాలు రూపుదిద్దుకున్నాయి.

వీరు పాకిస్తాన్‌తో శాంతి చర్చలు చేపట్టి, భారత పాకిస్తాన్ దేశాల మధ్య సయోధ్యకు కృషిచేశారు. 2008 సంవత్సరంలో ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం నెలకొన్నప్పుడు వీరు అనేక సాహసోపేతమైన సంస్కరణలు చేపట్టి భారతదేశ ఆర్థిక వ్యవస్థను మెరుగైన స్థితిలో నిలపడమే కాకుండా భారతదేశము అత్యధిక జి.డి.పి వృద్ధి రేటును నమోదు చేసుకొనే విధంగా కృషిచేశారు.

వీరు 1971లో భారత ప్రభుత్వ వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారునిగా పని చేశారు. తరువాత కొద్ది కాలానికే 1972లో అర్థిక మంత్రిత్వ శాఖ ప్రధాన సలహాదారునిగా నియమితులయ్యారు. వీరు 1976-80లో ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా, 1982-85లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా, 1985-87లో ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, 1987-90లో జెనీవాలోని సౌత్ కమిషన్ సెక్రటరీ జనరల్‌గా, 1990-91లో ప్రధానమంత్రికి సలహాదారునిగా, 1991లో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఛైర్మన్‌గా పని చేశారు.

వీరు 1991 నుంచి 1996 వరకు ఆర్థిక మంత్రిగా ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో స్వతంత్ర భారతదేశ ఆర్థిక చరిత్రలో కీలక పాత్ర పోషించారు. ఆర్థిక సంస్కరణలకు సంబంధించి సమగ్ర విధానం ఆవిష్కరణలో ఆయన నిర్వహించిన పాత్ర నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొంది, అత్యంత ప్రగతిశీల నేతగా అందరి మన్ననలను పొందారు.

వీరు ప్రజా జీవితంలో ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 1987లో భారత దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో రెండవది అయిన 'పద్మ విభూషణ్', 2002లో 'అత్యుత్తమ పార్లమెంటేరియన్', 2010లో 'వరల్డ్ స్టేట్స్‌మ్యాన్'తో సహా మరెన్నో జాతీయ మరియు అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. కేంబ్రిడ్జ్ అండ్ ఆక్స్‌ఫర్డ్‌తో సహా అనేక ప్రముఖ యూనివర్శిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు కూడా పొందారు.

వీరు అనేక అంతర్జాతీయ సదస్సులకు, భారత దేశం నుంచి ప్రాతినిధ్యం వహించారు. వీరు ప్రధానమంత్రిగా తెలంగాణ రాష్ట్రఏర్పాటుకు సంబంధించిన బిల్లు పార్లమెంటు ఉభయ సభలలో నెగ్గి రాష్ట్రపతి ఆమోదం పొందేవరకు కూడా సంపూర్ణ సహకారం అందించారు. తెలంగాణ ప్రజల సుదీర్ఘ కలను సాకారం చేసిన ఆ మహానేత సేవలు సదా చిరస్మరణీయం.

వీరు 2024, డిసెంబర్ 26వ తేదీన పరమపదించారు. వీరి వయస్సు 92 సంవత్సరాలు.

MR. SPEAKER:- The question is:

"That this House expresses its profound grief at the sad demise of Dr.Manmohan Singh, former Prime Minister of India and conveying deep sense of sympathy to the Members of bereaved family.

And that this House resolves to urge the Union Government to confer the highest Civilian Honour, "Bharat Ratna," on Dr.Manmohan Singh, former Prime Minister of India."

The Resolution moved by the Chief Minister is before the House;

Those who are for the Resolution,

Please say 'Aye',

Those who are against,

Please say 'No',

'Ayes' have it,

'Ayes have it,

The Resolution is unanimously adopted.

మిస్టర్ స్పీకర్:- భారతదేశ మాజీ ప్రధానమంత్రి డా.మన్మోహన్‌సింగ్‌గారి ఆత్మకు శాంతి చేకూరేందుకు రెండు నిమిషాల మౌనం పాటిద్దాం.

(సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.)

MR. SPEAKER:- Now, with the consent of the House, I adjourn the House *sine die*.

(Then, the House adjourned *sine die*

at 1-56 P.M.)

" Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad."